RNI.No.TELTEL/2000/00272

Estd.: 2000

www.voodayam.com /voodayam /Voodayam

Classified Ads English / Telugu
- బహిరంగ ప్రకటనలు
- లీగల్ నోటీసులు
- ఉద్యోగ
- వ్యాపార

Change of Name | Lost of Documents | Legal Notices
Wanted Employees | Real Estate | Public Notices

సెల్: 9247698676

# వుదయం

Simultaneously published from Hyderabad, Adilabad, Khammam, Karimnagar, Guntur & Warangal

**రిపోర్టర్లు కావలెను...**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వుదయం తెలుగు దిన పత్రికకు రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తిగల, అనుభవజ్ఞులైన అభ్యర్థులు కావలెను.

- సిరికొండ అగస్టిన్
BA. L.L.B., M.C.J.
వుదయం ఎడిటర్

సెల్: 9247698676

సంపుటి : 28 || సంచిక :174 || హైదరాబాద్ || శనివారం,ఆగస్టు 02, 2025 || VOODAYAM Telugu Daily || వెల : రూ. 3.00 || పేజీలు : 12



## సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక

- ఉపరాష్ట్రపతి పదవిని భర్తీ చేసేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల
- పదవి ఖాళీ అయితే వెంటనే భర్తీ చేయాలన్న నిబంధన ఉండటంతో ఉపరాష్ట్రపతి రాజీనామా అధికారికంగా ఆమోదం పొందిన వెంటనే సన్నాహాలు
- లోక్ సభ, రాజ్యసభల్లో సభ్యులంతా ఓటు హక్కు కలిగి ఉంటారు
- రాష్ట్రపతి ఎన్నికల్లో అయితే ఎమ్మెల్యేలు కూడా ఓటర్లుగా కూడా ఉంటారు.

### అబద్ధాల ప్రాతిపదికన రాజకీయాలు
# చేయకూడదు

- కమ్యూనిస్టులు సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వల్లే మేం అధికారంలోకి
- అధికారంలోకి తేవడానికి కమ్యూనిస్టులు ఉపయోగపడతారో లేదో విశ్లేషించలేను
- అధికారంలో ఉన్నవారిని దించడానికి మాత్రం పనికొస్తారు
- "తప్పు చేసేవాళ్లను గద్దె దించడంలో కమ్యూనిస్టులు ఎప్పుడూ ముందుంటారు



హైదరాబాద్

అధికారంలోకి తేవడానికి కమ్యూనిస్టులు ఉపయోగపడతారో లేదో విశ్లేషించలేను కానీ, అధికారంలో ఉన్నవారిని దించడానికి మాత్రం పనికొస్తారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. "తప్పు చేసేవాళ్లను గద్దె దించడంలో కమ్యూనిస్టులు ఎప్పుడూ ముందుంటారు. అబద్ధాల ప్రాతిపదికన రాజకీయాలు చేయకూడదని.. రాజకీయాల్లోకి వచ్చినప్పుడే నిర్ణయించుకున్నా. కమ్యూనిస్టులు ఉప్పు లాంటి వారు. ఎన్ని మసాలాలు ఉన్నా.. ఉప్పు లేకపోతే వంటకు రుచి రాదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కమ్యూనిస్టులు చేసిన ఉద్యమాలు ఉపయోగపడ్డాయి. 2004లో - మిగతా3లో



### కాంగ్రెస్ అంటేనే మోసం, దగా,
## నయవంచన పార్టీ

- దోస్తులకు దోచిపెట్టేందుకు చీకటి ఒప్పందాలతో తెరపైకి
- రేవంత్ పాపాల పుట్ట రోజురోజుకూ పెరిగిపోతూనే ఉంది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్

కాంగ్రెస్ అంటేనే మోసం, దగా, నయవంచన అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు.ఫార్మా సిటీ భూముల వ్యవహారంలో మరోసారి తేలిపోయిందని అన్నారు. రేవంత్ పాపాల పుట్ట రోజురోజుకూ పెరిగిపోతూనే ఉందని చెప్పారు. అధికారంలోకి వస్తే ఫార్మా సిటీని రద్దుచేసి, భూములను తిరిగి ఇప్పిస్తామని హామీఇచ్చి, వాటిని ఇతర అవసరాలకు రేవంత్ మళ్లించడం అత్యంత నీచమైన చర్య అని విమర్శించారు. దోస్తులకు - మిగతా3లో

## మా దగ్గర ఆటంబాంబు లాంటి ఆధారాలున్నాయి



- ఈసీని విడిచిపెట్టే ప్రసక్తే లేదు..!
- అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్రంలో ఈసీ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చేపట్టింది
- ఆ విషయాన్ని రుజువు చేసేందుకు తమవద్ద అణుబాంబు లాంటి ఆధారాలున్నాయి
- లోక్‌సభ లో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ



## రష్యాతో భారత్ చమురు బంధమే..

- తమకు చికాకు తెప్పించే అంశం
- అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియో
- 'రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లే ఉక్రెయిన్‌లో మాస్కో యుద్ధ ప్రయత్నాలను నిలబెట్టడానికి సాయపడుతోంది.




## అనిల్ అంబానీకి కొత్త కష్టాలు

- రిలయన్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్, చైర్మన్ అనిల్ అంబానీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సమన్లు జారీ
- ఎకనామిక్ టైమ్స్ నివేదిక ప్రకారం, ఆగస్టు 5న ఢిల్లీలోని తన ప్రధాన కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని సమన్లు
- గత వారం, మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఢిల్లీ నుంచి ముంబై వరకు రిలయన్స్ గ్రూప్‌కు సంబంధించిన దాదాపు 35 ప్రదేశాలపై దాడులు
- ఈ దాడుల సమయంలో, అనేక పత్రాలు, ఆర్థిక లావాదేవీలు, డిజిటల్ రికార్డులు, ఇతర ఆధారాలు స్వాధీనం

## ఎఫ్ 35 విమానాల కొనుగోళ్లకు బ్రేక్

- బ్రిక్స్‌లో భాగమైనందుకు, రష్యా ఆయిల్ కొంటున్నందుకు, తమ వస్తువులపై ఎక్కువ పన్నులు వేస్తున్నందుకు ఇలా అనేక విషయాలను మనసులో పెట్టుకుని ట్రంప్ భారత్‌పై పిడుగులాంటి టారిఫ్‌ను సంధించారు.
- భారత్‌లో పొలిటికల్ దుమారం కూడా చెలరేగింది
- ఈ క్రమంలోనే వాణిజ్య ఒప్పందం గురించి భారత్-అమెరికా మధ్య చర్చలు



### తెలంగాణలో గొర్రెల కుంభకోణంపై
## ఈడీ సంచలన ప్రకటన



హైదరాబాద్

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన గొర్రెల పంపిణీ పథకం కుంభకోణంపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సంచలన ప్రకటన చేసింది. గొర్రెల పంపిణీ పథకంలో వెయ్యి కోట్లకుపైగా అక్రమాలు జరిగినట్లు అధికారిక ప్రకటన చేసింది. 'గొర్రెల పంపిణీ పథకంలో - మిగతా3లో

### కాళేశ్వరం కమిషన్ నివేదికపై
# కమిటీ ఏర్పాటు!



- సీఎం రేవంత్‌రెడ్డికి అందిన కాళేశ్వరం కమిషన్ నివేదిక
- కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంలో అన్ని రకాల వైఫల్యాలు జరిగాయి
- దీనికి కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు పలువురు కారణమని నివేదికలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ స్పష్టం
- వ్యవస్థలు కాకుండా వ్యక్తుల ఇష్టాల ప్రకారం పనులు జరిగాయి
- ఉన్నత స్థాయిలో వచ్చిన ఒత్తిడులకు లొంగి నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకొన్నారు
- ఆర్థిక అవకతవకలు జరిగాయి

హైదరాబాద్

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి కాళేశ్వరం కమిషన్ నివేదికను రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అందజేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ న్యాయ విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. సంబంధిత నివేదికను గురువారం నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు ఆయన అందజేశారు. శుక్రవారం ఆ నివేదిక సీఎంకు చేరింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌తో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు భేటీ అయ్యారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై వీరంతా చర్చించారు. కాళేశ్వరం బ్యారేజీల - మిగతా3లో

## యాదాద్రి పవర్ ప్లాంట్
## మొదటి యూనిట్ జాతికి అంకితం!

- రహదారుల పూర్తికి 280 కోట్ల రూపాయలు మంజూరు చేయడమే కాక క్లియరెన్స్ ఇచ్చాం
- రాష్ట్ర రోడ్లు భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం ప్రారంభ కార్యక్రమంలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి.
- 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్ ప్రారంభం,9
- 70కోట్లతో నిర్మించే ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ పనులకుశంకుస్థాపన చేసిన మంత్రులు



నల్గొండ

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ రాష్ట్రానికి ఆశాదీపమైంది. దీంతో విద్యుత్తు సరఫరాలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నంబర్‌వన్ స్థానంలో నిలువనుంది. సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో దేశంలో ప్రభుత్వ రంగంలో అతిపెద్ద థర్మల్ విద్యుత్ కేంద్రంగా యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ అవతరించింది. దేశ విద్యుత్ రంగానికి దేశానికి కలికితురాయిగా నిలిచిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ మొదటి యూనిట్ ను ప్రభుత్వం జాతికి అంకితం చేసింది. గత ఏడాది డిసెంబర్ లో సీఎం రేవంత్ రెడ్డి రెండవ యూనిట్‌ను జాతికి అంకితం చేశారు. మొదటి, రెండో యూనిట్ల నుంచి పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తితో కాంతులు - మిగతా3లో

## సంపాదకీయం

# కులగణన తక్షణావసరం!

చారిత్రకంగా భారతీయ సమాజం కులవ్యవస్థ ఆధారంగా శతాబ్దాలుగా నిర్మితమై ఉంది. ఇది సామాజిక, ఆర్థిక, రాజకీయ గతిశీలతను ప్రభావితం చేస్తున్నది. ఈ వ్యవస్థను ప్రస్తుతం ఓపెన్ కేటగిరీ (ఒసి), వెనుకబడిన కులాలు (బిసి లేదా ఒబిసి), షెడ్యూల్ కులాలు (ఎస్‌సి), షెడ్యూల్ తెగలు (ఎస్‌టి) అనే వర్గాలుగా విభజించారు. బ్రిటీష్ పాలనా కాలంలో 1881 నుండి 1931 వరకు నిర్వహించిన జనగణనలు కులఆధారిత జనాభా వివరాల్ని సేకరించాయి. కానీ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి 2011 వరకు జరిగిన జనాభా లెక్కల్లో కులాల వివరాల్ని నమోదు చేయలేదు. కాబట్టి ఆయా సామాజిక వర్గాలవారీగా ఖచ్చితమైన జనాభా శాతాలపై స్పష్టత లేదు. స్వాతంత్ర్య అనంతరం భారత ప్రభుత్వం కులగణనను నిలిపివేసి, పదేళ్లకోసారి చేసే జనగణనలో ఎస్‌సి, ఎస్‌టి గణనపై దృష్టి సారించింది. దీనివల్ల ఒసి, ఒబిసి జనాభా డేటా లభ్యత పరిమితమైందని చెప్పవచ్చు. ఒసి, బిసిల గుర్తింపు సామాజిక, ఆర్థిక స్థితిగతులపై ఆధారపడి ఉంటుంది. ఒసి కేటగిరి సాధారణంగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులతో పాటు రిజర్వేషన్ ప్రయోజనాలు పొందని ఇతర కులాల్ని కూడా సూచిస్తుంది. బిసి లేదా ఒబిసిలు సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులుగా రాజ్యాంగం ఆర్టికల్ 15(4) కింద నిర్వచించబడ్డాయి. కానీ, కులవర్గీకరణలో కొంత సంక్లిష్టత నెలకొని ఉంది. కేంద్ర జాబితాలో ఒబిసిలుగా గుర్తించబడిన కొన్ని కులాలు వివిధ రాష్ట్రాలలో ఒసి, ఎస్‌సి లేదా ఎస్‌టిలుగా వర్గీకరించబడ్డాయి. ఉదాహరణకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1970వ దశకంవరకు బిసి జాబితాలో లంబాడా సామాజిక వర్గాన్ని ఎస్‌టి జాబితాలో చేర్చడం జరిగింది. ఒబిసిలను ఎ, బి, సి, డి, ఇ గ్రూపులుగా విభజించారు.తెలంగాణలో మున్నూరు కాపులు బిసి జాబితాలో ఉంటే, ఆంధ్రప్రదేశ్‌లో కాపులు ఒసి జాబితాలో ఉన్నారు. కర్నాటకలో రెడ్లు బిసి జాబితాలో ఉంటే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఒసిలుగా ఉన్నారు. ఇలా వివిధ కులాలు కేంద్ర, రాష్ట్రాల జాబితాలు వేర్వేరుగా ఉండటం వల్ల ఒక రాష్ట్రంలో ఒసిలుగా ఉన్నవారు, మరొక రాష్ట్రంలో బిసిలు జాబితాలో ఉన్నారు. అదే విధంగా బిసిలుగా ఉన్నవారు మరికొన్ని రాష్ట్రాల్లో మరొక వర్గంలో ఉన్నారు. ఇక్కడే అసలు దేశంలో ఒబిసిలు ఎవరు..? బిసిలెవరు అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. జన్మ ద్వారా వచ్చిన కులాన్ని మార్చడం సాధ్యం కాదు కానీ, వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ వెనకబాటు ఆధారంగా వారికి రిజర్వేషన్ కల్పించి వారి పురోభివృద్ధికి చర్యలు తీసుకోవడం అనివార్యం. అందుకే ప్రభుత్వం కుల, మత, వర్గాలకు అతీతంగా బిసి, ఎస్‌సి, ఎస్‌టి వర్గాలతోపాటు వారి రిజర్వేషన్ ప్రయోజనాలకు భంగం కలగకుండా ఒసిల్లో ఉన్న పేదలకు కూడా ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ కల్పించింది. రిజర్వేషన్ మినహాయించిన తర్వాత మిగిలిన ఓపెన్ కేటగిరీలో అన్ని సామాజిక వర్గాలవారు సమానంగా పోటీపడే అవకాశం ఉంటుంది. ఈ అంశంపై సుప్రీం కోర్టులో వాదనలు జరిగినపుడు ఈ చట్టానికి అనుకూలంగా తీర్పు రావడం గమనార్హం. 1953లో ఏర్పాటైన కాకా కలేల్కర్ కమిషన్ దాదాపు రెండు వేలకు పైగా వెనుకబడిన కులాలను గుర్తించింది. కానీ దాని సిఫార్సులు అమలు కాలేదు. 1979లో ఏర్పాటైన మండల్ కమిషన్ దాదాపు మూడు వేల కులాలను ఒబిసిలుగా వర్గీకరించి, 27 శాతం రిజర్వేషన్‌ను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థలలో సిఫారసు చేసింది. 1990లో విపి సింగ్ ప్రభుత్వం ఈ సిఫారసును అమలు చేసింది. ఇది దేశవ్యాప్తంగా రాజకీయ చర్చలకు కేంద్ర బిందువుగా మారింది.1992లో ఇందిరా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు 27% రిజర్వేషన్‌ను సమర్థించి, క్రీమీలేయర్‌ను మినహాయించాలని ఆదేశించింది. తదనంతరం, ఈ రిజర్వేషన్ ప్రభుత్వ విద్య, ఉద్యోగ అవకాశాలకు విస్తరించబడింది. రిజర్వేషన్ విధానం ఒబిసిలకు విద్య, ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించింది. అయితే, రాజకీయ రిజర్వేషన్ల విషయంలో ఎస్‌సి, ఎస్‌టిలకు ఉన్నట్లు ఒబిసిలకు చట్టసభల్లో ప్రత్యేక కోటా లేదు. భారతీయ సమాజంలో ఎస్‌సి, ఎస్‌టిలతో పోల్చితే కొంతవరకు సామాజికంగా, ఆర్థికంగా బిసిలు పురోభివృద్ధి సాధించినందున ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు దాదాపు జనాభా శాతానికి సమానంగా రిజర్వేషన్ కల్పించినప్పటికీ, బిసి జనాభా దామాషా ప్రకారం వారికి రిజర్వేషన్ కల్పించి ఉండకపోవచ్చు. సమకాలీన సందర్భంలో కులగణన అనేది ఒక కీలక అంశంగా మారింది. ఈసారి జరగనున్న జనగణనలో కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ గణన ఆయా సామాజిక వర్గాల జనాభా, ఆర్థిక స్థితిగతులపై స్పష్టతనిచ్చే అవకాశం ఉంటుంది. ఆయా సామాజిక వర్గాలకు పూర్తిస్థాయిలో రిజర్వేషన్ ఫలాలు అందాలంటే క్రీమీలేయర్‌ను పకడ్బందీగా అమలు చేయాల్సి ఉంటుంది. ఆర్థికంగా స్థిరపడిన సామాజికవర్గాలు తరతరాలుగా రిజర్వేషన్ ప్రయోజనాలను పొందడం వల్ల, నిజంగా వెనుకబడిన సమూహాలకు అవకాశాలు తగ్గుతున్నాయనే విమర్శలు కూడా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం క్రీమీ లేయర్ ఆదాయ పరిమితిని సమీక్షించడం ద్వారా రిజర్వేషన్ ఫలాల్ని అట్టడుగువర్గాలకు అందించే ప్రయత్నం చేయవచ్చు. రాష్ట్రాలకు ఒబిసి జాబితాలను నిర్వహించే అధికారం 2021లో 105వ రాజ్యాంగ సవరణ ద్వారా పునరుద్ధరించబడింది. 1931 జనగణన ఆధారంగా అంచనా వేయబడిన జనాభా శాతాలు దాదాపు వందేళ్ళ క్రితం సేకరించబడినవి. ప్రతి జనగణనలో ఎస్‌సి,ఎస్‌టిల జనాభా వివరాల్ని సేకరిస్తున్నప్పటికీ రాబోయే జనగణనతోపాటు చేసే కులగణన ఈ అంతరాన్ని పూరించి, ఖచ్చితమైన గణాంకాల్ని(డేటా)తో రిజర్వేషన్ విధానాలను మరింత సమర్థవంతం చేయగలదు. వివిధ రాష్ట్రాలలో కుల వర్గీకరణల సంక్లిష్టత, ఓటు బ్యాంకు రాజకీయాలు, క్రీమీలేయర్ వంటి సవాళ్లు సామాజిక న్యాయ సాధనలో అడ్డంకులుగా ఉన్నాయి. వచ్చే జనగణన ఫలితాలు ఈ సవాళ్లను అధిగమించి, సమానత్వం, సామాజిక న్యాయ సాధనకు దోహదపడాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారుతున్నాయి. ఈ రోజుల్లో కూడా దేశవ్యాప్తంగా ఒసి వర్గంలో కొన్ని కులాలు, బిసి హోదాను, బిసి వర్గంలో ఉన్న కులాలు ఎస్‌సి, ఎస్‌టి సామాజిక వర్గంలో చేర్చమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీద ఒత్తిడి చేస్తున్న సంఘటనలు నిత్యకృత్యం అయ్యాయి. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 78 ఏండ్లు అయినా అట్టడుగు ప్రజలకు ఇంకా పూర్తిస్థాయిలో రిజర్వేషన్ ఫలాలు అందట్లేదు అంటే చట్టాలను పునఃసమీక్షించుకోవడం కన్నా ముందు క్షేత్ర స్థాయిలో వాటి అమలు తీరుపైన ప్రభుత్వాలు, పౌరసమాజం దృష్టి సారిస్తే సామాజిక న్యాయంతోపాటు సమసమాజం నిర్మితం అయ్యే అవకాశం ఉంటుంది.

# మానవాళి ఎదుర్కొంటున్న సమాళ్లు


నేటి 8.2 బిలియన్ల ప్రపంచ జనాభా డిజిటల్ ఏఐ యుగంలో మునిగి తేలుతున్నాడు. నవ్య మానవుడు డిజిటల్ వెలుగు జిలుగుల్లో ప్రతిసృష్టి చేస్తున్నానని విర్రవీగుతున్నాడు. తన అతి తెలివికి తానే మురిసి పోతూ, అన్నింటినీ జయిస్తున్నానని గర్వపడుతున్నాడు. మనిషి ఆశకు హద్దులు ఉండడం లేదు. నరుడి దురాశలు, అనాలోచిత కార్యాలతో తన బొందను తానే తవ్వుకుంటున్నారు. తాను కూర్చున్న భూమాత ఒడిని కలుషితం చేస్తూ నరికి వేస్తున్నాడు. నేటి లాభం కోసం రేపటి తరాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాడు. తన చెడు చేతలతో భూమిని సహితం నష్టపరుస్తున్నాడు. నవ్య నరుడి విచక్షణారహిత చేష్టలతో పలు ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నాడు. నేడు ప్రపంచ మానవాళితో పాటు భూమి సహితం పలు సవాళ్లను, ముప్పుల ముంగిట్లో నిలబడి ఉన్నది. ప్రతికూల వాతావరణ మార్పులు, పర్యావరణ కాలుష్యం, జీవ వైవిధ్యానికి విఘాతం, నీరు–ఆహార కొరత, భూతాపం, మహమ్మారి వేటలు, అదిక జనాభా, మానవీయ సంక్షోభాలు, ఉగ్రవాదం, తెలియని లేదా ఊహించని ప్రమాదాలు, కరోనల్ మాస్ ఎజెక్షన్స్, అనవసర యుద్ధాలు, ప్రమాదకర అంటువ్యాధులు లాంటివి రానున్న తరాలకు మాత్రమే కాకుండా భూగ్రహానికి కూడా ముప్పుగా పరిగణించనున్నాయి. ఐరాస నివేదిక ప్రకారం పారిశ్రామిక విప్లవం ముందుతో పోల్చితే నేడు భూమి సగటు ఉష్ణోగ్రతలు 1.1 డిగ్రీల వరకు పెరిగినట్లుగా గమనించారు. గాలిలో కార్బన్ డై ఆక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్స్, మీథేన్, ఓజోన్, నీటి ఆవిరి లాంటి గ్రీన్ హౌజ్ లేదా హరిత గృహ వాయువుల పరిమాణం పెరగడంతో ఉష్ణోగ్రతలు కూడా పెరగడం ప్రారంభమైంది. ఈ విధంగా గ్రీన్ హౌజ్ వాయువుల కారణంగా భూమి ఉష్ణోగ్రతలు భారీగా పెరగడాన్ని "భూతాపం" లేదా "గ్లోబల్ వార్మింగ్" అని పిలవడంతో పాటు ఇలాంటి ప్రక్రియను "హరిత గృహ ప్రభావం" లేదా "గ్రీన్ హౌజ్ ఎఫెక్ట్" అని పేర్కొనడం గమనార్హం. ప్రకృతి అందించిన సహజ స్వచ్ఛమైన గాలి, నీరు, నేలను నవ్య నరుడు గరళంగా మార్చుతున్నాడు. మహానగరాల్లో గాలి పూర్తిగా విషతుల్యంగా మారుతోంది.

పిఎం2.5 (పార్టిక్యులేట్ మ్యాటర్2.5) విలువలు పరిమితులకు మించి నాలుగు రెట్లు అధికంగా ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ధరణికి సంబంధించిన ఎనిమిదిలో ఏడు అంశాలు పరిమితులను దాటి నమోదు కావడం ఓ ప్రమాద హెచ్చరికగా అర్థం చేసుకోవాలి. గాలి, నేల, నీరు కలుషితం కావడంతో జీవకోటి ఆరోగ్య మనుగడ ప్రశ్నార్థకంగా మారిపోయింది. సహజ వనరులు పలుచబడుతున్నాయి. పలు రకాల కాలుష్య మేఘాలు కమ్ముకొని, ధరణికి దడ పుట్టిస్తున్నాయి. అడవుల నరికివేత, కార్చిచ్చులు, వన్యప్రాణుల అక్రమ వేట, జీవుల ఆవాసాల విచ్ఛిన్నం లాంటి పలు కారణాలతో పలు జీవజాతులు అంతరించే ప్రమాదం ఏర్పడింది. అంచనాల ప్రకారం గత కొన్ని శతాబ్దాల్లో దాదాపు 42,000 జాతులు అంతరించే ప్రమాదంలో ఉన్నాయని, వాటిని కాపాడితేనే జీవ వైవిధ్య సమతాస్థితి బాగుంటుందని నిపుణులు సూచిస్తున్నారు. గత దశాబ్ద కాలంలో దాదాపు 467 జాతులు అంతరించి ఉండవచ్చని అంటున్నారు. నీటి కొరత, ఆహార అభద్రత రానున్న కాలంలో మరింత పెరిగే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

ప్రతికూల వాతావరణం కారణంగా వరదలు, సునామీలు, కరువులు లాంటివి మానవాళిని, జీవకోటిని వణికిస్తున్నాయి. భూతాపం పెరిగిపోతున్న వేళ వ్యవసాయ ఉత్పత్తులు తగ్గుతూ, కరువు కాటకాలు పెరుగుతాయి. జీవ వైవిధ్యం దెబ్బతినడంతో కరోనా లాంటి మహమ్మారులు రెచ్చిపోతాయి. ప్రజారోగ్యం దెబ్బతింటుంది. నడమంత్రపు నరుడి దురాశకు సహజ వనరులు తరిగి పోతున్నాయి. గత కొంత కాలంగా కొనసాగుతున్న రష్యా–ఉక్రెయిన్, ఇజ్రాయిల్–పాలస్తీనా యుద్ధాలతో పాటు పలు మానవీయ సంక్షోభాలు కూడా మానవ మనుగడను వేలెత్తి చూపుతున్నాయి.

# నటనకు భాష్యం చెప్పిన బళ్ళారి రాఘవ

తెలుగు నాటక రంగ చరిత్రతో మహా నటుడు బళ్ళారి రాఘవ కు విడదీయరాని బంధం సంబంధం అనుబంధం ఉన్నాయి. తెలుగు నాటకరంగంలో తొలి నాటకకర్త, తొలి దర్శకుడు, తొలి ప్రదర్శనకారుడైన కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినమైన తెలుగు నాటక రంగ దినోత్సవ దినమే బళ్ళారి రాఘవ వర్ధంతి దినం కావడం యాదృచ్ఛికం. రాఘవ 1880 ఆగస్టు 2న అనంతపురం జిల్లా, తాడిపత్రిలో శేషమ్మ, నరసింహాచార్యులు అనే పుణ్య దంపతకులకు శ్రీ వైష్ణవ కుటుంబంలో జన్మించారు. వీరి ఇంటి పేరు తాడిపత్రి, కానీ బళ్లారిలో స్థిరనివాసం ఏర్పరచుకోవటం వలన బళ్ళారి రాఘవగా ప్రసిద్ధులయ్యారు. రాఘవకు తల్లిదండ్రులు పెట్టిన పేరు బసప్ప. వైష్ణవ మతాచారం ప్రకారం పేరు చివర ఆచార్యులుంటుంది. ఆయనను అందరూ ప్రేమగా రాఘవ అని పిలిచేవారు. అలా ఆయన కాలక్రమేణా బళ్ళారి రాఘవాచార్యులుగా ప్రఖ్యాతి గాంచారు. బళ్ళారి లో ప్రాథమిక మాధ్యమిక విద్య ను పూర్తిచేసి, మద్రాసులోని క్రిష్టియన్ కళాశాల నుండి పట్టభద్రులయ్యారు. తర్వాత న్యాయశాస్త్రాన్ని కూడా అభ్యసించారు. మద్రాసులోనే న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. అచిరకాలంలో నేక్రిమినల్ లాయర్ గా పేరు ప్రఖ్యాతులు, విశేష ధనాన్ని కూడా ఆర్జించారు. ఆ రోజుల్లో ఉన్న ఆంగ్ల ప్రభుత్వం, వీరి ప్రజ్ఞా పాటవాలను గుర్తించి పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమించటమే కాకుండా 'రావు బహదూర్' అనే బిరుదుతో సత్కరించారు. చిన్నతనం నుండి నటన పట్ల అభిరుచి కలిగి, తన పన్నెండవ ఏటనుండే నటనను ప్రారంభించారు. చిన్నతనంలోనే, బళ్లారిలో వీరు షేక్స్పియర్ అనే సంస్థను స్థాపించి, ఆంగ్ల నాటక ప్రదర్శనలను జనరంజకంగా ప్రదర్శించారు. ఆ రోజుల్లో శ్రీ కోలాచలం శ్రీనివాసరావు గారికి బళ్లారిలో 'సుమనోరమ'అనే నాటక సంస్థ ఉండేది. మొదట్లో, శ్రీ రాఘవ ఆ సంస్థలోనే నాటక ప్రదర్శనలు ఇచ్చేవారు. ఆ సంస్థ తరపున రాఘవ నటించిన మొదటి నాటకం "సునందినీ పరిణయం" దానిలో రాఘవది 70 ఏళ్ల వృద్ధుని పాత్ర. అప్పటికి రాఘవ వయస్సు 27 ఏళ్లు మాత్రమే. ఆ ముదుసలి పాత్రలో చక్కగా నటించి ప్రేక్షకుల ప్రశంసలు పొందారు హరిశ్చంద్ర, బృహన్నల, పాదుకా పట్టాభిషేకం, సావిత్రి, రామరాజు చరిత్ర, రామదాసు, తప్పెవరిదీ?, సరిపడని సంగతులు మొదలైన వీరి నాటకాలను ప్రజలు ఇష్టపడి చూసేవారు. ప్రతినాయక పాత్రలైన హిరణ్యకశిప, దుర్యోధన, మాయలఫకీర్ మున్నగు పాత్రలను అత్యత్భుతంగా పోషించేవారు. నవరసాలనూ ఒకేసారి ముఖంలో చూపించగల దిట్టగా పేరొందారు. ఒకసారి దర్శకుడు పి. పుల్లయ్య చదువుకుంటున్న రోజుల్లో మద్రాసులో ఓ లండన్ థియేటర్ వారితో కలసి రాఘవ గారు షేక్స్పియర్ డ్రామాలో నటించారట. అప్పటికి విద్యార్థిగా ఉన్న పుల్లయ్య ఆ నాటకాన్ని చూసారట. సగం నాటకం పూర్తికాగానే గ్రీన్ రూంలోకి వెళ్లి, తనను తాను పరిచయం చేసుకొని, ఈ నాటకం నిండా బ్రిటిష్ నటుల హవాయే కనిపిస్తోంది , మీ పాత్ర తేలిపోతోందేమిటి?' అని రాఘవ గారిని అడిగారట. అప్పుడు రాఘవ గారు ' ఆఖరి సీన్ చూసి అప్పుడు రా!' అన్నారట. చివరి సీన్ పూర్తయింది. తెరపడింది. పుల్లయ్య గారు నేరుగా పోయి రాఘవాచార్యుల వారి పాదాలకు నమస్కరించారట! నాటకంకు వినోదమే ప్రధాన లక్ష్యం కాకూడదని, సంఘ దురాచారాలు, సంఘ సంస్కరణలను ప్రజలకు తెలియచేయటానికి, సామాజిక చైతన్యానికి ఉపయోగపడే ఒక గొప్ప ప్రక్రియగా నాటకాలను ప్రదర్శించాలని ఆయన చెపుతుండేవారు. శ్రీ లంక, ఇంగ్లాండ్, ఫ్రాన్సు, జర్మనీ, స్విట్జర్ లాండ్ లాంటి పలు విదేశాలను దర్శించి ఆయా దేశాల్లో భారతీయ రంగస్థల వైభవాన్ని గురించి పెక్కు ప్రసంగాలను చేసారు. 1928లో రాఘవ గారి ఇంగ్లాండ్ పర్యటనలో ఆయనకు జార్జిబెర్నార్డ్ షాతో పరిచయమైంది. రాఘవ ప్రతిభను కొనియాడుతూ బెర్నార్డ్ షా అన్న మాటలు, "మీరు భారత దేశంలో పుట్టారు, ఇంగ్లాండు లో పుట్టివుంటే షేక్స్ పియర్ అంత గొప్ప కీర్తిని పొందేవారు" అని ప్రశంసించారట. 1919లో బెంగుళూరులో రాఘవ నటించిన 'పఠాన్ రుస్తుం' నాటకాన్ని రవీంద్రనాథ్ ఠాగూర్ చూసి తన్మయత్వం చెంది, రాఘవ నటనా ప్రతిభను కొనియాడారు. 1927లో జ మహాత్మా గాంధీ... రాఘవ నటించిన నాటకాన్ని చూసి, ఆనందాన్ని పట్టలేక 'రాఘవ మహరాజ్ కి జై' అని పొగిరారట. బళ్ళారి రాఘవ నటుడిగా తెలుగులో ఎంత ఖ్యాతి గడించారో, కన్నడంలో కూడా అంత ప్రఖ్యాతిని గడించారు. రాఘవ నటించిన ఇంగ్లీషు నాటకాలను చూసినవారు ఆయన తెలుగు నటుడంటే ఎవరూ నమ్మలేరు. భాషలపై, భావ ప్రకటనలపై, హావభావాలలో ఆయనకున్న పట్టు అటువంటిది. ఆ రోజుల్లో స్త్రీలు రంగస్థల ప్రదర్శనలు ఇవ్వటానికి జంకేవారు. కారణాలు అనేకం ఉన్నాయి. వీరు స్త్రీలను రంగస్థలంపైన అభినయించటానికి ప్రోత్సహించారు. కొప్పరపు సరోజినీ, కొమ్మూరి పద్మావతి, కాకినాడ అన్నపూర్ణ లాంటి పలువురు స్త్రీ ప్రముఖులను రంగస్థలానికి పరిచయం చేసిన ఘనత బళ్ళారికే దక్కింది.బళ్ళారి చేత పరిచయం చేయబడిన కే. యస్. వాసుదేవరావు, బసవరాజు అప్పారావు, బందా కనకలింగేశ్వర రావు లాంటి గొప్ప వారు ప్రఖ్యాత నటులుగా పేరు తెచ్చుకున్నారు. 1936 లో శ్రీ హెచ్. యమ్. రెడ్డి గారి దర్శకత్వంలో వచ్చిన 'ద్రౌపదీ మాన సంరక్షణం' అనే సినిమాలో దుర్యోధన పాత్రను పోషించారు. ఆ పాత్రను అద్భుతంగా పోషించి ప్రజా బాహుళ్యంలో ఖ్యాతి గడించు కున్నారు.




రైతుబిడ్డ, చండిక మొదలైన కొన్ని సాంఘీక చిత్రాలలో కూడా నటించారు. తరువాత కాలంలో మాస్టర్ తారానాథ్ అనే ఆధ్యాత్మిక గురువు ప్రభావం చేత, తుంగభద్రా నదీ తీరంలో తారానాథ్ గారు నిర్మించిన ఒక ఆశ్రమానికి భూరిగా విరాళం ఇవ్వటమే కాకుండా, ఆయన శిష్యరికంలో, ఆధ్యాత్మిక జీవనం సాగించారు. మహాకవి శ్రీశ్రీకి బళ్లారిలో సాన్నిహిత్యం ఉండేది. రాఘవ చివరి రోజుల్లో అనారోగ్యం చేత చిక్కి శల్యమై పోయారు. ఆయనను కలిసి, పరామర్శించ టానికి ప్రత్యేకంగా శ్రీశ్రీ బళ్ళారి వెళ్ళారు. ఆ సమయంలో, రాఘవ శ్రీశ్రీని, "ఇంత దూరం వచ్చారు కదా! హంపీ శిధిలాలు కూడా చూసిపోవచ్చు కదా!"అని అన్నారట. అందుకు శ్రీశ్రీ. మిమల్ని చూశాం కదా! ఇంక వాటిని ప్రత్యేకంగా చూడనవసరం లేదు అంటే వారు కడుపుబ్బ నవ్వు కున్నారట. రాఘవ సేవలకు గుర్తింపుగా ఆంధ్ర కళాప్రపూర్ణ బిరుదుతో ప్రజలు, సంస్థలు ఆయనను సత్క రించాయి. బళ్లారి రాఘవ జీవిత చరమాంకం వరకూ నటించి, అనారోగ్య కారణాలతో 1946 ఏప్రిల్ 16న తెలుగు కళామతల్లి ఒడిలో శాశ్వత నిద్రలోకి జారు కున్నారు.

రామ కిష్టయ్య సంగన భట్ల...

# జాతీయ పతాక రూపకర్త

భారతీయులు సగర్వంగా, సగౌరవంగా తలెత్తి వందనం చేసే, భారత సార్వభౌమాధికారానికి ప్రతీక అయిన త్రివర్ణ పతాక రూపకర్త పింగళి వెంకయ్య. స్వాతంత్ర్య సమరయోధునిగా, వ్యవసాయ, భూగర్భ ఖనిజ శాస్త్రవేత్తగా, జపనీస్ భాషా బోధకునిగా, చిత్రకారునిగా, వివిధ దేశాల పర్యాటకునిగా, బహుముఖ ప్రజ్ఞ కలిగిన వెంకయ్యను భారతీయులంతా గుర్తు చేసుకోవాల్సిన సందర్భం అనివార్యం. 1878 ఆగస్టు 2న కృష్ణాజిల్లా పెద్ద కళ్ళేపల్లెలో, జన్మించిన వెంకయ్య, భట్లపెనుమర్రిలో విద్యాభ్యాసం ముగించుకొని, తన 19 వ ఏట ముంబై వెళ్లి సైన్యంలో చేరారు. మద్రాసులో ప్లేగు ఇనస్పెక్టరు శిక్షణ పూర్తి చేసి, కొంతకాలం బళ్లారిలో ప్లేగ్ ఇనస్పెక్టరుగా పనిచేసారు. అతని జ్ఞాన దాహం అంతులేనికి. శ్రీలంక వెళ్ళి కొలంబోలోని సిటీ కాలేజీలో పొలిటికల్ ఎకనమిక్స్ ప్రత్యేక విషయంగా చదివి కేంబ్రిడ్జ్ సీనియర్ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యారు. కొంతకాలం రైల్వేలో గార్డుగా పనిచేసాడు. ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి లాహోర్ లోని డి.ఎ.వి. కాలేజీలో చేరి, సంస్కృతం, ఉర్దూ, జపాన్ భాషల్లో మంచి పాండిత్యం సంపాదించారు. జపాన్ భాషలో అనర్గళంగా మాట్లాడే వెంకయ్య గారిని "జపాన్ వెంకయ్య" అని పిలిచేవారు. 1899 – 1902 మధ్య డచ్ సైన్యానికి వ్యతిరేకంగా, దక్షిణాఫ్రికాలో బోయర్ యుద్ధంలో పాల్గొన్నారు. అక్కడే ఆయనకు స్వాతంత్రోద్యమ నిర్దేశకులు, భావిభారత జాతిపిత మహాత్మా గాంధీతో పరిచయం ఏర్పడింది. దక్షిణాఫ్రికాలో ఉండగా మహాత్మా గాంధీని కలిశారు. గాంధీతో వెంకయ్యకు ఏర్పడిన ఈ సాన్నిహిత్యం అర్ధశతాబ్దం పాటు నిలిచింది. భూగర్భ ఖనిజ శాస్త్రవేత్తగా మైకా, వజ్రాలపై ఆయన విస్తృత పరిశోధనలు జరిపారు. స్వదేశం వస్తూ అరేబియా, ఆఫ్ఘనిస్థాన్ లు చూచి వచ్చారు. గాంధీజీ పరిచయం అయిన నాటి నుండి జాతీయ జెండా ఎలా ఉండాలనే సమస్యనే తన అభిమాన విషయంగా పెట్టుకొని, దాని గురించి దేశంలో ప్రచారం ప్రారంభించారు. 1913 నుండి ప్రతి కాంగ్రెస్ సమావేశానికి హాజరై, నాయకులందరితోనూ జాతీయ పతాక రూపకల్పన గురించి చర్చలు జరిపారి. 1916లో "భారత దేశానికి ఒక జాతీయ పతాకం" అనే ఆంగ్ల గ్రంథాన్ని రచించారు. 1916 లో "నీడ్ ఫర్ నేషనల్ ఫ్లాగ్" పేరున 30 నమూనాలతో జాతీయ పుస్తక రచన గావించారు. ఈ గ్రంథానికి అప్పటి వైస్రాయ్ కార్యనిర్వాహక సభ్యుడైన కేంద్రమంత్రి సర్ బి.ఎన్.శర్మ ఉత్తేజకరమైన పీఠిక రాశారు. 1916లో లక్నోలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో వెంకయ్య తయారు చేసిన జాతీయ జెండానే ఎగుర వేశారు. 1919లో జలంధర్ వాస్తవ్యులైన "లాలా హన్స్ రాజ్" మన జాతీయ పతాకంపై రాట్నం చిహ్నముంటే బాగుంటుందని సూచించగా గాంధీజీ దాన్ని అంగీకరించారు. 1921లో అఖిల భారత కాంగ్రెస్ సమావేశాలు బెజవాడలో జరిగాయి. గాంధీజీ వెంకయ్యను ఆ సమావేశానికి పిలిపించి కాషాయం, ఆకుపచ్చ రంగులు కలిగి, మధ్య రాట్నంగల ఒక జెండాను చిత్రించమని కోరారు. మహాత్ముడు సూచించిన ప్రకారంగానే, ఒక జెండాను సమకూర్చాడు వెంకయ్య. అనంతరం వచ్చిన ఆలోచనల మేరకు, సత్యం, అహింసలకు ప్రత్యక్ష నిదర్శనమైన, తెలుపు రంగు కూడా ఉండాలని గాంధీజీ అభిప్రాయ పడగా, వెంకయ్య ఆ జెండాలో అదనంగా తెలుపు రంగును చేర్చి, నేటి త్రివర్ణ పతాకాన్ని దేశానికి ప్రసాదించారు. "మడత పెడితే పిడికెడే కానీ, కోటానుకోట్ల భారతీయుల ప్రియ వస్త్రం"గా "గాంధీజీ"చే, వెంకయ్య రూపకల్పన చేసిన జాతీయ పతాకం ప్రశంసా పాత్రమైంది. 1947, జూలై 22 వ తేదీన భారత రాజ్యాంగ సభలో నెహ్రూ జాతీయ జెండా గురించి ఒక తీర్మానం చేస్తూ, మునుపటి త్రివర్ణ జెండాలోని రాట్నాన్ని తీసేసి, దాని స్థానంలో అశోకుని ధర్మచక్రాన్ని చిహ్నంగా ఇమిడ్చారు. చిహ్నం మార్పు తప్పితే పింగళి వెంకయ్య రూపొందించిన జెండాకు నేటి జెండాకు తేడా ఏమీ లేదు. అశోకుని ధర్మచక్రం మన పూర్వ సంస్కృతికి సంకేతం. పింగళి వెంకయ్య 1906 నుంచి 1922 వరకు భారత జాతీయోద్యమం లోని వివిధ ఘట్టాలలో పాల్గొన్నారు. వందేమాతరం, హోమ్‌రూల్ ఉద్యమం, ఆంధ్రోద్యమంలాంటి ప్రసిద్ధ ఉద్యమాలలో ప్రధాన పాత్రధారిగా ఉన్నారు. భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత ఆయన బెంగుళూరు, మద్రాసు లలో "రైల్వే గార్డు"గా పనిచేశారు. ఆ తరువాత కొంత కాలము బళ్లారిలో "ప్లేగు అధికారి"గా ప్రభుత్వ ఉద్యోగము చేశారు. వెంకయ్యలో ఉన్న దేశభక్తి ఆయనను ఎంతో కాలము ఉద్యోగము చేయనివ్వలేదు.1906 నుండి 1922 వరకు జాతీయోద్యమాలతో పాటు మునగాల పరగణా నడిగూడెంలో జమీందారు రాజా బహదూర్ నాయని రంగారావు కోరిక మేరకు, నడిగూడెంలో నివాసముండి, పత్తి మొక్కలలోని మేలు రకముల పరిశోధనలో వినియోగించారు. నడిగూడెంలో వ్యవసాయ క్షేత్రాన్ని నిర్మించాడు. ఈ పరిశోధనలలో "కంబోడియా పత్తి" అను ఒక ప్రత్యేక రకమైన పత్తి మీద విశేష కృషి చేశారు. అయితే వెంకయ్య జీవిత చరమాంకం దయనీయ స్థితిలో ముగిసింది.1960 లో భారత ప్రభుత్వం భూగర్భ ఖనిజాలు సంస్థ సలహాదారునిగా వెంకయ్యకు ఇచ్చే గౌరవ వేతనాన్ని సైతం నిలిపి వేసింది. వృద్ధాప్యంలో ఆర్థిక బాధలు ఆయనను చుట్టు ముట్టాయి. మిలటరీలో పని చేసినందుకు విజయవాడ చిట్టినగరులో ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో, ఆయన గుడిసె వేసుకొని దారిద్ర్య జీవితాన్ని గడపవలసి వచ్చింది. జీవితాంతం దేశం కొరకు, స్వాతంత్ర్యం కొరకు పోరాడిన వెంకయ్య చివరి రోజుల్లో తిండికి కూడా మొహం వాచి, నానా అగచాట్లు పడినట్లు ' త్రివేణి ' సంపాదకులు డా. భావరాజు నరసింహారావు పేర్కొన్నారు. అంతిమదశలో విజయవాడలో డా. కె.ఎల్.రావు, డా.టి.వి.ఎస్.చలపతిరావు, కాట్రగడ్డ శ్రీనివాసరావు మున్నగు పెద్దలు 1963 జనవరి 15న వెంకయ్యను సత్కరించి, కొంత నిధిని అందించారు. కన్నుమూసే ముందు ఆయన చివరి కోరికను వెల్లడిస్తూ " నా అంత్య దశ సమీపించింది. నేను చనిపోయిన తర్వాత త్రివర్ణ పతాకాన్ని నా భౌతిక కాయంపై కప్పండి. శ్మశానానికి చేరిన తర్వాత ఆ పతాకం తీసి అక్కడ ఉన్న రావి చెట్టుకు కట్టండి. ఇది నా తుది కోరిక " అన్నారు. ఆత్మాభిమానానికి మారుపేరైన వెంకయ్య, కడు పేదరికాన్ని అనుభవిస్తూ, 1963 జూలై 4న విజయవాడలో తుది శ్వాస వదిలారు. 1964 లో జూలైలో నాటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి, వెంకయ్య చిత్రపటాన్ని ఆవిష్కరించినా, విజయవాడ గాంధీ హాల్ నందు విగ్రహావిష్కరణ జరిగినా, భారతీయులు ఆచంద్ర తారార్కం గుర్తుంచు కోవలసిన పింగళి వెంకయ్యకు... రావలసిన గౌరవం రాకపోవడం నిజంగా బాధాకరం. గత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాదులో ట్యాంక్ బండ్ పై ఆయన కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేసి ఆయన దర్శన భాగ్యం ప్రజలకు లభింపజేసి, కొంతలో కొంతైనా ప్రజలకు గుర్తుండేలా చేసింది.



రామ కిష్టయ్య సంగన భట్ల...

## స్త్రీ స్వేచ్ఛ కోసం నిరంతర పోరాటం

మల్లాది సుబ్బమ్మ (ఆగస్టు 2, 1924 – మే 15, 2014) ఒక విభిన్న భావజాలానికి ప్రాతినిధ్యం వహించిన హేతువాది, స్త్రీవాద రచయిత్రి, సంఘ సంస్కర్త. గుంటూరు జిల్లా రెపల్లె మండలం పోతార్లంకలో జన్మించిన ఆమె బాల్యం నుంచే సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వివక్షను గమనించి, ఆత్మలో మలుచుకున్న చైతన్యాన్ని కాలంగా మార్చి వేశారు. సమానత్వం, స్వేచ్ఛ, విద్యా హక్కుల కోసం ఆమె సాగించిన పోరాటం ఆమె జీవితాన్ని సమాజ సేవకు అంకితం చేసేందుకు దోహదపడింది. ఆమె స్త్రీల హక్కుల కోసం సంఘటిత ఉద్యమానికి ప్రణాళికగానే నిలిచారు. "స్త్రీ స్వేచ్ఛ" అనే పత్రికను సంపాదకురాలిగా నడిపిస్తూ, మహిళల గొంతును బలంగా ప్రతిధ్వనించే వేదికగా మలిచారు. ఆమె రచనలు ధైర్యాన్ని, స్పష్టతను ప్రతిబింబించేవి. హేతువాదాన్ని బలంగా నమ్మిన ఆమె మూఢ నమ్మకాల్ని ప్రశ్నించారు. మహిళల నైతిక, సామాజిక స్వాతంత్ర్యానికి ఆమె లౌకిక విలువలతో నిలిచిన అర్థవంతమైన ప్రతినిధిగా మారారు.ఆంధ్రప్రదేశ్‌లో మద్యపాన వ్యతిరేక ఉద్యమానికి ఆమె అందించిన నాయకత్వం ప్రత్యేక గుర్తింపు పొందింది. 1990వ దశకంలో మహిళలు మద్యం ప్రభావంతో పడుతున్న బాధలను గమనించి, ఆందోళనలకు పూనుకొని రాష్ట్ర వ్యాప్తంగా చైతన్యాన్ని నింపారు. ఆమె ఉద్యమం ఫలితంగా 1994లో రాష్ట్ర ప్రభుత్వం మద్యపాన నిషేధాన్ని అమలు చేయడం ఆమె నిబద్ధతకు నిదర్శనంగా నిలిచింది. మల్లాది సుబ్బమ్మ హైదరాబాదులో "ఇన్స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ ఉమెన్" సంస్థను స్థాపించి, మహిళా అభ్యున్నతికి శాస్త్రీయ దృక్పథంతో కూడిన శిక్షణా శిబిరాలు నిర్వహించారు. దేశ వ్యాప్తంగా పర్యటిస్తూ మానవ హక్కులు, లౌకికవాదం, స్త్రీ సమానత్వం గురించి ప్రసంగించారు. మానవతా విలువలను ప్రజలలోకి తీసుకెళ్లే ప్రయత్నంలో ఆమె నిరంతరంగా చురుగ్గా ఉండటం ఒక ఉద్యమంగా మారింది.

సాహిత్యంలోనూ ఆమె తనదైన ముద్ర వేసారు. ఆమె దాదాపు 110 పుస్తకాలు, 500కు పైగా వ్యాసాలు రచించారు. మహిళల సమస్యలు, ఉద్యమాలు, చట్టబద్ధ హక్కులు, సామాజిక సంక్షోభాలు ఆమె రచనలకు ప్రాణస్వరూపం. బానిస కాదు దేవత కాదు, ఓ మహిళా! ముందుకు సాగిపో, తరతరాల స్త్రీల పరాజయ గాథ, పతివ్రత్యం నుండి ఫెమినిజం దాకా వంటి రచనలు మహిళా చైతన్యానికి మేటి ఉదాహరణలుగా నిలిచాయి. ఆమె రచనలు గర్భించిన సందేశం– స్త్రీ శక్తిని ఒడిసి పట్టుకోవాలన్న తపన, మానవీయత మీద నమ్మకం, సమాజపు సంక్షోభాలపై బహిరంగంగా మేధోపరమైన పోరాటం. ఆమె ఆత్మకథ పాతివ్రత్యం నుండి ఫెమినిజం దాకా అంటేనే ఆమె వ్యక్తిత్వ ప్రయాణానికి నిక్షిప్త రూపం. 2012లో మల్లాది సుబ్బమ్మ తనకు ఉన్న ఆస్తులన్నింటిని విక్రయించి, హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో మహిళా అధ్యయన కేంద్రం భవన నిర్మాణానికి విరాళంగా ఇవ్వడం ఆమె జీవిత ఆశయానికి శాశ్వత సాక్ష్యంగా నిలిచింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ ప్రకటన చేయడం ఆమె లోతైన సామాజిక చింతనకు నిదర్శనం. మల్లాది సుబ్బమ్మ ఒక రచయిత్రిగా, ఆలోచనాపరురాలిగా, ఉద్యమ కారిణిగా మరియు స్ఫూర్తిదాయకంగా మహిళల సాధికారత కోసం యావజ్జీవం అంకితమయ్యారు. ఆమె జీవితం, రచనలు, ఉద్యమం ఇప్పటికీ సమానత్వానికి ఆకాంక్షించే వారికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. ఆమె చేసిన కృషి తెలుగు మహిళా ఉద్యమ చరిత్రలో ఒక చిరస్మరణీయ అధ్యాయంగా నిలిచిపోతుంది.

# గోర్ బంజారా వన భోజన, ఆత్మీయ సమ్మేళనలో పాల్గొనండి.!

– బంజారా వన భోజన నిర్వహణ కమిటీ పిలుపు.



హనుమకొండ, ఆగస్టు 01(వుదయం జిల్లా ప్రతినిధి) : హనుమకొండ జిల్లా రాంపూర్లో జరిగే గోర్ బంజారా వన భోజన కార్యక్రమం మరియు ఆత్మీయ సమ్మేళనాన్ని గ్రేటర్ వరంగల్ పరిధిలో ఉన్న బంజారా,లంబాడి కుటుంబ సభ్యులు విజయవంతం చేయాలని గోర్ బంజారా వన భోజన నిర్వహణ కమిటీ బాధ్యులు తెలిపారు.

15వ శతాబ్దం నుంచి భారతదశంలో ముఖ్యంగా దక్షిణ భారత దశంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని ప్రత్యేక భాష ప్రత్యేక వేషధారణ విభిన్న సంస్కృతి సాంప్రదాయాలతో భారతదేశంలో సుమారు 15 కోట్ల జనాభా గల బంజారాల సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించుకునే విధంగా సేవాలాల్ మహారాజ్ జయంతిని జాతీయ పండుగగా గుర్తిస్తూ, బంజారాల ప్రత్యేక పండుగలు అయినా సీతలా, తీజ్ వంటి పండుగలను విశ్వవ్యాప్తం చేసే విధంగా భారత దశ బంజారాలను ఏకం చేసే విధంగా భారత్ బంజారా ఏకీకరణలో భాగంగా గ్రేటర్ వరంగల్ పరిధిలోని ప్రతి బంజారా ఉద్యోగులు వ్యాపారులు విద్యార్థులు ప్రజలు ప్రతి ఒక్కరు ఆగస్టు 3న హనుమకొండ జిల్లా రాంపూర్ లో జరిగే బంజారాల వన భోజన మరియు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోర్ బంజారా వనభోజన నిర్వహణ కమిటీ బాధ్యులు అంగోత్ వినోద్ లోక్ నాయక్, డాక్టర్ గుగులోతు రాజు నాయక్, లాకావత్ రవీందర్ నాయక్, కేలోత్ బిక్షపతి నాయక్, బాదావత్ బాలాజీ నాయక్, భూక్య రాజు నాయక్ , భూక్య హేమ నాయక్, సోమలా నాయక్, మాలోత్ నాని నాయక్, డాక్టర్ చందు నాయక్, ధారావత్ కిషన్ నాయక్, సాంబయ్య నాయక్, బోడ నరసింహ నాయక్, డుంగ్రోత్ కిషోర్ నాయక్, మాలోతు రమేష్ నాయక్, వెంకట్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మాతా భువనేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన జిల్లా కలెక్టర్ మను చౌదరి.



మేడ్చల్–మల్కాజిగి జిల్లా. ఆగస్టు01 వ్రుదయం ప్రతినిధి):అమ్మవారికి సాంప్రదాయ రీతిలో బోనం సమర్పించిన జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, జిల్లా అధికారులు, తోటి ఉద్యోగులు. శుక్రవారం మేడ్చల్–మల్కాజ్గిరి కలెక్టరేట్ ఆవరణలో గల శ్రీ మాతా భువనేశ్వరి అమ్మవారి దేవాలయంలో బోనాల సందర్భంగా జిల్లా కలెక్టర్ మిక్కినినేని మను చౌదరి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారితో పాటు అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి పూజల్లో పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, జిల్లా అధికారులు, తొటి ఉద్యోగులు పోతురాజుల విన్యాసాలతో ఉరేగింపుగా సాగి అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారి బోనాల ఊరేగింపు కార్యక్రమం అత్యంత వైభవోపేతంగా ఆలయ మర్యాదలతో నిర్వహించారు. ఎస్సీ వెల్పర్ అధికారి జి. వినోద్ కుమార్ జిల్లా టిజిఓ అధ్యక్షులు జి. వినోద్ కుమార్ ఆధ్వర్యంలో బోనాల వేడుకలను ఏర్పాటు చేపట్టారు. రాష్ట్ర ఆద్యక్షులు ఏలూరి శ్రీనివాస్రావు, కార్యదర్శి ఎ. కురుమూర్తి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లా ఆఫీసర్ ఆర్.ఎస్. చంద్రవతి, డిఆర్డిఎ సాంబశివరావు, జెడ్పీ సిఇఓ కాంతమ్మ, కలెక్టరేట్ పరిపాలన రామోహన్, జిల్లా ఉపాధి కల్పన అధికారి యం. రాధిక, బీసీ వెల్ఫేర్ అధికారి ఝాన్సీ లక్ష్మి, సివిల్ సప్లై డిఎం సుగుణ బాయ్, వివిధ శాఖల జిల్లా అధికారలు, ఉద్యోగులు తదితరలు పాల్గొన్నారు.

# గొర్రెలు లిక్కర్ స్కాం చేసిన వారి మాటలు మేము పట్టించుకోము

– ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి సమక్షంలో రైతులకు న్యాయం చేస్తాం

–యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కోట్ల మధుసూదన్ రెడ్డి




నారాయణపేట ఆగస్టు 01 (వుదయం ప్రతినిధి) గొర్రెలు లిక్కర్ స్కామ్ చేసిన వారి మాటలను మేము పట్టించుకోమని నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి, నియోజకవర్గం ఇన్చార్జి కుంభం శివకుమార్ రెడ్డి సమక్షంలో రైతులకు న్యాయం చేస్తామని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కోట్ల మధుసూదన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల సాగునీటి పథకంపై రాష్ట్ర జాగృతి అధ్యక్షురాలు,ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత భాద్యత రహితంగా మాట్లాడారని, ఈ ప్రాంత రైతుల ఆశయం పై నీళ్లు చాల్లే ప్రయత్నం మానుకోవాలని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక హక్కులు, నీళ్లు–నిధులు–నియామకాలు లక్ష్యంగా తెచ్చామని చెప్పుకున్న బీఆర్ఎస్ నాయకురాలు కల్వకుంట్ల కవిత నారాయణపేట జిల్లా కనుకుర్తి గ్రామానికి వచ్చిన సందర్భంగా ప్రాజెక్టు పై రైతులను తప్పుదారి పట్టించే వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఎన్నో దశబ్దాలుగాఈ ప్రాంత రైతుల సాగు నీటి కోసం ఎదురుచూసస్తూ ప్రాజెక్టు కోసం ఈ ప్రాంత మేధావులు,రైతులు,అన్ని వర్గాల ప్రజలు నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు కోసం సంవత్సరాల తరబడి పోరాటం చేశారని, ఇలాంటి ప్రాజెక్టు పై ఎమ్మెల్సీ కవిత అసత్యారోపణలతో విమర్శించడం బాధ్యతారహిత చర్య అన్నారు. ప్రాజెక్టు పూర్తైతే నారాయణపేట,మక్తల్, కొడంగల్ నియోజకవర్గాల్లోని వేల ఎకరాల భూములకు సాగునీరు అందుతాయన్నారు. ఎవరూ బలవంతంగా భూములు ఇవ్వడం లేదని, కోర్టు మార్గం కూడా అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. ప్రాజెక్టు పై అవగాహన లేకుండా తప్పుడు ఆరోపణలు చేస్తూ అమాయక రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేసన్తా రాజకీయం చేయడం మానుకోవాలన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా కాలువల నిర్మాణం చేయకుండానే నీళ్లు ఇస్తామని, ఉగాది కి ఆ నీళ్లు తోనే పచ్చడి తాగుదామని అప్పటి మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి రైతులను మోసం చేస్తే ప్రజలు ఓడించి ఇంట్లో కూర్చోపెట్టారన్నారు. గత 20 ఏళ్ల నుండి ఈ ప్రాంత అభివృద్ధి కి ప్రజల సంక్షేమనికి తన సామాజిక సేవలతో ఓ ఆశయం తో పనిచేస్తూ,నేడు రైతుల గొంతుకగా ఉన్న కుంభం.శివకుమార్ రెడ్డి వారి భవిష్యత్తు కోసం పనిచేస్తున్నారన్నారు. అలాంటి వ్యక్తి పై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చే ప్రతి రైతుకు తగిన నష్టపరిహారం, కుటుంబాల బాగుపడేలా అన్ని విధాలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్. చిట్టెం. పర్ణిక రెడ్డి ల నేతృత్వంలో ఇది రైతుల కలల ప్రాజెక్టుగా మారనుందన్నారు. రాజకీయ విమర్శలు పక్కనబెట్టి, ప్రజల అభివృద్ధి పట్ల చిత్తశుద్ధితో కలిసి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు యూసుఫ్ తాజ్, విజయకుమార్ నాయక్, శ్రీనివాస్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు గురుకులాలు ఏర్పాటు చేసి ఉత్తమమైన విద్యను అందిస్తుదని జిల్లా కలెక్టర్ మిక్కినినేని మను చౌదరి తెలిపారు.

**ప్రతి ఒక్కరు మొక్కలను నాటిని ప్రకృతి సమతూల్యతను పరిరక్షించాలి.**



మేడ్చల్–మల్కాజిగి జిల్లా. ఆగస్టు01 వ్రుదయం ప్రతినిధి): శుక్రవారం శామీర్పేటలోని మహత్మాగాంధీ జ్యోతి రావ్ పూలే వెనుకబడిన తరగతులు బాలుర గురుకుల పాఠశాల నిర్వహణ తీరును జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటిస్తూ పాఠశాల దశలనే విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని, దానికి అనుగుణంగా సాధించేందుకు ఇప్పటి నుంచే అలవాటు చేసుకోని, ఎలాంటి అవరోదాలు వచ్చినా వాటిని అదిగమించి, అనుకున్న లక్ష్యాలను చేదించేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. విద్యార్థి దశలో వాస్తవికమైన అనుకూల దృక్పదం అలవర్చుకున్నట్లైతే భవిష్యత్తు బాగుంటుందన్నారు. డా. బి.ఆర్. అంబేద్కర్, డా. అబ్దుల్ కలాం లాంటి గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని విద్యార్థి దశలోనే వ్యక్తిత్వ వికాస అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. అనంతరం వనమహొత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో ప్రతి ఒక్క మొక్కను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలు ఎంతగానో మానవాళికి ఉపయోగపడుతున్నాయని, గ్లోబల్ వార్మింగ్ నుండి మానవాలిని రక్షించుకోవాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటి, వాటిని కాపాడు కోవల్సిన బాధ్యత మనందరి మీద ఉన్నదని, దీని వల్ల ప్రకృతి సమతుల్యత దెబ్బతినకుండా పర్యావరణాన్ని పరిరక్షించబడుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రజినీకాంత్, శామీర్ పేట తహాశీల్దార్ యాదగిరి రెడ్డి, మున్సిపల్ ఇఇ కన్నేశ్వర్, శానిటరీ ఇన్స్పెక్టర్ రూపా, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాధనం దొరికినది దోపిడి అయితే.. రాజకీయాల్లోకి రావద్దు!



పెద్దపల్లి జిల్లా , ఆగస్టు 1 (వుదయం) ప్రతినిధి:ప్రజల చేత ఎన్నుకోబడి పదవిని ప్రజాసేవకు ఉపయోగించకుండా, ప్రజాధనాన్ని దోచుకుని విలాసవంతమైన జీవితం గడపాలనే తాపత్రయంతో రాజకీయాల్లోకి అడుగుపెడుతున్న వారిపై పెద్దపల్లి జిల్లా ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు. పదవి పొందిన తరువాత ప్రజల అవసరాలను విస్మరించి, స్వార్థపరంగా వ్యవహరించే నేతల చర్యలపై సామాన్యుల్లో నిరాశ, కోపం పెరిగిపోతోంది. "రాజకీయాల్లోకి రావాలంటే ప్రజల పట్ల నిబద్ధత ఉండాలి. బాధ్యతల పట్ల స్పష్టత ఉండాలి. సామాజిక సమస్యలు పరిష్కరించాలన్న తపన ఉండాలి. కానీ నేటి కొంతమంది పదవిని ధనం సంపాదించే వేదికగా చూస్తున్నారు" అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకుముందు పదవిలో ఉండి మోసం చేసినవారు, మళ్లీ ప్రజల ముందుకు వస్తే అది ప్రజాస్వామ్యాన్ని అవమానించే చర్యగా భావించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఓ వృద్ధుడు పేర్కొన్నాడు. "ఒక్కసారి మోసం చేసిన నేతలు తిరిగి వచ్చి మళ్లీ వంచిస్తే %–% ప్రజలే మూరు?లవుతారు. అందుకే ఇప్పుడు తగిన గుణపాఠం చెప్పాలనే ఆలోచనలో ఉన్నారు" అని ఓ యువకుడు స్పష్టం చేశాడు. ప్రజల హృదయాల్లో స్థానం కోల్పోయిన నాయకులు తిరిగి అవకాశాల కోసం చూస్తున్న ప్రస్తుత రాజకీయ వాతావరణాన్ని గమనిస్తే ం ప్రజలు ఇక మోసపోవడానికి సిద్ధంగా లేరు అనే సందేశం స్పష్టంగా వినిపిస్తోంది. అని ఓ యువకుడు స్పష్టం చేశాడు. ప్రజల హృదయాల్లో స్థానం కోల్పోయిన, నాయకులు తిరిగి అవకాశాల కోసం చూస్తున్న ప్రస్తుత రాజకీయ వాతావరణాన్ని గమనిస్తే ం ప్రజలు ఇక మోసపోవడానికి సిద్ధంగా లేరు అనే సందేశం స్పష్టంగా వినిపిస్తోంది.

# తిమ్మారెడ్డిపల్లి బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షున్నీ పరామర్శించిన ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి



కొండపాక ఆగస్టు01 వ్రుదయం ప్రతినిధి): ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి విచ్చేసిన తిమ్మారెడ్డిపల్లి గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాశిరెడ్డి మహిపాల్ రెడ్డిని శుక్రవారం రోజు వారినివాసం లొ ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టరు యాదవరెడ్డి పరామర్శించి ధైర్యం నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుపైన రోజు రోజుకి విపరీతమైన రద్దీ పెరుగుతున్న సందర్భంగా జాగ్రత్తగా ప్రయాణం చేయాలని, ఇలాంటి ప్రమాదాల బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కొండపాక మండల అధ్యక్షులు నూనె కుమార్ యాదవ్, గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ ఎన్సి రాజమౌళి, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బూర్గోజు బాల బ్రహ్మం, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సాదుపల్లి కనకసేన గౌడ్, కాశిరెడ్డి భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వనమహొత్సవం వనమహొత్సవం

పాల్గొన్న ఎమ్మెల్యే జారె



దమ్మపేట,ఆగస్టు01 వ్రుదయం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహొత్సవంలో పాల్గొన్నారు, అశ్వారావుపేట ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అధికారులు కాంగ్రెస్ నాయకులతో కలిసి మొక్కలు నాటారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ ప్రతి ఇంటి ముందు ఒక్క మొక్క నాటి సంరక్షించి పెద్ద చెట్టుగా పెంచితే పచ్చదనం పెరుగుతుందన్నారు పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడం ప్రతి పౌరుడి బాధ్యతగా భావించాలన్నారు భవిష్యత్ తరాలకు శుభ్రమైన వాతావరణం అందించాలిని వాతావరణ మార్పులు ఎదుర్కొనాలంటే ప్రకృతిని సంరక్షించాల్సిన అవసరం మనందరి మీద ఉందన్నారు ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అటవీ శాఖ మరియు వివిధ శాఖల అధికారులు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

: డిప్యూటీ డి ఎం హెచ్ ఓ సుధాకర్ నాయక్



%జన్నారం,ఆగస్ట్ 1(వుదయం విలేఖరి) సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల జిల్లా డిప్యూటీ డీఎంహెచ్వో,జిల్లా టీబీ అధికారి సుధాకర్ నాయక్ అన్నారు. శుక్రవారం రోజున ఆయన జన్నారం మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన టీబి, మలేరియా, డెంగీ, లేపరసీ ,వైరల్ హెపటైటిస్, ప్రసూతి, పలు వ్యాధులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలంటూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ఉమాశ్రీ, డాక్టర్ లక్ష్మి,హెల్త్ అసిస్టెంట్లు, సిబ్బంది ఉన్నారు.

# పోలీస్ కమిషనరేట్ పి. ఆర్. ఓ ఫోటోగ్రాఫర్ కు బంగారు పతకం



హనుమకొండ, ఆగస్టు 01(వుదయం జిల్లా ప్రతినిధి) : నిన్న ప్రారంభమైన తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్ లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పి. ఆర్. ఓ మన్నవ మోహన కృష్ణ ప్రొఫెషనల్ ఫోటో గ్రఫీ విభాగంలో బంగారు పతకాన్ని సాధించి భద్రాద్రి పోలీస్ జోన్ కు తొలి బంగారు పతకాన్ని అందించాడు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు శరవేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి ఆగస్టు 01(వుదయం ప్రతినిధి) ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు శరవేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం గణపురం మండలంలో ఎస్సి కాలనీ, బుర్రకాయలగూడెంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతిని ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం ప్రాథమిక సహకార సంఘం ఎరువుల దుకాణం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పశువుల ఆరోగ్య కేంద్రాలను, తహసీల్దార్ కార్యాలయంలో భూ భారతి దరఖాస్తులు, స్టోర్ రూము తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులతో ముకాముఖి మాట్లాడారు. నిర్మాణ పనులలో జాప్యం జరుగకుండా నాణ్యత పాటిస్తూ వేగంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. లబ్ధిదారులకు నిర్మాణ పద్ధతులపై అవగాహన కల్పించి, అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూర్చే దిశగా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటి నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులు వీలైనంత తొందరగా గృహ ప్రవేశం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులు, క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేసస్తూ సత్వరం పనులు పూర్తి అయ్యేలా పని చేస్తేనే లక్ష్యాన్ని సాధించగలమన్నారు. గణపురం మండలంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రగతిని గృహ నిర్మాణ శాఖ పిడిని అడిగి తెలుసుకున్నారు. ఇసుక ఎక్కడి నుండి తెస్తున్నారని అడిగి తెలుసుకుని ఇసుక ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కాల్వపల్లి నుండి ఇసుక తెస్తున్నట్లు పిడి తెలిపారు. అనంతరం ప్రాథమిక పశు వైద్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. పశువుల చికిత్స కు వచ్చిన రైతులతో వైద్యసేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మందులు స్టాకు ఉంచాలని, పశువులు వ్యాధులకు గురికాకుండా టీకాలు వేయాలని సూచించారు. పశు సంపదను కాపాడుకోవాలని తెలిపారు. అవసరమైన మందుల కొరకు ప్రతిపాదనలు ఇవ్వాలని పశు సంవర్ధక శాఖ డిడిని సూచించారు. ఈ సందర్భంగా గొర్రెల వైద్య సేవలకు వచ్చిన రైతు జిల్లా కాలెక్టర్ కు గొర్రె పిల్లను బహుకరించారు.

# జైపూర్ లో పర్యటించిన లితెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

మంత్రికి స్మాల్ ఇండస్ట్రీ భారతి రాజస్థాన్ స్వాగతం



దమ్మపేట, ఆగస్టు01 వ్రుదయం ప్రతినిధి): ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనడానికి జైపూర్ వెళ్ళిన తెలంగాణరాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు వెళ్లిన సందర్భంగా చిన్న పరిశ్రమ భారతి రాజస్థాన్ ప్రతినిధి బృందం ఆయనను మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. సోల్, దుపట్ట, శ్రీఫిల్ మరియు స్టోన్ మార్ట్ 2026 మొమెంటోను బహుకరించి మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు కు స్వాగతం పలకడం జరిగింది. ఆ రాష్ట్రంలో అమలులో ఉన్న పలు చిన్న తరహా పరిశ్రమల గురించి తెలుసుకొని తెలంగాణలో పలు పరిశ్రమలు ఏర్పాటుకు ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఆధ్వర్యంని ప్రజాప్రభుత్వం సహకరిస్తుంది అని మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీ సాధు రమేష్ రెడ్డి, పాల్గొన్నారు

# నా పాస్ పోర్ట్ పోయింది దొరికన వారు సమాచారం అందించండి



బత్తిని శ్రీనివాస్ గౌడ్

ఖానాపురం ఆగస్టు01 వ్రుదయం ప్రతినిధి): మండలంలోని ధర్మరావుపేట గ్రామానికి చెందిన బత్తిని శ్రీనివాస్ గౌడ్ స్వగ్రామం నుంచి టూవీలర్ వాహనంపై జూలై 28న నర్సంపేటకు వెళుతున్న క్రమంలో మార్గ మధ్యలో నా పాన్ పోర్ట్ ఎక్కడో పడిపోయిందని తెలుపుతూ, నా యొక్క పాస్పోర్ట్ నెంబర్ ఆర్ 2085804 నాయొక్క పోస్ పోర్ట్ ఏవరికైన దొరికినచో ఈ 9550315334 నెంబరుకు సమాచారం ఇవ్వగలరని కోరుతున్నట్టు తెలిపారు.

# అన్ని శాఖల సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్ - XI విజయవంతం..

**జిల్లాలో 36 మంది బాల కార్మికులకు విముక్తి...**
**జిల్లా సుపరిటెండెంట్ ఆఫ్ పోలీస్ అశోక్ కుమార్**





జగిత్యాల ఆగస్టు 01 (ప్రుదయం ప్రతినిధి) బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి సంవత్సరంలో రెండు సార్లు ఆపరేషన్ స్మైల్ ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహించి తప్పిపోయిన బాలలను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చడానికి జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించడం జరిగింది ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం కోసం ఒక్కో సబ్ డివిజన్ పరిధిలో ఒక సబ్ ఇన్స్ పెక్టర్ ముగ్గురు కానిస్టేబుల్స్ ఒక మహిళ కానిస్టేబుల్ ను ప్రత్యేకంగా కేటాయించి చైల్డ్ లైన్ తో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలను గుర్తించి విస్తృతంగా తనిఖీలు నిర్వహించడం జరిగింది ఇందులో భాగంగా ఈ సంవత్సరం జులై 1 నుండి 31 వరకు ఆపరేషన్ ముస్కాన్-%శ×% కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరిగింది ఇందులో 36 మంది బాల కార్మికులను గుర్తించి సిడబ్ల్యూసి (చైల్డ్ వెల్ఫేర్ కమిటీ) ముందు పరిచారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మానందరిపైన ఉన్నదని బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం బాధ్యతాయుతంగా కృషి చేయాలని కోరారు బాలల హక్కులను బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ఆపరేషన్ స్మైల్ ముస్కాన్ కార్యక్రమాలను నిరంతరం నిర్వహించడం జరుగుతుందని అలాగే ఎవరైనా బాలలను పనిలో పెట్టుకున్న ఎక్కడైనా పని చేసిన తప్పిపోయిన వదిలివేయబడిన బాలల సమాచారం తెలిసిన వెంటనే డయల్ 100 కి కాల్ చేసి పోలీసు వారికి సమాచారం ఇవ్వగలరని తెలిపారు బాల కార్మికులుగా పెట్టుకున్న వారిపై కూడా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు పోలీసు శాఖతో కలిసి ఆపరేషన్ ముస్కాన్-%శ×% విజయవంతం చేయడంలో కృషి చేసిన వివిధ శాఖల అధికారులను సిబ్బందిని ఎస్పీ అభినందించారు

# వర్షకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ మిక్కినినేని మను చౌదరి ఆదేశించారు.



మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ,ఆగస్టు01 ప్రుదయం (ప్రతినిధి): శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపల్ , రెవెన్యూ, వైద్య, విద్య శాఖ, ఇతర జిల్లా అధికారులతో ప్రభుత్వ భూములు పరిరక్షణ, వర్షాకాలం వల్ల సంబించే వ్యాధుల నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తల అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, విజయేందర్ రెడ్డిలతో కలిసి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అద్దె భవనాలలో నిర్వహిస్తున్న ఆరోగ్య కేంద్రాలు, విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలు నిర్మించేందుకు, తమ పరిధిలో ఖాళీగా వున్న ప్రభుత్వ భూములను గుర్తించి నివేధికలను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 15వ ఆర్థిక కమీషన్ ద్వారా కేటాయింబడిన నిధులను వినియోగించుకొని జిల్లాలో ఆరోగ్య కేంద్రాలను నిర్మాణాలు చేపట్టాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మురుగునీరు నిల్వకుండా, దోమల నివారణ నిమిత్తం , ఎప్పటి కప్పుడు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉండేందుకు పారిశు ధ్య కార్యక్రమా నిర్వహించాలని, డెంగ్యూ, మలేరియా జ్వరాలు ప్రబలకుండా క్రమంతప్పకుడా ఫీవర్ సర్వేలు నిర్వహిస్తూ, ర్యాపిడ్ కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. జిల్లా లో నూతనంగా నడుపబడుతున్న పాఠశాలల్లో అన్ని మౌళిక సదుపాయాలు సత్వరమే కల్పించేదుకు చర్యలు తీసుకోవాలిని మున్సిపల్ అధికారులకు సూచించారు. రైతులకు సబ్సిడీ పై అందిస్తున్న ఎరువులను పక్కదారి పట్టకుండా, కొరత లేకుండా అందించడానికి మండలస్థాయిలో అధికారులు ఫెర్టిలైజర్స్ షాపులను ప్రతి వారము తనిఖీలు చేయాలని, ఎరువుల నిల్వల స్టాక్ రిజిష్టర్ ను పరిశీలించాలని తెలిపారు.

నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్స్ పథకం కింద అర్హులై ఉండి , 60 సంవత్సరాల లోపు మృతి చెందిన ప్రతి ఒక్కరికి రూ. 20 వేల ఆర్థిక సహాయం అందించాలని ఆదేశించారు. వనమహోత్సవం ద్వారా జిల్లాలో మొక్కలను నాటే నిర్ధేశించిన లక్ష్యాన్ని నిర్ధేశించిన సమయంలో పూర్తి చేయాలని, అందుకు తగిన విధంగా ప్రణాళికలు సిద్దం చేయాలని కలెక్టర్ చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని, పెండింగ్ ఉన్న ధరఖాస్తును క్షేత్రస్థాయిలో త్వరితగతిని పరిశీలించి. నిర్ధేశించిన వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. రెవెన్యూ సదస్సులలో భూ-భారతి ద్వారా స్వీకరించిర దరఖాస్తులను వెంటనే పరిష్కరించేందుకు తగిని చర్యలు తీసుకోవాలని సూచించారు. స్లమ్స్ ఏరియాలను గుర్తించి అక్కడ చిన్న చిన్న ఇళ్లలో ఉండే వారికి ప్రభుత్వప జి ప్లస్ 3,4 అంతస్తులలో పక్కా ఇళ్లు నిర్మించేందుకు తగిన స్థలాలను గుర్తించి నివేదికలను సమర్పించాలని సంబంధిత అదికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ ఓ హరిప్రియ, ఆర్డీఓలు ఉపేందర్ రెడ్డి, శ్యామ్‌ప్రకాష్, తహాశీల్దార్లు, మున్సిపల్ కమీషనర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరలు పాల్గొన్నారు.

# దేవసేన రెడ్డి సేవలు చిరస్మరణీయం

## ఇంటర్మీడియట్ విద్య జిల్లా నోడల్ ఆఫీసర్ ఎం హృదయరాజు




గద్వాల ఆగస్టు 01 (ప్రుదయం ప్రతినిధి) ప్రభుత్వ జూనియర్ కళాశాల మల్దకల్ లో రాజనీతి శాస్త్ర అధ్యాపకులుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన దేవసేనారెడ్డి సేవలు మరువలేనివని, చిరస్మరణీయమైనవని ఇంటర్ విద్య జిల్లా నోడల్ ఆఫీసర్ హృదయ రాజు కొనియాడారు. ఈ సందర్భంగా దేవసేనారెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ జి. కృష్ణ సార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అభినందన సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇంటర్మీడియట్ విద్య జిల్లా నోడల్ ఆఫీసర్ ఎం. హృదయ రాజు మాట్లాడుతూ సమయపాలనకు, క్రమశిక్షణకు, ఎదుటివారిని గౌరవించడంలో దేవసేనారెడ్డి ఆదర్శప్రాయలని విద్యార్థులకు సూచించారు. దాదాపు గత 21 సంవత్సరాల నుండి మానవపాడు, మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తన యొక్క సేవలు విద్యార్థులకు అందిస్తూ అనేక మంది విద్యార్థులను ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడడానికి దోహదపడ్డాడన్నాడు. ఈయన నుంచి విద్యార్థులు సమయపాలన, క్రమశిక్షణ అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ జి కృష్ణ మాట్లాడుతూ వయసులో పెద్దవారైనా సరైన సమయానికి కళాశాలకు వచ్చి విద్యార్థులతో మమేకమవుతు ఎప్పటికప్పుడు పాఠ్యాంశాలను బోధిస్తూ, నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేస్తూ మార్గదర్శకంగా ఉన్నారన్నారు. అదేవిధంగా ఆయన విద్యార్థులకు చేసిన ఉపకారం వలన దేవుడు ఆయన పిల్లలపై మంచి ఆశీస్సులు ఇవ్వడం వల్లే ఈరోజు ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడ్డారు అన్నారు. రిటైర్డ్ ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎం. రఘునాథ్ మాట్లాడుతూ ఆయన భావి జీవితం ప్రతిరోజు కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సంతోషంగా ఉండాలని కోరుకున్నారు. అదే విధంగా రిటైర్డ్ ప్రిన్సిపల్ రంగస్వామి మాట్లాడుతూ దేవసేనారెడ్డి మంచి విలువలు గల కుటుంబం నుండి రావడం వలన ఆయనకు సమయపాలన, క్రమశిక్షణ అలవాటైందని ఆయన కుటుంబంతో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో సన్మాన గ్రహీత దేవసేన రెడ్డి మాట్లాడుతూ నాకు క్రమశిక్షణ, సమయపాలన, ఎదుటివారిని గౌరవించడం వంటి లక్షణాలు నా గురువుల నుండి అలవాటు పడ్డాయి అని తెలియచేస్తూ కావున విద్యార్థులు కూడా గురువుల నుండి వాటిని అలవర్చుకోవాలని సూచిస్తూ నాకు ఈ 21 సంవత్సరాల నుండి ఇంటర్మీడియట్ విద్యలో సహకారం అందించినటువంటి ప్రతి ఒక్క ఉద్యోగికి ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో గద్వాల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జి. వీరన్న, సీనియర్ లెక్చరర్ దేవేందర్ రెడ్డి, అధ్యాపకులు నరసింహులు,

రామాంజనేయులు గౌడ్, గోవర్ధన్ శెట్టి, భాగ్యలక్ష్మి, రాఘవేందర్, మాధురి, నీలవేని, శ్రీకాంత్, బాలకృష్ణ, సుధాకర్, అధ్యాపకేతర సిబ్బంది ఇతర కళాశాలల అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొని ఘనంగా ఉద్యోగ విరమణ పొందిన దేవసేనారెడ్డిని సన్మానించడం జరిగింది.

# డ్రైడే చేయడం వ్యాధులను నియంత్రించవచ్చు

## జమ్మిచేడు ప్రాథమిక ఉపకేంద్రంను తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి డాక్టర్.ఎస్ కే. సిద్ధప్ప



గద్వాల ఆగస్టు 1(ప్రుదయం ప్రతినిధి) జోగులాంబ గద్వాల జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉప్పేరు పరిధిలో ఉన్న జమ్మిచేడు సబ్ సెంటర్ ను మంగళవారం డిఎంహెచ్ఓ. డాక్టర్ సిద్ధప్ప సందర్శించారు. శుక్రవారం సిబ్బంది చేపట్టిన ట్రైడే రిపోర్టులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి శుక్రవారం విధిగా ఫ్రైడే నిర్వహించాలని, గ్రామ ప్రజలకు హెల్త్ ఎడ్యుకేషన్ చేయాలని, చికెన్ గున్యా, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులపై అవగాహన కల్పించాలని సిబ్బందికి తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా పట్టణ ప్రాంతం, గ్రామాలలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండి జ్వరాలు డయేరియా వంటివి రాకుండగా చూసుకోవాలని సూచించారు. ఇంట్లో నిలువ నీరు లేకుండా, ఇంటిని శుభ్రంగా ఉంచి వారానికి ఒకసారి నీటి డబ్బాలు, డ్రములు శుభ్రపరచాలి. పాత టైర్లు, కొబ్బరిచిప్పలు, పగిలిన సీసాలు, ప్లాస్టిక్ కప్పులు, టీ కప్పులు తొలగించాలని అన్నారు. కిటికీలు, డోర్లకు దోమల జాలీలు అమర్చుకోవాలి. ఇంటి పరిసరాల్లో శుభ్రంగా ఉంచాలని తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రతి రోజు ఏఎన్ఎమ్ లు, అశాలు ఫీవర్ సర్వే చేసి అట్టి రిపోర్టును జిల్లా కు పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ కృష్ణవేణి, ఆరోగ్య విస్తరణ అధికారి రవిచందర్, ఎన్సీడీ జిల్లా సమన్వయ కార్యకర్త శ్యాంసుందర్, ఏఎన్ఎం శోభారాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# మధిర శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవ్వాలయం ప్రాంగణంలో అన్నదానం





మధిర, ఆగస్టు1(ప్రుదయం ప్రతినిధి) మధిర శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవ్యాలయంలో ప్రతి శుక్రవారం అన్నదాన కార్యక్రమం లో భాగంగా శ్రావణ మాసం రెండవ శుక్రవారం దేవిశెట్టి రంగారావు, ధర్మపత్ని కల్పన, తూములూరి నారాయణరావు,ధర్మపత్ని అంబిక, కుంచం రాధాకృష్ణ, ధర్మపత్ని పద్మావతి, గొండేల నాగేశ్వరరావు, ధర్మపత్ని సుజాత,మల్లూరు రాజేష్,ధర్మపత్ని ఉషస్మిత, శ్ర నాగండ్ల దామోదర్, ధర్మపత్ని స్రవంతి దంపతుల ఆర్థిక సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించబడినది. ఈ అన్నదాన కార్యక్రమానికి కావలసిన 100 స్టీల్ ప్లేట్లు శ్రీ దివ్య సాయి దేవాలయం ట్రస్ట్ కోశాధికారి కురువెళ్ళ కృష్ణ గారి దాతృత్వంతో, గొండేల లక్ష్మి కుమారి జ్ఞాపకార్థం వారి భర్త సూర్యప్రకాశరావు దాతృత్వంతో 50 స్టీల్ ప్లేట్లు 50 స్టీల్ గ్లాసులు ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమం లో పల్లపోతు ప్రసాదరావు,కుంచం కృష్ణారావు, కపిలవాయిజగన్మోహన్ రావు, వుల్లఖండం సత్యనారాయణమూర్తి,చారుగుండ్ల నరసింహమూర్తి,పబ్బతి రమేష్, చెడే రామకోటేశ్వరరావు, కాజా శ్రీనివాసరావు, నేరెళ్ల శ్రీనివాసరావు, నంబూరు మురళీకృష్ణ,పల్లపోతుల గోపాలకృష్ణమూర్తి,లీలవతి, కొల్లా శ్రీనివాసరావు, దాచేపల్లి ముత్యాలు, వేముల నవీన్ కుమార్, కొప్పురావూరి రామ యోగేశ్వరరావు, సముద్రాల పాపారావు, జల్లా రాధాకృష్ణమూర్తి, డోకుపర్తి జగన్మోహిని తదితరులు పాల్గొన్నారు.

# భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

నారాయణఖేడ్,ఆగస్టు01 ప్రుదయం ప్రతినిధి): నారాయణాఖేడ్ మున్సిపల్ పట్టణంలోని భూమయ్య కాలనీలో శుక్రవారం శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల భూమి పూజ నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చాలనే ఉద్దేశంతో గృహరహితుల గోస తీర్చడానికి ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లను ఇవ్వాలని ఈరోజు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణా భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. నియోజకవర్గానికి 3500 ఇండ్లను మంజూరు చేసిందన్నారు. ఈ ఇండ్ల నిర్మాణాలు పూర్తయిన వెంటనే అదనంగా 1000 మంజూరు అవుతాయని పేర్కొన్నారు.

# భూత్పూర్ తాసిల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు.!

దేవరకద్ర, ఆగస్టు01 ప్రుదయం ప్రతినిధి): మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం భూత్పూర్ తాసిల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు చేపట్టారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ రూ. 4000 డబ్బులు డిమాండ్ చేశారని ఫిర్యాదులు రావడంతో శుక్రవారం ఏసీబీ అధికారులు తాసిల్దార్ కార్యాలయంలో డిఎస్పీ కృష్ణ గౌడ్ విచారణ కొనసాగిస్తున్నారు. మరిన్ని విషయాలు తెలియాల్సి ఉంది.

# ఘనంగా బ్రహ్మేంద్రరావు పుట్టినరోజు, పదవి విరమణ వేడుకలు...



మేడ్చల్, ఆగష్టు 1,(ప్రుదయం ప్రతినిధి),జి.బ్రహ్మేంద్రరావు డి.ఈ, డి.పి.ఈ సికింద్రాబాద్, తెలంగాణ బీసీ విద్యుత్ ఉద్యోగా సంస్థ కార్యనిర్వక అధ్యక్షులు జి.బ్రహ్మేంద్ర రావు పుట్టినరోజు, పదవీ విరమణ సందర్భంగా కూకట్ పల్లి భాగ్యనగర్ కాలనీలోని తెలంగాణ రాష్ట్ర బీసీ నాయకులు జర్నలిస్టు తెల్ల హరికృష్ణ ఆధ్వర్యంలో వారి కార్యాలయం నుంచి ఊరేగింపు కార్యక్రమాన్ని, పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. బ్రహ్మేంద్రరావు ను గజమాలతో, శాలువాలతో ఘనంగా సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలలో బీసీ విద్యుత్ ఉద్యోగా సంస్థ అధ్యక్షులు కొండపాక కుమారస్వామి, రాష్ట్ర కార్యదర్శి ముత్యం వెంకన్న గౌడ్, ప్రేమ్, వెంకటేష్ కూకట్పల్లి ఆంధ్రప్రభ విలేకరి దాసరి రాహుల్ ప్రదీప్ వారి మిత్రుమండలి, పి ఎల్ ప్రసాద్, బుల్లెట్ రవి, రవీందర్, రూబిన్, హరికుమార్, సత్య, అర్జున్, శంకర్ నాయుడు, భాను, ప్రవీణ్, మారుతి సాగర్, అనిల్ యాదవ్, ప్రసాద్ గౌడ్, రాధికా గౌడ్, కిషోర్, శంకర్, మహేష్, గోపి జయనగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు, మిత్రులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రోస్టర్ అమలులో మాల కులస్థులకు అన్యాయం

బోథ్,ఆగస్టు01 ప్రుదయం ప్రతినిధి): ఎస్సీ వర్గీకరణ రోస్టర్ అమలులో మాల కులస్థులకు తీవ్రమైన అన్యాయం జరుగుతున్నదని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేష్ అన్నారు. ఈ విషయమై శుక్రవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఏవో కు వినతిపత్రం అందజేశారు. వర్గీకరణలో గ్రూప్ 3 వారికి రోస్టర్ లో తీవ్రమైన అన్యాయం జరుగుతున్నదని పేర్కొన్నారు. పాత నోటిఫికేషన్ లో వర్గీకరణ అమలు చేయకూడదు అని, మాల కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

# స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్కి విద్యార్థుల ఎంపిక

ముథోల్, ఆగస్టు01 ప్రుదయం ప్రతినిధి): ఖానాపూర్ పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీలో ప్రతిభను చాటారు. ఆ పాఠశాలకు చెందిన డి. శ్రీనయ్, బి. పవన్ కుమార్, ఎం. విష్ణువర్ధన్, టి. శేఖర్ ఎస్ఓఈ, బోనగిరి, యాదాద్రి భువనగిరి జిల్లాలోని స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, బాలురు పాఠశాలలో సీటు సాధించడం జరిగిందని శుక్రవారం వారిని ప్రిన్సిపాల్ యం. సంతోష్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులను అభినందించారు.

# జాగృతి ఆధ్వర్యంలో జరిగే నిరాహార దీక్షను విజయవంతం చేయాలి

నిర్మల్, ఆగస్టు01 ప్రుదయం ప్రతినిధి): ఆగస్టు 4 నుండి 7వ తేదీ వరకు బీసీ బిల్లు సాధన కొరకు తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద 72 గంటల నిరాహార దీక్ష తలపెట్టడం జరిగిందని నిర్మల్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ చారి తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు సమ్మె వివరాలు వెల్లడించారు. బీసీ లు అందరూ ఈ సమ్మెను జయప్రదం చేయాలి అని ఆయన కోరారు.

# సీయూఈటీ ఫలితాల్లో మైనార్టీ గురుకుల విద్యార్థుల ప్రతిభ

మానకొండూరు, ఆగస్టు01 ప్రుదయం ప్రతినిధి): తిమ్మాపూర్ మండల కేంద్రంలోని మానకొండూరు మైనారిటీ గురుకుల కళాశాలకు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థులు కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ 2025 ఫలితాల్లో సత్తా చాటినట్లు ప్రిన్సిపల్ పిడిశెట్టి సంపత్ శుక్రవారం తెలిపారు. పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీలో రవితేజ, అఫ్రోజ్, జి. అజయ్, ఏ. అజయ్, రామ్ చరణ్, సిటీ కాలేజీలో రాకేష్, సాజిద్, నిజాం కాలేజీలో సమీర్ పాష రిజ్వాన్, గౌతమ్ సాయి సీట్ల సాధించారు.

# నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలి

ఆదిలాబాద్, ఆగస్టు01 ప్రుదయం ప్రతినిధి): కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ నిరుద్యోగులను ఉపాధికి దూరం చేస్తోందని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ ఆరోపించారు. శుక్రవారం ఆదిలాబాద్‌లో ఆయన మాట్లాడారు. మూతపడిన సిమెంట్ పరిశ్రమను తిరిగి తెరిపించి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకునేలా స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించేలా చట్టం తేవాలని పేర్కొన్నారు.

# నూతన ఏపీఎం గా బాధ్యతలు స్వీకరించిన శ్రీదేవి



వెల్దండ ఆగస్టు 1 ((వు దయం ప్రతినిధి) మండల మహిళా సమాఖ్యలో నూతన ఏపీఎం గా పోలా శ్రీదేవి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు గతంలో తలకొండపల్లి మండలంలో విధులు నిర్వహించి బదిలీపై వెల్దండ కు వచ్చారు ఈ సందర్భంగా బాధ్యత చేపట్టిన ఏ పీ ఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంఘాలకు చేపడుతున్న సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా కృషి చేస్తానని పేర్కొన్నారు

# నిజాంపేట్ లో హర్ష టయోటా యూస్డ్ కార్స్ మేళా ప్రారంభం...



కుత్బుల్లాపూర్, ఆగష్టు 1,(ప్రుదయం ప్రతినిధి),నిజాంపేట్ మెయిన్ రోడ్డులో హర్ష టయోటా మెగా ఎక్స్ఛేంజ్ కార్స్ ఎక్స్ఛేంజ్ మేళా శుక్రవారం ప్రారంభమైంది. ఈనెల ఒకటి నుంచి మూడు రోజులు పాటు సాగే మేళాను ఎన్ఎంసి మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, నిజాంపేట్ శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ చైర్మన్ కోలన్ చంద్ర శేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు ఏనుగుల శ్రీకాంత్ రెడ్డి, నాచారం మురళి యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఆకర్షనియమైనపలు ఆఫర్లు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హర్ష టయోటా వైస్ ప్రెసిడెంట్ వైవి స్వామి, జనరల్ మేనేజర్ రాజ్ శేఖర్, సేల్స్ మేనేజర్ లు స్వరూప్ రాజ్, కృష్ణారెడ్డి, వేణు బాబు, మార్కెటింగ్ మేనేజర్ శంకర్, మధు, తదితరులు పాల్గొన్నారు.

# 17వ వర్ధంతి సందర్భంగా సీపీఎం నివాళి

బోధన్, ఆగస్టు01 ప్రుదయం ప్రతినిధి): బోధన్ పట్టణంలోని సీపీఎం అగ్ర నాయకులు మాజీ అఖిల భారత కార్యదర్శి హరికిషన్ సింగ్ సూరజిట్ 17వ వర్ధంతి సందర్భంగా పట్టణంలో అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అనంతరం సీసీఎం జిల్లా కార్యదర్శి ఎ. రమేష్ బాబు మాట్లాడుతూ 12 సంవత్సరాల వయస్సులో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు.

# నిరుపేద కుటుంబాలకు చేయూత .

-ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి



రాయపర్తి ఆగస్టు 1 (వుదయం ప్రతినిధి): మండలంలోని పేర్కవేడు గ్రామంలోబీఆర్ఎస్ పార్టీ నాయకులు నిమ్మల ఐలయ్య , అద్దపు కృష్ణమూర్తి , అబ్బోజు చంద్రకళా ,ఇటీవల అనారోగ్యంతో మరణించగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబనికి 50 కేజీల బియ్యం, ఆయిల్ క్యాన్ ను, అనంతరం గారే పెద్ద సాయిలు ఇటీవల అనారోగ్యంతో చికిత్స తీసుకోని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటుంగా వారిని పరామర్శించి, ఫౌండేషన్' ఆధ్వర్యంలో లి50 కేజీల బియ్యం, ఆయిల్ క్యాన్ ను ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపటి శ్రీనివాస్ రెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, మండల పార్టీ నాయకులు ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధిలు లేతకుల మధుకర్ రెడ్డి, గజావెల్లి ప్రసాద్, మండల పార్టీ యూత్ ప్రధాన కార్యదర్శి సంకినేని ఎల్లస్వామి, చందు సతీష్, ఉబ్బని సింహాద్రి, గ్రామ పార్టీ అధ్యక్షులు బొమ్మెర వీరాస్వామి, తాజా మాజీ సర్పంచ్ చిన్నల రాజబాబు,తాజా మాజీ ఎంపీటీసీ బండి రాజబాబు, నాయకులు ఆకుల సమ్మయ్య, నిమ్మల మల్లయ్య, ఎండీ అంజాద్ పాషా, భాషబోయిన పెద్ద సుధాకర్, బండి నర్సయ్య, నిమ్మలా మధు, ఎండీ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ ఆటో డ్రైవర్స్ దినోత్సవం.

-కేక్ కట్ చేసి భారీ ర్యాలీ.

-గణేష్ ఆటో యూనియన్ అధ్యక్షుడు ఏకాంబరం.





ఖానాపురం ఆగస్టు 1 (వుదయం ప్రతినిది): ప్రపంచ ఆటో డ్రైవర్స్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ఎన్ హెచ్ 365 జాతీయ రహదారి క్రింది బస్టాండ్ సమీపంలోని గణేష్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల జగన్మోహన్ రెడ్డి ఆటో యూనియన్ నాయకులతో కలిసి భారీ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం గణేష్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో క్రింది బస్టాండ్ నుంచి పైబస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి ఘనంగా ఆటో డ్రైవర్స్ దినోత్సవంను నిర్వహించినట్లు ఆటో యూనియన్ అధ్యక్షుడు మాయల ఏకాంబరం తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు రంగు కుమార్, ఉపాధ్యక్షుడు గాలిప్ పాషా, ప్రధాన కార్యదర్శి దేవులపల్లి నరసింహారావు, కమిటీ సభ్యులు మడత బిక్షపతి, పెరమండ్ల కార్తీక్, ఎస్ కే మున్నీర్ పాషా, కందిక రాంబాబు, మర్రి సురేష్ తోపాటు ఆటో డ్రైవర్స్ నాగరాజు, సురేష్, వెంకన్న, శ్రీను లతోపాటు మండవ ప్రసాదరావు, సూడి బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు దామెర రాజేందర్ పై పెట్టిన అక్రమ కేసు ఎత్తివేయాలి

- ప్రభుత్వానికి టీడబ్ల్యూజేఎఫ్ డిమాండ్
- జిల్లా కలెక్టర్ ను కలిసిన జర్నలిస్టు నేతలు




హనుమకొండ, ఆగస్టు 01(వుదయం జిల్లా ప్రతినిధి) : హన్మకొండ జిల్లాలో ఇటీవల సీనియర్ జర్నలిస్టు దామెర రాజేందర్ పై ఐనవోలు పోలీసులు పెట్టిన తప్పుడు కేసును వెంటనే ఎత్తివేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం,వల్లాల జగన్,బండి విజయ్ కుమార్, కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుడుతాడి బాపురావు, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు టీవీ రాజు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు జక్కుల విజయ్ కుమార్ తదితరులు గురువారం హన్మకొండ జిల్లా కలెక్టర్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. జర్నలిస్టు దామెర రాజేందర్ పై ఐనవోలు పోలీసులు బనాయించిన తప్పుడు కేసు వివరాలను వారు కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ,రాజేందర్ గతంలో దాదాపు పదేండ్లు వివిధ పత్రికల్లో రిపోర్టర్ గా పనిచేశారని, ప్రస్తుతం సొంత పత్రికను నడుపుతున్నారని,ఐనవోలు తహశీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై రాజేందర్ పత్రికలో వరుస కథనాలు ప్రచురించారని తెలిపారు. దీనిని మనసులో పెట్టుకున్న ఐనవోలు తహశీల్దార్ రాజేందర్ పై కుట్రపన్ని పథకం ప్రకారం ఓ యూట్యూబర్ సహాయంతో పోలీసులతో కుమ్మక్కై కావాలని తప్పుడు కేసు నమోదు చేయించి జైలుకు పంపించారని ఆరోపించారు. నీతి, నిజాయితీతో వార్తలు రాస్తున్న జర్నలిస్టులపై ఇలాంటి తప్పుడు కేసులు పెట్టడం సరైంది కాదని అన్నారు. కావాలని ఒకరిద్దరు రాజేందర్ పై సోషల్ మీడియా వేదికగా అసత్యాలు ప్రచారం చేస్తున్నారని, తప్పుడు ప్రచారాలు చేస్తున్న యూట్యూబర్ ను వదిలేసి ఏ తప్పు చేయని జర్నలిస్టు రాజేందర్ పై పోలీసులు అక్రమంగా కేసు బనాయించి వేధిస్తున్నారని అన్నారు. ఈ కుట్రపూరిత అక్రమ కేసు వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. జర్నలిస్టు రాజేందర్ పై పోలీసులు పెట్టిన కేసును ఉపసంహరింపజేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఐనవోలు తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన భూములు, ప్లాట్ల అక్రమ రిజిస్ట్రేషన్ లపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. జర్నలిస్టులపై పోలీసులు పెట్టిన అక్రమ కేసులకు బాధ్యులైన ఐనవోలు తహశీల్దార్, ఎస్ ఐలను సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి జర్నలిస్టు దామెర రాజేందర్ పై అక్రమ కేసు తొలగించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేయాల్సి వస్తుందని మామిడి సోమయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొలమాని గోపాల్, పాలడుగుల సురేందర్, సభ్యులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# లాభాల వాటా 35 శాతం చెల్లించి సొంత ఇంటి పథకాన్ని అమలు చేయాలి



బెల్లంపల్లి, ఆగస్టు1 (వుదయం ప్రతినిధి): బెల్లంపల్లి పట్టణంలోని శాంతిఖని భూగర్భగని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటియూసీ రెండు బ్రాంచ్ ల ఇంచార్జ్ చిప్ప నరసయ్య, బెల్లంపల్లి బ్రాంచ్ సహాయ కార్యదర్శి గని ఫిట్ కార్యదర్శి దాసరి తిరుపతి గౌడ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం గని ఆవరణలో అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి మంతెన రమేష్ అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్ లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. 2024- 25 సంవత్సరానికి సంబంధించిన లాభాల వాటా తక్షణమే 35 శాతం చెల్లించాలని డిమాండ్ చేశారు. సొంత ఇంటి పథకాన్ని అమలు చేసి 300 గజాల స్థలాన్ని ఇవ్వాలని పేర్కొన్నారు. పెర్క్స్ పై ఇన్ కంటాక్స్ యాజమాన్యమే కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. మెడికల్ చార్జీల పేరిట కార్మికుల నుంచి వసూలు చేసిన నగదు తిరిగి చెల్లించాలని కోరారు. ఆర్కే ఓసిపి ఫేస్ 2 పనులు పూర్తి చేసి ఓసి ని వెంటనే ప్రారంభించాలని అన్నారు. సిసి ఆర్ఎస్ ద్వారా రిటైర్డ్ కార్మికులకు ఇచ్చే ఆసుపత్రి ట్రీట్మెంట్ చార్జీలు వసూలు చేయకూడదని కోరారు. కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంటాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించి, వారికి హై పవర్ వేతనాలు చెల్లించాలని చెప్పారు. కార్మికులకు నాణ్యమైన బూట్లు, బాటా కంపెనీ చేతి బ్లౌజులు ఇవ్వాలన్నారు. కాసిపేట 1,2 గనులు శాంతిఖని గని, డిపార్ట్మెంట్ కార్మికులకు పీఎంఈ, ట్రీట్మెంట్ బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రిలోనే వైద్యం చేయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా ఉద్యోగులకు అటాచ్ వాష్ రూమ్ నిర్మించాలని కోరారు.. అనంతరం గని మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హాకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ బేరర్ బొంకూరి రామచందర్, నాయకులు స్వామి దాసు, పొట్ట రాజలింగు, మిట్టపల్లి రమేష్, మంతెన భాస్కర్, చదువుల శ్రీనివాస్, రత్నం ప్రవీణ్ మహంకాళి సంతోష్, దుర్గం రాజేష్, సిహెచ్ సారయ్య, బి రామకృష్ణ, పోగల రాజయ్య, ఎస్.శ్రావన్ పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ మాజీ వార్డ్ మెంబర్ తల్లి మృతి.



ఖానాపురం ఆగస్టు 1 (వుదయం ప్రతినిధి):మండలంలోని రాగంపేట గ్రామానికి చెందిన మాజీ వార్డ్ మెంబర్ కొండ శ్రీను తల్లి కొండ ఉప్పలమ్మ (60) గుండెపోటుతో గురువారం మృతి చెందగా మృతదేహాన్ని శుక్రవారం ఉదయం నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్ సందర్శించి మృతదేహంపై పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య, మాజీ సర్పంచ్ భాషబోయిన ఐలయ్య, బిఆర్ఎస్ పార్టీ మండల అధికార ప్రతినిధి తక్కలపల్లి బాబురావు, గ్రామ పార్టీ అధ్యక్షులు ఏపూరి వెంకన్న, బంధారపు శ్రీనివాస్ గౌడ్, నాయకులు దుగ్యాల రాజేశ్వర్ రావు, మాచర్ల కొమ్మాలు, గోపగాని ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇన్సూరెన్స్ అప్లికేషన్ ఫారాలు నింపిన జర్నలిస్టులు



హనుమకొండ, ఆగస్టు 01(వుదయం జిల్లా ప్రతినిధి) : గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ సభ్యులు, వారి కుటుంబాల కోసం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ కార్యవర్గం చేయిస్తున్న ఇన్సూరెన్స్ పాలసీల దరఖాస్తుల స్వీకరణ రెండోరోజు కొనసాగింది. ఈరోజు ఫోటో, వీడియో జర్నలిస్టులతో పాటుగా పలువురు జర్నలిస్టులు తమ దరఖాస్తు ఫారాలను నింపి సమర్పించారు. కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, కోశాధికారి బొల్ల అమర్, ఉపాధ్యక్షులు గోకారపు శ్యాం, బొడిగె శ్రీను, జాయింట్ సెక్రెటరీలు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, సంపెట సుధాకర్, ఈసీ సభ్యులు ఎండీ నయీంపాషా, వీడియో జర్నలిస్టులు గొర్రె సంజీవ్, నంచు రామరాజు,సునీల్,జర్నలిస్టులు రోజనాల శ్రీనివాస్, రంజిత్, పాటి నరేందర్, బూరం ప్రశాంత్,అశోక్, రమేశ్, గెట్టె వెంకన్న, సుధీర్, ఇస్మాయిల్, నూటంకి ప్రభాకర్, ఖాదర్ పాషా, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# జేఎన్ఎస్ లో తాత్కాలికంగా తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఏర్పాటు

- ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కె ఆర్ నాగరాజు



హనుమకొండ, ఆగస్టు 01(వుదయం జిల్లా ప్రతినిధి) : నుమకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలోని సదుపాయాలు, వసతులను కల్పించి తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీని ఇక్కడే తాత్కాలికంగా ప్రారంభించేందుకు నిర్ణయం తీసుకున్నామని స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. శుక్రవారం హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ తాత్కాలిక ప్రారంభానికి అవసరమైన సదుపాయాలను ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి,నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ స్నేహ శబరీష్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేడియం ఆవరణలో ఉన్న హాస్టల్ భవనాలు, ఇండోర్, అవుట్ డోర్ క్రీడా మైదానాలను పరిశీలించి చేపట్టాల్సిన మరమ్మత్తులు, కల్పించాల్సిన సదుపాయాలను గురించి అధికారులకు సూచించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యార్థులకు క్రీడా సదుపాయాలు ఏర్పాటు చేయాలని, అందుకు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలనీ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా డి వై ఎస్ ఓ అశోక్ కుమార్ ను స్టేడియంలో వసతి సౌకర్యాలపై వివరించారు.అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహృదయంతో, వరంగల్ జిల్లా ప్రజలపై ఉన్న ప్రేమతో క్రికెట్ స్టేడియం, స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ మంజూరు చేయాలనీ అడిగిన వెంటనే ఒప్పుకున్నారని తెలిపారు. అలాగే వెంటనే స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ తో త్వరితగతిన ఉమ్మడి వరంగల్ జిల్లాలో క్రికెట్ స్టేడియం, స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఏర్పాటు చేయాలని ఆదేశించారని పేర్కొన్నారు. ఈ ఆగస్టు నుండే స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ తాత్కాలిక ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని , అలాగే జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ కు క్రికెట్ స్టేడియం, స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించినట్లు తెలిపారు. బిసిసిఐని సంప్రదించి క్రికెట్ స్టేడియం నిర్మాణానికి నిధులు, అలాగే స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని వెల్లడించారు. అందులో భాగంగానే జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ని తాత్కాలికంగా ప్రారంభించడానికి ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. జేఎన్ఎస్ ఆవరణలో విద్యార్థులకు హాస్టల్ వసతిలో ఉండాల్సిన సదుపాయల కల్పనకు, ఇండోర్, అవుట్ డోర్ క్రీడా సదుపాయాలు, పరికరాల ఏర్పాటుకు, అవసరమైన మరమ్మత్తులకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చెయాలనీ స్పోర్ట్స్ అథారిటీ అధికారులను ఆదేశించారు. ఆగస్టు నెలలోనే స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ప్రారంభించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, జిల్లా యువజన క్రీడాధికారి గుగులోతు అశోక్ కుమార్, స్పోర్ట్స్ అథారిటీ, కుడా, మున్సిపల్ అధికారులు, నాయకులు, కోచ్ లు తదితరులు పాల్గొన్నారు.

# వెంకటాపురంలో తల్లిపాల వారోత్సవాల



సత్తుపల్లి జూలై 1 (వుదయం ప్రతినిధి) వేంసూర్ మండల పరిధిలోని వెంకటాపురం అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం సమావేశం ర్యాలీ నిర్వహించారు . పుట్టిన గంటలోపు బిడ్డకు ముర్రుపాలు పట్టించాలి కేవలం 6 నెలల వరకు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని ఏ ఇతర పద్దర్థాలు పట్టించారాదు అని తల్లి పాలలోనే బిడ్డకు సరిపడా పోషకాలు అందుతాయాని 6 నెలలు నిండిన తరువాత అదనపు ఆహారం పెడుతూ రెండు సంవత్సరాలు తల్లి పాలు ఇవ్వాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంత రాణి తెలిపారు. ఈ కార్యక్రమకు స్కూల్ హెచ్ఎం భాస్కరరావు , స్కూల్ టీచర్ రాధాకృష్ణ అంగన్వాడీ టీచర్లు పద్మ, శివమ్మ, విజయ, రాధా రాణి, నాగేంద్ర అంగన్వాడి హెల్పర్లు తల్లులు పిల్లలు పాల్గొన్నారు.

# దారక్ వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం



నారాయణపేట టౌన్ ఆగస్టు 01 (వుదయం ప్రతినిధి): కీ.శే.లయన్ ఘనశ్యామ్ ధరక్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన కుమారుడు లయన్ సంపత్ కుమార్ ధరక్ ప్రభుత్వ వైద్యశాల, అప్పిరెడ్డి పల్లి దగ్గర రోగులకు ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపుగా 500 మంది రోగులు,విచ్చేసిన ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. లయన్ సంపత్ కుమార్ మాట్లాడుతూ మా నాన్న జ్ఞాపకార్థం ఈ విధంగా అన్న దానం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ కోన వెంకటేష్, లయన్ మహేష్ కుమార్ గౌడ్ కార్యదర్శి , లయన్ రామ్ రెడ్డి కోశాధికారితో పాటు సీనియర్ లయన్ మెంబర్లు లయన్ కే సుదర్శన్ రెడ్డి, గందె రవికాంత్, మధుసూదన్ రెడ్డి కృపాకర్ రెడ్డి , రఘు బాబు మిర్చి శ్రీను రవి ,సంజీవరెడ్డి లు పాల్గొన్నారు.

# ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేసిన అనిల్



నారాయణపేట టౌన్ ఆగస్టు 01 (వుదయం ప్రతినిధి): స్థానిక గాంధీనగర్ వీధికి చెందిన మిస్కిన్ అనిల్ పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం రోగులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు. అంతకంటే ముందు గాంధీనగర్ శివాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు అల్పాహారం పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విజయ్, ఆ వీధి యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆరోగ్య పరిస్థితి అడిగితే

-తెలుసుకున్న జిల్లా కలెక్టర్



జయశంకర్ భూపాలపల్లి ఆగస్టు 01 (వుదయం ప్రతినిధి) జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆరోగ్య పరిస్థితి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అడిగితే తెలుసుకున్నారు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. మధుసూదన్ గత నెల రోజుల క్రితం హఠాత్తుగా అనారోగ్యానికి గురయ్యారు. ఆయన ప్రస్తుతం హైదరాబాద్‌లో వైద్య సేవలు పొందుతున్నారు. శుక్రవారం గణపురం తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ తనిఖీ చేస్తున్న సందర్భంగా డా. మధుసూదన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ మధుసూదన్ ఆరోగ్య పరిస్థితి, వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అసలు ఏమైంది, అంత సీరియస్ అయింది, ఇపుడు చాలా నీరసంగా ఉన్నారు, ప్రస్తుతం ఆరోగ్యం ఎలా ఉంది అంటూ త్వరగా కోలుకోవాలని "టేక్ కేర్ ఆఫ్ యువర్ హెల్త్" అంటూ పరామర్శించారు.డాక్టర్ మధుసూదన్ పూర్తిగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి విధుల్లో చేరాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

## అలంపూర్ ఏరియా ఆసుపత్రిలో వైద్యాధికారుల కాంట్రాక్టు నియామకాలు

అలంపూర్ ఆగస్టు 01 (వుదయం ప్రతినిధి): జిల్లా ప్రధాన ఆస్పత్రిలో కాంట్రాక్టు ప్రాతిపదికన వైద్య పోస్టుల నియామకం కొరకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రమేష్ చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. అల్లంపూర్ ఏరియా ఆస్పత్రిలో అవసరమైన గైనకాలజిస్ట్ - 2, జనరల్ సర్జన్- 2, జనరల్ మెడిసిన్- 2, అనస్థిటిస్ట్ - 2, ఈఎన్ టి -1, ఆర్థోపెడిక్- 1, పాథాలజిస్ట్- 1, సైక్రియాటిస్ట్ - 1, డెర్మటాలజిస్ట్ - 1 అలాగే అలంపూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు జనరల్ మెడిసిన్- 1, పెడియాట్రిసియన్ -1, %+ఐమీం (వీదీమీ%)-2 కాంట్రాక్టు పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ప్రధాన ఆసుపత్రి సుపరింటెండెంట్ డాక్టర్ రమేష్ చంద్ర ప్రకటన ద్వారా తెలిపారు. దరఖాస్తు దారులు ఈనెల 07 తేదీన అలంపూర్ ఏరియా హాస్పిటల్, అలంపూర్ క్రాస్ రోడ్, పుల్లూర్ - నందు వాక్ - ఇన్ ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

# ఆపరేషన్ ముస్కాన్ -%శ×% ద్వారా జిల్లాలో 75 మంది బాలకార్మికులను సంరక్షణ

## 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకొనుట నేరం
## బాల కార్మికుల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు అందించండి
## జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు




గద్వాల ఆగస్టు 01 (వుదయం ప్రతినిధి) బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి జులై నెలలో నిర్వహించిన ఆపరేషన్ ముష్కాన్- %శ×% కార్యక్రమం ద్వారా అన్ని శాఖల సమన్వయంతో జిల్లాలో 75 మంది బాలకార్మికులను సంరక్షించడం జరిగిందని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాల ద్వారా తప్పిపోయిన పిల్లలతో పాటుగా, బాలకార్మికులుగా పనిచేస్తున్న చిన్నారులను గుర్తించి వారిని రక్షించి పునరావాసం కల్పించడం జరిగిందని తెలిపారు. చిన్నారులకు విముక్తి కల్పించడం కోసం పోలీస్ శాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్ డిపార్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్, వివిధ డిపార్ట్మెంటు అధికారులతో జిల్లాలో టీమ్ లుగా ఏర్పాటు చేసి ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థల సహకారంతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఈ సంవత్సరం జులై 1 నుండి 31 వరకు నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలో జిల్లా వ్యాప్తంగా 75 (బాలలు -66, బాలికలు-9) మంది చిన్నారులను గుర్తించి వారి యొక్క తల్లిదండ్రుల వద్దకు చేర్చడం జరిగిందన్నారు. అందులో 8 మంది బాల కార్మికులకు విముక్తి కల్పించి వారిని చదువుకోవటానికి తిరిగి పాఠశాలలో చేర్పించటం జరిగిందని, మిగిలిన వారిని సి డబ్ల్యు సి ఆధ్వర్యంలో వారి తల్లిదండ్రులకు అప్పగించి కౌన్సిలింగ్ చేయడం జరిగిందని అన్నారు. 18 సంవత్సరాలలోపు పిల్లలను పనిలో పెట్టుకుని వారితో పని చేయించిన వారిపై 18 కేసులు నమోదు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మానందరిపైనా ఉన్నదని, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం బాధ్యతాయుతంగా కృషి చేయాలని కోరారు. తరచు బాలల చేత పనులు చేయిస్తున్న వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. వీధి బాలలను, బాల కార్మికులను చూసినప్పుడు, డయల్- 100 లేదా 1098 లేదా స్థానిక పోలీస్ వారికి సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ ప్రజలకు సూచించారు.

# సకల కళల పరిరక్షణ జేఏసీ జిల్లా కమిటీ అధ్యక్షుడిగా మహమ్మద్ అక్బర్ పాషా.



పరకాల ఆగస్టు 1 (వుదయం ప్రతినిధి): సకల కళల పరిరక్షణ జేఏసీ హన్మకొండ జిల్లా కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. శుక్రవారం రోజున పరకాల పట్టణంలోని ఎఫ్ జె గార్డెన్లో హనుమకొండ జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన కళాకారులతో సమావేశం నిర్వహించడం జరిగింది. అనంతరం ఆయా మండలాల నుంచి హాజరైన వారితో హన్మకొండ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సకల కళల పరిరక్షణ జేఏసీ హన్మకొండ జిల్లా కమిటీ అధ్యక్షుడిగా మహమ్మద్ అక్బర్ పాషా , ప్రధాన కార్యదర్శిగా దండు సారంగపాణిని కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మహమ్మద్ అక్బర్ తెలిపారు. సకల కళల పరిరక్షణ జేఏసీ ఉపాధ్యక్షులుగా మల్లయ్య , బాబురావు , బుచ్చయ్య ,సహాయ కార్యదర్శులుగా , రమేష్ ,సమ్మయ్య రాజయ్యాలను ఎన్నుకున్నారు .కోశాధికారిగా కొండ సమ్మయ్య , ప్రచార కార్యదర్శిగా బొందయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకోగా 9 మందిని కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ అక్బర్ పాషా ,దండు సారంగపాణిలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కళాకారులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఈ సందర్భంగా వారు తెలంగాణ ముఖ్యమంత్రిని కోరారు.

# లక్షెట్టిపేటలో ఘనంగా సామూహిక వరలక్ష్మి వ్రతం






లక్షెట్టిపేట, ఆగస్టు01 (వుదయం ప్రతినిధి) : పట్టణంలోని స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతం, కుంకుమ పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక మండపంలో అష్టలక్ష్ములను పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా మహిళలు లలిత పారాయణం చేసిన అనంతరం వేద పండితులచే వరలక్ష్మీ వ్రతం, కుంకుమ పూజలను నిర్వహించారు. అనంతరం లక్కీ డిప్ ద్వారా విజేతలు అయిన పల్లెర్ల పద్మ, చంద్రకళలకు బహుమతిగా చీరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మైలారపు సుధాకర్, పల్లెర్ల మహేందర్ , తాటికొండ శ్రీనివాస్, పల్లెర్ల శ్రీనివాస్, పాలకుర్తి లచ్చన్న , కొత్త అనిల్, గుండ సంతోష్, గంప రాజేశం ,ఆర్యవైశ్య మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందుల సాహితి, కాసం స్వప్న ,అక్కినపల్లి రాధిక, ఎనగందుల శరణ్య , తదితరులు పాల్గొన్నారు.

# ధన్వాడ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పిడి సస్పెండ్

ధన్వాడ మండల ఆగస్టు 01 (వుదయం ప్రతినిధి): కేంద్రంలో శుక్రవారం ధన్వాడ స్కూల్ మోడల్ ప్రిన్సిపల్ మరియు పిడి ని సస్పెండ్ చేసినట్లు అసిస్టెంట్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు స్కూల్లో నెలకొన్న సమస్యలపై విద్యార్థులు రాస్తారోకో చేయడంతో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఉమై అఫ్రా మరియు పిడి ని సస్పెండ్ చేశారు మరియు మాడల్ స్కూల్ ఇన్చార్జ్ ప్రిన్సిపల్ గా కృష్ణమూర్తిని నియమించారు

# బదిలీపై వెళ్లుతున్న ఏపీఎం కానుకయ్యకు సన్మానం



పెద్దపల్లి జిల్లా , ఆగస్టు 01 (వుదయం ప్రతినిధి): కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని క్రాంతి మండల సమాఖ్య కార్యాలయంలో ఈరోజు బదిలీపై సుల్తానాబాద్ మండలానికి వెళ్లనున్న మండల సహాయ ప్రోగ్రాం మేనేజర్ కానుకయ్యకు సన్మానం నిర్వహించారు. ఆయన సేవలను గుర్తిస్తూ మండల స్థాయి ఉద్యోగులు, సంఘాల ప్రతినిధులు హాజరై గౌరవాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శారదా, నిర్మల, హరికృష్ణ, తిరుమల, కనకతారలు పాల్గొన్నారు. మండల సమాఖ్య అధికారుల్లో మౌనిక, రవళి, వరలక్ష్మి, కార్యాలయ సిబ్బందిలో చంద్రకళ, తాజోద్దీన్ పాల్గొన్నారు. గ్రామ సంఘం సహాయకులు సునీత, బండారి స్వరూప, నూనెటి రామ, మామిడి పద్మ, లత తదితరులు హాజరయ్యారు. మండలాభివృద్ధిలో కానుకయ్య కల్పించిన మార్గదర్శకత, కృషి అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఆయన సుల్తానాబాద్ మండలంలో కూడా అదే స్థాయిలో సేవలు అందిస్తారని ఆకాంక్ష వ్యక్తమైంది.

# రూ.4 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ ఆర్ఐ



మహబూబ్‌నగర్ ఆగస్టు 01 (వుదయం ప్రతినిధి): జిల్లాలో ఏసీబీ దాడులు కలకలం సృష్టిస్తున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ తహసీల్ కార్యాలయం పై ఏసీబీ అధికారులు శుక్రవారం దాడి చేసి రూ. 4వేలు లంచం తీసుకుంటున్న రెవెన్యూ ఇన్స్పెక్టర్ బాలసుబ్రమణ్యంను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కల్యాణ లక్ష్మి పథకం కింద లబ్ధిదారుడు దరఖాస్తు చేసుకోగా ఆర్ఐ రూ. 4వేలను డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా ఏసీబీ డీఎస్పీ నేతృత్వంలో అధికారులు శుక్రవారం దాడులు చేసి ఆర్ఐను పట్టుకున్నారు. ప్రభుత్వ విధుల్లో ఉంటూ అధికార దుర్వినియోగం, అవినీతి అక్రమాలకు పాల్పడ్డారంటూ ఆర్ఐపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు ఏసీబీ అధికారులు వివరించారు. పబ్లిక్ సర్వెంట్ ఎవరైనా అవినీతి, అక్రమాలకు పాల్పడితే టోల్ ఫ్రీ నంబర్ 1064 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

# రిటైనింగ్ వాల్ భూ నిర్వాసితులకు కేటాయించే లే- ఔట్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

## లే-ఔట్ లో 10 మీటర్ల ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనుల డిజైన్ మ్యాప్ ఫైనల్ చేయాలి
## మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం, భూసేకరణ అంశాలపై సమీక్షించిన జిల్లా కలెక్టర్

ఖమ్మం ,ఆగస్టు 01 (వుదయం ప్రతినిధి): ఖమ్మం మున్నేరు అభివృద్ధి పనులతో పాటు అవసరమైన భూ సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ క్యాంప్ కార్యాలయంలో మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం పురోగతి అభివృద్ధి పనులు, భూ సేకరణ, భూ నిర్వాసితులకు ఇచ్చే లే -ఔట్ పనులపై శుక్రవారం అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు సవసరమైన భూ సేకరణలో భూ నిర్వాసితులకు స్థలాలు ఇవ్వనున్న లే ఔట్ పనుల పురోగతిని, ప్రధాన రహదారి, 10 మీటర్ల ఓవర్ బ్రిడ్జి నిర్మాణ నమునా తదితర అంశాలను అధికారులు వివరించారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ వర్కింగ్ మ్యాప్ ను కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ఖమ్మం రూరల్, అర్బన్ మండలాల్లో రైతులు అంగీకరించిన స్థలం, ప్రభుత్వ పట్టా భూముల్లో పనులు వేగవంతం చేయాలని అన్నారు. రైతుల పొలాలకు ప్రత్యామ్నాయంగా ప్లాట్ లను కేటాయిస్తున్నామని అన్నారు. రైతులకు అందించే లేఔట్ ప్లాట్ లలో అంతర్గత రోడ్లు, స్ట్రీట్ లైట్ , విద్యుత్ సరఫరా పనులు వేగవంతం చేయాలని అన్నారు. రైతులకు లేఔట్ లో జరిగే అభివృద్ధి పనులు చూపించి రిటైనింగ్ వాల్ నిర్మాణానికి భూములు స్వచ్చందంగా అప్పగించేలా కృషి చేయాలని అన్నారు. లేఔట్ లో 10 మీటర్ల బ్రిడ్జి నిర్మాణం పనులకు డిజైన్ ఫైనల్ చేయాలని అన్నారు.

హైదరాబాద్ లోని ప్రైవేట్ లేఔట్ తరహాలో మన లేఔట్ అభివృద్ధి చేయాలని, ఈ పనులు ఎప్పుడు పూర్తి అవుతాయో స్పష్టమైన గడువు నిర్దేశించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, నీటి పారుదల శాఖ డిప్యూటీ ఇఇ. రమేష్ రెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గౌడ జనా హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గీత కార్మికుడి కుటుంబానికి పరామర్శ



యాదాద్రి భువనగిరి / ఆగస్టు 01 (వుదయం ప్రతినిధి): రాజా పేట మండలం దూది వెంకటాపురం గ్రామానికి చెందిన కల్లు గీత కార్మికుడు గొడిశేల శ్రీరాములు అకాల మరణం చెందగా గౌడ జన హక్కుల పోరాట సమితి ( మోకుదెబ్బ ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం జిల్లా అధ్యక్షులు గుల్లపెల్లి వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ... ప్రమాద కరమైన గీత వృత్తి లో నిత్యం అనేక మంది గీత కార్మికులు మృత్యువాత పడుతున్నారు అని, వారి కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా అనేక ఇబ్బందులు పడుతున్నాయని, ఇప్పటికైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి భద్రతకు సంబంధించి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, చనిపోయిన గీత కార్మికుడు శ్రీరాములు కుటుంబానికి 10 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దూడల లక్ష్మణ్ గౌడ్, దూడల సిద్ధయ్య గౌడ్, దూడల వీరస్వామి గౌడ్, మొరిగాడి ఉప్పలయ్య గౌడ్, గడ్డమీది బిక్షపతి గౌడ్, దూది వెంకటాపురం గౌడ సంఘం అధ్యక్షులు గొడిశాల వినయ్ గౌడ్, గొడిశాల కరుణాకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


# అమరుల యాది కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

## కేజీకేఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు
## నేటి నుండి 18 వరకు అమరుల యాది



హనుమకొండ, ఆగస్టు 01(వుదయం జిల్లా ప్రతినిధి) : కల్లుగీత కార్మికుల హక్కుల కోసం పోరాడి అమరులైన వారిని గుర్తు చేసుకుంటూ గీతకార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేందుకు ఆగస్టు 2 న బొల్లాగాని పుల్లయ్య వర్ధంతి రోజు ప్రారంభమై సర్దార్ సర్వాయి పాపన్న జయంతి రోజు 18 న ముగింపు చేస్తామనిఈ యాత్రలో గీత కార్మికులు, శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గొని సాంబయ్య గౌడ్, బుర్ర శ్రీనివాస్ గౌడ్ లు పిలుపునిచ్చారు. శుక్రవారం కాజీపేటలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ యాత్రల సందర్భంగా ప్రమాద నివారణకు తీసుకోవలసిన చర్యలు, కాటమయ్య రక్షణ కవచం ప్రాధాన్యత, ఆరోగ్య సంరక్షణ , స్ఫూర్తిదాతల జీవిత విశేషాల తదితర అంశాలపై గీత కార్మికులకు అవగాహన కల్పించాలని కోరారు. కల్లుగీత కార్మికులను సంఘటితం చేసేందుకు 1957 లో 67 సంవత్సరాల క్రితమే సంఘం ఏర్పాటు చేసుకున్నామన్నారు. కామ్రేడ్ ధర్మ బిక్షం, తొట్ల మల్సూర్ , బైరు మల్లయ్య, దేశిని చిన్న మల్లయ్య తదితర నాయకుల నాయకత్వంలో సొసైటీ, టిఎఫ్ టీల ఏర్పాటు , చెట్టుపై గీత కార్మికునికి హక్కు ఎక్స్‌గ్రేషియా, పెన్షన్ తదితర సాధించుకోవడం జరిగిందన్నారు. కల్లుగీత వృత్తి పై లక్షలాదిమంది ఆధారపడి జీవిస్తుంటే కార్పొరేట్ సంస్థలు, పెట్టుబడుదారులు తమ లాభాల కోసం లిక్కర్, థమ్స్ అప్ కోకో కోలా లాంటి శీతల పానీయాలు విపరీతంగా తీసుకురావడం వల్ల వృత్తి దెబ్బతింటుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఖజానా నింపుకోవడానికి వీరికే ప్రోత్సాహం కల్పిస్తున్నారని ఫలితంగా గీత కార్మికులు ఉపాధి కోల్పోయి రోజు కూలీలుగా మారిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రకృతి సంపద ఒక కోటి తాటి ఈత చెట్లు ఉన్నాయి. కల్లు తో పాటు నీరా, తాటి, ఈత ఉత్పత్తులు తయారుచేసి ఉపాధి కల్పించవచ్చని, రాష్ట్ర ప్రభుత్వము ప్రత్యేక ప్రణాళిక రూపొందించి వీరి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు పెన్షన్ 4 వేలకు, ఎక్స్ గ్రేషియా 10 లక్షల కు పెంపు, సొసైటీ కి 5 ఎకరాల భూమి, నీరా తాటి ఈత ఉత్పత్తుల పరిశ్రమ అభివృద్ధి, ట్యాంక్ బండ్ పై పాపన్న విగ్రహం ఏర్పాటు, జనగామ జిల్లాకు పాపన్న పేరు పెడతామని ఇచ్చిన తదితర హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల నివారణకు వృత్తి చేసే గీత కార్మికులందరికీ సేఫ్టీ కిట్లు ఇవ్వాలని, పెండింగ్ ఎక్స్ గ్రేషియా డబ్బులు 12 కోట్ల 94 లక్షల రూపాయలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా నందనంలోని నీరా, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమ ప్రారంభించాలని, హైదరాబాదులోని నీరా కేఫ్ ను టెండర్ వేసి వచ్చిన ఆదాయంలో గీతకార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాలని అన్నారు. కల్లు ఎప్పటికీ ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ సలహాదారులు మొదం రాజేందర్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు నాగపూర్ రాజయ్య గౌడ్, పిల్లల కుమారస్వామి గౌడ్, గొని ఫణీందర్ గౌడ్, గీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ ఆటో కార్మికుల దినోత్సవం



బెల్లంపల్లి, ఆగస్టు1 (వుదయం ప్రతినిధి) ప్రపంచ ఆటో కార్మికుల దినోత్సవం పురస్కరించుకొని మండల్ ఆటో యూనియన్ అధ్యక్షులు మామహమ్మద్ హబీబ్ పాషా ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఐబి ఆటో స్టాండ్ వద్ద కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఆటో యూనియన్ మండల కోశాధికారి ఓరగంటి శుభాకార్ మాట్లాడుతూ.. ప్రపంచ ఆటో కార్మికుల దినోత్సవం జరుపుకోలేని దయనీయ పరిస్థితిలో ఉన్న ఆటో డ్రైవర్ల ఐక్యతను చాటుకోవడం కోసం తప్పనిసరి పరిస్థితిలో ఈ కార్యక్రమం జరుపుకుంటున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. జనరల్ సెక్రెటరీ కొత్త శంకర్ మాట్లాడుతూ మండల ఆటో యూనియన్ నుంచి ఆటో కార్మికులకు ఎలాంటి సమస్య వచ్చిన ఇప్పటివరకు మా ఆటో యూనియన్ తరపున సహాయ సహకారాలు అందిస్తూ కార్మికుల సంక్షేమం సంక్షేమం కోసం పాటుపడుతున్నామని ఇక ముందు కూడా ఆటో కార్మికుల సహాయ సహకారాలతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. అధ్యక్షులు మహమ్మద్ హబీబ్ పాషా మాట్లాడుతూ మండలంలోని ప్రతి ఆటో కార్మికులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని మనం ఎంచుకున్న ఆటో డ్రైవర్ వృత్తిలో అనునిత్యం ప్రమాదం పొంచి ఉందనే విషయాన్ని గ్రహించి మద్యం సేవించి ఆటోలు నడపరాదని కోరారు. ప్రపంచ ఆటో కార్మికుల దినోత్సవ వేదికగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకానికి మేము వ్యతిరేకం కాదని ఆర్థిక ఇబ్బందులతో ఇప్పటికే 87 మంది ఆటో కార్మికులు ఆత్మహత్య చేసుకుని చనిపోయారని పట్టీ పట్టనట్టు వ్యవహరిస్తుందని ఇప్పటికైనా ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో కార్మికులకు 2023 ఎన్నికల సమయంలో ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని సంవత్సరానికి ?12,000 ఇస్తామని వాగ్దానం చేసి ఇప్పటివరకు వాటి ఊసు కూడా ఎత్తడం లేదు ఇప్పటికైనా రాబోయే అసెంబ్లీ సమావేశాలలో ఆటో డ్రైవర్ల కోసం చర్చించి దయచేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు చంద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి కొత్త శంకర్. కోశాధికారి ఓరగంటి శుభాకార్ సలహాదారు విద్యాసాగర్ గౌరవ సలహాదారులు రాజనంద్, కార్య నిర్వాహక సభ్యులు రేగుల రవి, వివిధ అడ్డా అధ్యక్షులు కార్మికులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

## జిల్లా కార్యవర్గ మొదటి సమావేశంలో జిల్లా అధ్యక్షులు చీటి శ్రీనివాస రావు



జగిత్యాల ఆగస్టు01( వుదయం విలేకరి ) జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని టీ యు డబ్ల్యూజే (ఐజెయు) జిల్లా అధ్యక్షులు చీటి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం స్థానిక ప్రెస్ క్లబ్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సంక్షేమం కోసం పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. వృత్తి పరంగా ఎన్నో ఒత్తిడిలకు లోనవుతూ అనారోగ్యానికి గురవుతున్న జర్నలిస్టులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కోసం జర్నలిస్టు సంక్షేమ నిధిని ఏర్పాటు చేసేందుకు తీర్మానించారు. జిల్లా కార్యవర్గంలో ప్రాతినిధ్యం లేని మండలాల నుండి స్థానిక ప్రెస్ క్లబ్ బాధ్యుల సూచనతో జిల్లా కమిటీ లోకి తీసుకోవాలని నిర్ణయించారు. ఓటర్ లిస్ట్ లో తప్పులను సవరించి అర్హులైన కొత్త సభ్యులకు సభ్యత్వం ఇస్తూ సభ్యులందరికీ గుర్తింపు కార్డులు అందజేయాలని సమావేశంలో తీర్మానించారు. మండల ప్రెస్ క్లబ్బులను బలోపేతం చేయడంతో పాటు గడువు ముగిసిన మండల ప్రెస్ క్లబ్ ల ఎన్నికలు నిర్వహించేందుకు కస్వీనర్లను నియమించి రెండు నెలలలోగా ఎన్నికలు జరిపేందుకు తీర్మానించారు. జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానించి జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించాలని తీర్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు చీటీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎలాంటి భేదాభిప్రాయాలకు తావివ్వకుండా జిల్లాలోని సీనియర్ జర్నలిస్టుల సహకారంతో జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా జిల్లా యూనియన్ పనిచేస్తుందన్నారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జంకి సంపూర్ణ చారి, ఐజేయు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జె. సురేందర్ కుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగుల గోపాల చారి, లక్ష్మణ్ యాదవ్, టీవీ సూర్యం, ఆదిల్, జిల్లా బాధ్యులు సిరిసిల్ల వేణు గోపాల్, హరికృష్ణ, హైదర్, అల్లె రాము, చంద్రశేఖర్, రాజకుమార్, నరేష్,బత్తిని.పవిత్ర సంపత్,జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# విజయవంతంగా పోలీస్ డ్యూటీ మీట్



హనుమకొండ, ఆగస్టు 01(వుదయం జిల్లా ప్రతినిధి) : వరంగల్ పోలీస్ కమిషనరేట్ అధ్వర్యంలో మామునూరు పిటిసి వేదికగా నిన్న ప్రారంభమైన రెండవ తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్, రోజువ రోజు విజయవంతంగా కొనసాగుతున్నాయి. రెండువ రోజున్కె నేడు డ్యూటీ మీట్‌లో భాగంగా శుక్రవారం బాంబ్ డిస్పోజల్, పోలీస్ జాగిలాలకు సంబంధించి నాలుగు విభాగాలు, కంప్యూటర్, వీడియాగ్రఫీ సైటిఫిక్ ఏయిడ్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ రెండవ రోజున నిర్వహిస్తున్న పోటీలను పర్యవేక్షించడంతో పాటు డ్యూటీ మీట్ ఏర్పాట్లపై ఈ పోటీల్లో పాల్గోన్న పోలీస్ అధికారులను అడిగి తెలుసుకోగా, డ్యూటీ మీట్ ఏర్పాట్లు బాగున్నాయని ముఖ్యంగా వసతి,భోజన ఏర్పాట్లపై పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలియజేసుకున్నారు. ఈ డ్యూటీ మీట్ ఏర్పాట్లను ఏర్పటికప్పుడు పర్యవేక్షించిన అదనపు డిసిపిలు రవి, సురేష్‌కుమార్,శ్రీనివాస్‌తో పాటు ఇతర పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ అభినందించారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఈ డ్యూటీ మీట్ పోటీలు రేపటితో ముగుస్తాయని. రేపు సాయంత్రం ఐదు గంటల నుండి జరగబోయే ముగింపు వేడుకలను ముఖ్య అతిధిగా రాష్ట్ర పోలీస్ డీజీపీతో డా. జితేందర్‌తో పాటు, జైళ్ళ విభాగం డీజీపీ డా.సౌమ్య మిశ్రా విశిష్ట అతిధిగా పాల్గోంటారని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# సీసీ రోడ్ లకు శంకుస్థాపన చేసిన జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు డా.కోట రాంబాబు



మధిర ఆగస్టు 1 (వుదయం ప్రతినిధి): ఎర్రుపాలెం మండలం రేమిడిచర్ల గ్రామంలో ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురామ్ రెడ్డి కృషితో ఎంపీ లాడ్ నిధుల ద్వారా మంజూరు అయిన సీసీ రోడ్ లను జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు డా.కోట రాంబాబు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ జిల్లాలోనే అత్యధిక మెజారిటీ వచ్చిన మధిర నియోజకవర్గం మీద ప్రత్యేక దృష్టితో అంతర్గత రోడ్స్ కి నిధులు మంజూరు చేసిన ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురామ్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ ఐలూరి వెంకటేశ్వర రెడ్డి, మాజీ సర్పంచ్ పురుషోత్తం రాజు, సామినేని చెన్నకేశవరావు, మాదల కృష్ణారావు,బత్తుల పుల్లారావు, గుండ్ల రత్నబాబు,మంద కాంతారావు,సంతోష్ కుమార్, దావీద్, తిమోతి, చిరంజీవి, ఉదయ్, బంటు,పుష్ప రాజ్, దాసు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# వైద్యుల సలహాలు సూచనల మేరకు క్రమం తప్పక మందులు వాడాలి

**–జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి ఆగస్టు01(వుదయం ప్రతినిధి): వ్యాధులతో బాధ పడే ప్రజలు వైద్యుల సలహాలు, సూచనలతో మేరకు క్రమం తప్పక మందులు వాడాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు శుక్రవారం గణపురం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సేవలకు వచ్చిన ప్రజలతో సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీ పేరేంటి అని గట్టయ్యను అడిగి తెలుసుకుని ఏమి సమస్య ఉంది, వైద్యులు మంచిగా చూశారా లేదా మందులు ఇచ్చారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం లక్ష్మీ అనే మహిళతో మాట్లాడారు. ఈ సందర్భంగా లక్ష్మీ మాట్లాడుతూ తేలు కుట్టినందున వైద్య సేవలకు వచ్చానని తెలుపగా మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు హెల్త్ ప్రొఫైల్ తయారు చేయాలని సూచించారు. ఓపి రిజిస్టర్, స్టోర్ రూము ను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని స్పష్టం చేశారు.ప్రాథమిక సహకార సంఘం ఎరువుల విక్రయ కేంద్రాన్ని తనిఖీ చేసి ఎరువుల నిల్వలు పరిశీలించారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని, రైతులు అవసరం మేర తీసుకోవాలని సూచించారు. ధరల పట్టిక, స్టాకు రిజిస్టర్ పరిశీలించారు. ఈ రోజు ఇప్పటి వరకు ఎంత మంది రైతులు యూరియా తీసుకున్నారని వివరాలు అడుగగా 13 మంది రైతులకు 30 బస్తాలు యూరియా ఇచ్చామని తెలిపారు. ఎరువులు, విత్తన దుకాణాలను నిత్యం పర్యవేక్షణ చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో భూ భారతి దరఖాస్తులు, స్టోర్ రూములను పరిశీలించారు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు భూ భారతి దరఖాస్తులు. పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ను ఆదేశించారు. నోటీసు లు జారీ, విచారణ ప్రక్రియ, దరఖాస్తులు తిరస్కరణ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. తిరస్కరించిన దరఖాస్తు దారులకు కారణాలు తెలియచేయాలని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయ సందర్శనలో కార్యాలయానికి వచ్చిన వయోవృద్ధునితో ఏ సమస్య కొరకు వచ్చారని అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, గృహ నిర్మాణ శాఖ పిడి లోకిలాల్, జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపిడిఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# సిటీ స్కాన్ యంత్రం ఏర్పాటు పనులను వేగవంతం చేయండి

**–జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి ఆగస్టు 01(వుదయం ప్రతినిధి): జిల్లా కేంద్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో సిటీ స్కాన్ పరికరం ఏర్పాటుకు చేపట్టిన పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు సమయానుకూలంగా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిటీ స్కాన్ పరికరం ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు పనుల్లో ఆలస్యం లేకుండా, సంబంధిత ఇంజినీరింగ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సిటీ స్కాన్ యంత్రం ఏర్పాటుతో ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆసుపత్రి పర్యవేక్షకులు డా నవీన్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నూతన అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ బాధ్యతలు స్వీకరణ



జయశంకర్ భూపాలపల్లి ఆగస్టు01(వుదయం ప్రతినిధి): గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ మహాదేవపూర్ నూతన అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ గా కారెంగుల రాజన్న శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు మంచిర్యాల జిల్లా నుండి బదిలీపై వచ్చిన గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ కారెంగుల రాజన్న మహాదేవపూర్ మండల కేంద్రంలోని కార్యాలయంలో నూతన అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ గా బాధ్యతలు స్వీకరించారు మహాదేవపూర్ మండల ఎస్ ఈ ఆర్ పి సిబ్బంది శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు బాధ్యతలు స్వీకరించిన అనంతరం అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ కార్యాలయానికి సంబంధించిన సమాచారాన్ని సిబ్బందికి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

# బిట్స్ స్కూల్లో మాక్ ఎలక్షన్స్ సందడి.

**–విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి.**

**–ప్రిన్సిపల్ పిండి యుగంధర్.**



పరకాల ఆగస్టు 1 (వుదయం ప్రతినిధి): పరకాల పట్టణంలోని బిట్స్ పాఠశాలలో ప్రిన్సిపల్ పిండి యుగేందర్ ఆధ్వర్యంలో మాక్ ఎలక్షన్ల ను నిర్వహించడం జరిగింది బిట్స్ పాఠశాలలో విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించి తద్వారా ఓటింగ్ విధానం పై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉత్సాహంగా మాక్ పోలింగ్ లో పాల్గొన్నారు.పాఠశాల ఎస్ పి ఎల్ , ఏ ఎస్ పి ఎల్ గా విద్యార్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఉపాధ్యాయులు ఎన్నికల అధికారులుగా ఉంటూ అభ్యర్థులకు గుర్తులను కేటాయించి విద్యార్థులందరినీ ఉత్సాహంగా మాక్ పోలింగ్ లో పాల్గొనేటట్లు ఉత్సాహపరుస్తూ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులు బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేయడం చాలా బాగుందని తెలియజేశారు . మాక్ ఎలక్షన్ లో భాగంగా గెలుపొందిన ఎస్ పి ఎల్ గా సూర.చాందిని, ఏ ఎస్ పి ఎల్ గా తంగళ్ళపల్లి, యశస్విని అభ్యర్థులను బిట్స్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తూ అభినందనలు తెలియపరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఓటు రాజ్యాంగం కల్పించినటు వంటి హక్కు అని భవిష్యత్తులో ఓటును ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా సరైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమములో పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు ముఖ్య ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తూ కార్యక్రమమును దిగ్విజయం చేశారు . ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జైదాస్ కథ కు ముల్కనూరు సాహితీ పీఠం అవార్డ్



మధిర ఆగస్టు 1 (వుదయం ప్రతినిధి): తెలుగు రాష్ట్రాల్లో ప్రఖ్యాతి చెందిన ముల్కనూరు సాహితీ పీఠం వారి జాతీయ స్థాయి కథలపోటీలో ఈ ఏడాది మధిరకు చెందిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జైదాస్ వ్రాసిన మరో గాలివాన అనే కథ ఎంపికయింది.తెలుగు కథలకు పట్టం కట్టేందుకు నమస్తే తెలంగాణ పత్రిక సహకారంతో ముల్కనూరు సాహితీ పీఠం వారి కథల పోటీకి రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక అమెరికా, ఆఫ్రికా దేశాల నుండి కూడా వచ్చిన 417 కథల్లో 70 కథలు సెలెక్ట్ కాగా అందులో జైదాస్క కథ బహుమతికిఎన్నికయింది.జులై 27 న జరిగిన సభలో ములకనూరు సాహితీ పీఠం అధిపతి వేముల శ్రీనివాసులుచే నగదు బాహుమతితోపాటు ప్రశంసా పత్రంతో సత్కరించటం జరిగింది. ఈ సందర్భంగా జైదాస్ ని పలువురు అభినందించడం జరిగింది. ఇప్పటికే కార్టూనిష్టు గా కూడా మంచి గుర్తింపు పొందిన జైదాస్ ఇటీవలనే తన కార్టూన్లను జైదాస్ జాయ్ టూన్స్ అనే పుస్తకరూపం లో తీసుకురాగా దానిని తెలుగు కార్టూనిష్టుల దినోత్సవం రోజున హైదరాబాద్ రవీంద్రభారతిలో హాస్యానందం పత్రిక ఎడిటర్ రాము కార్టూనిస్ట్ బాచి ఆధ్వర్యం లో ప్రముఖ సినీనటులు రాజేంద్రప్రసాద్, తనికెళ్ళ భరణి ఆవిష్కరించడం జరిగింది.

# కాటారం మార్కెట్ కమిటీ డైరెక్టర్లకు సన్మానం



జయశంకర్ భూపాలపల్లి ఆగస్టు 01(వుదయం ప్రతినిధి): కాటారం మార్కెట్ కమిటీ నూతన డైరెక్టర్లుగా నియమితులైన ఎండీ ఈర్షద్, పోతే రామకృష్ణ లను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నారం గ్రామం మాజీ ఎంపీటీసీ శాల్వల తో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు సన్మానించారు ఈ సందర్భంగా మంచినీళ్ల దుర్గయ్య మాట్లాడుతూ మహాదేవపూర్ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు ఆసిస్సులతో కాటారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా మహాదేవపూర్ ప్రాంతానికి చెందిన ఎండీ ఈర్షద్, పోతే రామకృష్ణ లకు డైరెక్టర్లుగా అవకాశం దక్కడం హర్షనీయమని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఐతా తిరుపతిరెడ్డి, కోట సమ్మయ్య, ధర్మయ్య, షంషీర్ ఖాన్, తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఆర్టీసీ బస్సులను ప్రారంభించి, స్వయంగా బస్ నడిపిన పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి.



పరకాల ఆగస్టు 1 (వుదయం ప్రతినిధి): పరకాల పట్టణ ఆర్టీసీ బస్టాండ్ నందు నాలుగు నూతన ఆర్టీసీ బస్సులను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం స్వయంగా బస్సు నడిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మొట్టమొదటి సారిగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం విజయవంతంగా కొనసాగుతున్నదని,2023 డిసెంబర్ 9 నుంచి మహాలక్ష్మి పథకం అమల్లోకి రాగా.. ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేస్తున్నారని అన్నారు.తెలంగాణ, కర్ణాటకలో మాత్రమే మహిళలకు ఉచిత బస్ ప్రయాణాన్ని అందిస్తున్నారని,త్వరలో ఇతర రాష్ట్రాల్లో కూడా అమలు చేయబోతున్నారని అన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా 200 కోట్ల టికెట్ల పై ఉచిత బస్ ప్రయాణాల ద్వారా ఆర్టీసీ కి 6వేల కోట్లు లాభం వచ్చిందని తెలిపారు.రాష్ట్రంలోని కోటి మంది మహిళల ను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ఆర్టీసీ బస్సులు, సోలార్ ప్లాం ట్లు, క్యాంటీన్లు, ధాన్యం కొనుగోలుకేంద్రాలు, డెయిరీ యూనిట్, ఇతర స్వయం ఉపాధి పథకాలతో ఆర్థికంగా భరోసా అందిస్తుందని వెల్లడించారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరా మహిళాశక్తి పథకంతోమహిళా సంఘాలు బస్ లు కొనుగోలు ద్వారా ఆర్థికంగా ప్రగతి సాధిస్తుందని అన్నారు.ప్రజా రవాణాకు సంబంధించి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.త్వరలో పరకాల డిపోకు మరిన్ని బస్ లు రాబోతున్నాయని,పెరిగిన రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులను కొనుగోలు చేస్తున్నామని,ఉచిత బస్ ప్రయాణం ద్వారా మహిళలకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుంది అన్నారు.

# సురేందర్ మరియు హనుమంత్ ఆధ్వర్యంలో భారీగా కాంగ్రెస్ లో చేరిన పలు పార్టీ నాయకులు



శేర్లింగంపల్లి: ఆగస్టు 01(వుదయం ప్రతినిధి): ప్రజా సమస్యల పట్ల అవగాహనతో బడుగు బలహీన వర్గాల కు అండగా నిలుస్తున్న కాంగ్రెస్ పార్టీ పట్ల ఆకర్షితులై పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ జెర్పిటీ జైపాల్ అన్నారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సురేందర్ మరియు హనుమంతుల ఆధ్వర్యంలో శుక్రవారం పెద్ద ఎత్తున యువకులు కాంగ్రెస్ పార్టీ కిఆకర్షితులై పార్టీ తీర్థం పుచ్చుకోవటం జరిగింది. ఈ సందర్భంగా ఎంబీసీ చైర్మన్ జేరి పి టి జైపాల్ మాట్లాడుతూ గడిచిన 10 సంవత్సరములు లేని అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ లో కనిపించడంతో ప్రజలు కాంగ్రెస్ పార్టీ పథకాలకు ప్రణాళికలకు ఆకర్షితులై మద్దతు తెలియజేస్తున్నారని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధికి అత్యుత్తమ ప్రణాళికలతో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బడుగు బలహీన వర్గాల పక్షపాతిగా ఎన్నో పథకాలు తీసుకురావడం జరిగిందని ఆయన అన్నారు. నిరంతరం ప్రజలతో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కరించడమే చేయంగా ముందడుగు వేస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి డివిజన్ కాంగ్రెస్ నాయకులు సురేందర్ మాట్లాడుతూ గచ్చిబౌలి డివిజన్ ని ఆదర్శవంతమైన డివిజన్ గా మార్చడమే కాకుండా ప్రభుత్వ పథకాలు అందరికీ అందించటమే ధ్యేయంగా పనిచేస్తామని అని తెలిపారు. గ్రేటర్ ఎన్నికలలో కాంగ్రెస్ జెండా ఎగర వేయటం ఖాయమని ఆయన తెలిపారు. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి పనుల ను చూసి వివిధ పార్టీలోని కార్యకర్తలు పెద్ద సంఖ్య లో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఇది ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామచంద్రరాజు, హనుమంతు, శ్రీనివాస్, భీమ్రాజ్, నవీన్, విజయ్, పవన్, శివ తదితరులు పాల్గొన్నారు.

# టఫ్ ఆధ్వర్యంలో అభినందన సన్మానం




జయశంకర్ భూపాలపల్లి ఆగస్టు 01(వుదయం ప్రతినిధి):తెలంగాణ తొలి దశ ఉద్యమకారులు ఎండీ ఇర్షాద్ అహ్మద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా నియమితులైన సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం టఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం శాలువాతో సన్మానించి,అభినందన పూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టఫ్ మండల అధ్యక్షులు సట్ల సత్యనారాయణ,రాష్ట్ర నాయకులు ఆయూబోద్దీన్ తో పాటు ఉద్యమకారులు వామన్ రావు, ఆన్కారి ప్రభాకర్, కేదారి ప్రవీణ్,రఫీ అహ్మద్,బషీర్ అహ్మద్ ఖాన్, అక్రమోద్దీన్, కోల అశోక్,ధనుంజయ్,పోత రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జోగులాంబ హాల్ట్, గద్వాల రైల్వే పనులు వచ్చే జూన్ నాటికి పూర్తి చేయాలి

**–రైల్వే జి.ఎమ్.సంజయ్ కుమార్ శ్రీ వాస్తవ**



గద్వాల ఆగస్టు 01 (వుదయం ప్రతినిధి):జోగులాంబ గద్వాల జిల్లా రైల్వే అభివృద్ధి పనుల పర్యటనలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ శుక్రవారం జిల్లా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన జోగులాంబ హాల్ట్ వద్ద కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని, గద్వాల ప్రధాన రైల్వే స్టేషన్ లో జరుగుతున్న ఆధునీకరణ పనులు, మరింత సదుపాయాల కల్పన, ప్లాట్‌ఫార్ముల విస్తరణ, ప్రయాణికుల భద్రత కోసం చేపట్టిన చర్యలను జీ.యం పరిశీలించారు. రైల్వే స్టేషన్‌ను ఆధునిక సదుపాయాలతో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గద్వాల మార్గంలో రైలు ద్వితీయ లైన్ (డబ్లింగ్ (ట్రాక్) పనులు పూర్తి అయిన తర్వాత రైళ్ల రద్దీ తగ్గి, వేగవంతమైన రైలు సేవలు అందుబాటు లోకి వస్తాయని తెలిపారు.

# బిజినెస్



# అమెరికాకు కోలుకోలేని దెబ్బ..

## F-35 యుద్ధ విమానాలను కొనుగోలుకు భారత్ నిరాకరణ



ట్రంప్ దెబ్బ మామూలుగా పడలేదు. భారత్‌పై కనికరం లేకుండా 25శాతం సుంకాలని వేశారు. భారత్ పాక్ యుద్ధాన్ని ఆపేశాను.. అవన్నీ ట్రేడ్ డీల్స్ బెదిరింపులతోనే అంటూ గప్పాలు కొట్టుకున్న అమెరికా అధ్యక్షుడు.. ఇప్పుడు భారత్‌ను దొంగదెబ్బతీశారు. 25శాతం సుంకాలతోపాటు.. బయటకు చెప్పని పెనాల్టీ కూడా విధించారు. రష్యాతో భారత్ వాణిజ్యం చేస్తున్న కారణంగానే పెనాల్టీ విధిస్తున్నట్లు ప్రకటించారు. అంటే 25శాతం ప్లస్ పెనాల్టీ అంటే అది ఎంత శాతానికి చేరుతుందో ఇప్పుడే బయటపడే విషయం కాదు. భారత్‌పై అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల పిడుగు వేశారు. పాతిక శాతం సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించారు. దీనికి అనేక కారణాలు చెబుతున్నా.. అక్కసుతోనే ఈ టారిఫ్‌లు వేశారన్నది సుస్పష్టం. బ్రిక్స్‌లో భాగమైనందుకు, రష్యా ఆయిల్ కొంటున్నందుకు, తమ వస్తువులపై ఎక్కువ పన్నులు వేస్తున్నందుకు ఇలా అనేక విషయాలను మనసులో పెట్టుకుని ట్రంప్ భారత్‌పై పిడుగులాంటి టారిఫ్‌ను సంధించారు.

ఇది ప్యూర్ మైండ్‌గేమ్‌తో తీసుకున్న డెసిషన్. దీంతో భారత్‌లో పొలిటికల్ దుమారం కూడా చెలరేగింది. ఈ క్రమంలోనే వాణిజ్య ఒప్పందం గురించి భారత్-అమెరికా మధ్య చర్చలు జరుగుతున్నాయి. అయితే, ఈలోగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశంపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఆగస్టు 7 నుండి ఈ సుంకాలు అమలులోకి రానున్నాయి. ఈ నేపథ్యంలోనే భారతదేశం కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. నివేదిక ప్రకారం, అమెరికాకు F-35 యుద్ధ విమానాలను కొనుగోలు చేయడానికి భారత్ నిరాకరించింది.

అమెరికన్ ఉత్పత్తుల కొనుగోలును వేగవంతం చేయాలని భారత ప్రభుత్వం ఆలోచిస్తున్నప్పటికీ, అమెరికా నుండి అదనపు రక్షణ ఉత్పత్తులను కొనుగోలు చేసే అవకాశం లేదని అధికారులను ఉటంకిస్తూ బ్లూమ్‌బెర్గ్ తన కథనంలో పేర్కొంది. బ్లూమ్‌బెర్గ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం, F-35 స్టీల్త్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ కొనుగోలుపై ఆసక్తి లేదని భారత్ అమెరికాకు తెలియజేసిందని పేర్కొంది. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫిబ్రవరి 2025లో అమెరికాను సందర్శించారు. వైట్ హౌస్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కలిశారు. ఈ సందర్భంగా, ట్రంప్ భారతదేశానికి F- 35 యుద్ధ విమానాలను విక్రయించడానికి ముందుకొచ్చారు. అయితే దేశీయంగా రక్షణ పరికరాల ఉమ్మడి రూపకల్పన, తయారీపై దృష్టి సారించిన భాగస్వామ్యాలపై భారత ప్రభుత్వం ఎక్కువ ఆసక్తి చూపుతుందని అధికారులు తెలిపారు. దీనిపై భారత రక్షణ మంత్రిత్వ శాఖ ఇంకా స్పందించలేదు. ఆగస్టు 1 నుండి భారతదేశం నుండి దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 25 శాతం సుంకాన్ని ప్రకటించారు. రష్యా నుండి దిగుమతులకు శిక్షాత్మక చర్యగా భారతదేశంపై జరిమానాను కూడా విధించారు. ఇది 25 శాతం సుంకం నుండి వేరుగా ఉంటుంది. భారతదేశం సుంకాలు చాలా ఎక్కువగా ఉన్నందున అమెరికా భారతదేశంతో సాపేక్షంగా తక్కువ వాణిజ్యం చేసిందని ట్రంప్ భావిస్తున్నారు.



# జపాన్‌ను అధిగమించి భారతదేశం..

సౌరశక్తి ఉత్పత్తిలో జపాన్‌ను వెనక్కి నెట్టి భారతదేశం ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద దేశంగా అవతరించిందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. అంతర్జాతీయ పునరుత్పాదక ఇంధన సంస్థ నుండి వచ్చిన డేటాను ఉటంకిస్తూ, భారతదేశం ఇప్పటివరకు 1,08,494 గిగావాట్ అవర్ సౌరశక్తిని ఉత్పత్తి చేసిందని, జపాన్ 96,459 GWh సౌరశక్తిని ఉత్పత్తి చేసిందని ఇంధన మంత్రి అన్నారు. భారతదేశం జపాన్‌ను అధిగమించింది. ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద సౌరశక్తి ఉత్పత్తిదారుగా అవతరించిందని కేంద్ర ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రకటించారు. అంతర్జాతీయ పునరుత్పాదక ఇంధన సంస్థ నుండి డేటాను ఆయన ప్రస్తావించారు. భారతదేశం ఇప్పటివరకు 1,08,494 గిగావాట్ గంటల సౌరశక్తిని ఉత్పత్తి చేసిందని, జపాన్ 96,459 GWh సౌరశక్తిని మాత్రమే ఉత్పత్తి చేసిందని ఆయన స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో భారతదేశం ప్రపంచ క్లీన్ ఎనర్జీ విప్లవానికి నాయకత్వం వహిస్తోందని కేంద్ర మంత్రి అన్నారు. 2030 నాటికి 500 గిగావాట్ల శిలాజేతర ఇంధన ఆధారిత విద్యుత్ సామర్థ్యం అనే ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని చేరుకోవడానికి భారత్ బహుముఖ విధానంతో పనిచేస్తున్నందున ఈ విజయం సాధ్యమైందన్నారు.

ఈ దిశలో భారతదేశం సాధించిన పురోగతి ఇంధన భద్రతను పెంచడమే కాకుండా ప్రపంచ వాతావరణ మార్పులకు వ్యతిరేకంగా ఒక బలమైన అడుగుగా కూడా నిరూపితమైందన్నారు. అంతర్జాతీయ ఇంధన సంస్థ 2024 డేటా ప్రకారం, సౌర PV సామర్థ్య వృద్ధిలో చైనా ముందుంది. ఇది 2023లో 260 గిగావాట్లను ఉత్పత్తి చేసింది. ఇది మునుపటి సంవత్సరం కంటే దాదాపు మూడు రెట్లు ఎక్కువ. చైనా 14వ పునరుత్పాదక ఇంధన ప్రణాళిక 2022లో అమలు చేయడానికి ప్రతిష్టాత్మక లక్ష్యాలను నిర్దేశించుకుంది.



# తగ్గిన బంగారం గిరాకీ

## అధిక ధరలే ప్రధాన కారణం

ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత్‌లో గోల్డ్ డిమాండ్ వార్షిక ప్రాతిపదికన 10 శాతం తగ్గి 134.9 టన్నులకు పరిమితమైందని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) గురువారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. గత ఏడాది ఇదే కాలానికి పసిడి గిరాకీ 149.7 టన్నులుగా నమోదైంది. విక్రయాల విలువ పరంగా చూస్తే, ఈ జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో బంగారం డిమాండ్ 30 శాతం పెరిగి రూ.1,21,800 కోట్లకు చేరింది. క్రితం సంవత్సరంలో ఇదే సమయానికి డిమాండ్ విలువ రూ.93,850 కోట్లుగా నమోదైంది. సమీక్షా కాలంలో బంగారం ధర తొలిసారిగా రూ.లక్షకు చేరడంతో.. గిరాకీ పరిమాణం తగ్గినప్పటికీ, విలువలో వృద్ధి నమోదైందని డబ్ల్యూజీసీ రీజినల్ సీఈఓ- ఇండియా సచిన్ జైన్ అన్నారు. ఈ ఏడాది ప్రథమార్ధం(జనవరి-జూన్)లో బంగారం గిరాకీ దాదాపు 253 టన్నులుగా ఉండగా.. పూర్తి ఏడాదికి గిరాకీ 600-700 టన్నుల స్థాయిలో ఉండవచ్చని ఆయన అంచనా వేశారు. అధిక ధరల కారణంగా జూన్ క్వార్టర్‌లో స్వర్ణాభరణాల విక్రయాలు 17 శాతం తగ్గి 88.8 టన్నులకు పరిమితమయ్యాయి. 2024లో ఇదే కాలానికి 106.5 టన్నుల సేల్స్ జరిగాయి. గోల్డ్ జువెలరీ విక్రయాల విలువ మాత్రం 20ు వృద్ధితో రూ.80,150 కోట్లుగా నమోదైంది. ఈ ఏప్రిల్-జూన్‌లో బంగారంలో పెట్టుబడులు 7 శాతం పెరిగి 46.1 టన్నులకు చేరగా.. పెట్టుబడుల విలువ ఏకంగా 54 శాతం వృద్ధితో రూ.41,650 కోట్లుగా నమోదైంది. పసిడి దీర్ఘకాలంలో మెరుగైన ప్రతిఫలాలు అందించగలదన్న ఇన్వెస్టర్ల నమ్మకాన్ని ఇది నొక్కి చెబుతోందని సచిన్ జైన్ అన్నారు. జూన్ క్వార్టర్‌లో భారత్‌లోకి పసిడి దిగుమతులు 34 శాతం తగ్గి 102.5 టన్నులుగా నమోదయ్యాయి. గత ఏడాది ఇదే త్రైమాసికంలో దేశంలోకి 150 టన్నుల బంగారం దిగుమతైంది. సమీక్షా కాలంలో గోల్డ్ రీసైక్లింగ్ (పాత బంగారం పునర్వినియోగం) ఒక శాతం పెరుగుదలతో 23.1 టన్నులుగా నమోదైంది. ఈ ఏప్రిల్ - జూన్‌లో ప్రపంచవ్యాప్తంగా బంగారం గిరాకీ 3 శాతం పెరిగి 1,249 టన్నులకు చేరింది. అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (ఈటీఎఫ)లోకి పెట్టుబడులు భారీగా పెరగడం ఇందుకు కారణమని డబ్ల్యూజీసీ తెలిపింది. అంతేకాదు, సెంట్రల్ బ్యాంకులు కూడా 166 టన్నుల బంగారం కొనుగోలు చేశాయని రిపోర్టులో వెల్లడించింది.

# అమెరికా హెచ్చు సుంకాలు అమలు

## అక్వా రైతులకు భారీ నష్టమే




భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించిన హెచ్చు సుంకాలు శుక్రవారం నుంచి అమల్లోకి రానున్నాయి. భారత్‌ను అత్యంత సన్నిహిత మిత్రదేశంగా పేర్కొంటూనే 25 శాతం టారిఫ్‌లను విధించారు. ఆగస్టు 1 గడువు ముందు భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం జరగాల్సి ఉండగా.. ఇంకా ఈ చర్చలు జరుగుతున్నాయి. ఈ తరుణంలోనే ట్రంప్ అధిక సుంకాలను అమల్లోకి తీసుకురావడం గమనార్హం. ట్రంప్ చర్యలతో ప్రధానంగా భారత ఎగుమతి రంగాలైన ఆటో పరికరాలు, స్టీల్, అల్యూమినియం, జెమ్స్ అండ్ జ్యువెలరీ, టెక్స్‌టైల్స్, సముద్రపు ఉత్పత్తులపై ప్రధానంగా ప్రభావం పడనుంది. అమెరికా విధించిన సుంకాలు ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా రొయ్యల ఎగుమతి రంగంపై తీవ్ర ప్రభావం చూపనుంది. భారతదేశ మొత్తం రొయ్యల ఎగుమతిలో ఆంధ్రప్రదేశ్ 70 శాతం కంటే ఎక్కువ వాటాను కలిగి ఉంది.

ఈ రంగంపై దాదాపు 10 లక్షల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని అంచనా. ట్రంప్ ప్రకటించిన 25 శాతం టారిఫ్‌లు ఈ రంగానికి తీవ్ర ఆటంకం కలిగిస్తాయని పరిశ్రమ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తోన్నారు. అధిక సుంకాలలో అమెరికా భారత రొయ్యల ధరలు పెరుగుతాయి. దీంతో పోటీతత్వాన్ని ఎదుర్కోలేవు. ఫలితంగా ఎగుమతి ఆదాయం తగ్గడంతో రొయ్యల సాగుదారులు నష్టాలను చవి చూసే ప్రమాదం ఉంది. ఈ రంగంలోని సంబంధిత ఉద్యోగులు, కూలీల జీవనోపాధి దెబ్బతిననుంది. అదే విధంగా టారిఫ్‌లు రాష్ట్రంలోని వ్యవసాయం, ఐటీ, తయారీ రంగాలను ఒత్తిడి గురి చేయనున్నాయి. మామిడి, మసాలాలు,

బియ్యం తదితర వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు తగ్గిపోనున్నాయి. దీంతో ఈ రంగంలోని రైతులు స్థానిక మార్కెట్లపై లేదా ఇతర దేశాల మార్కెట్లపై ఎక్కువగా ఆధారపడవలసి వస్తుంది. ఎగుమతి ఆదాయం తగ్గడం వల్ల రాష్ట్రంలో వ్యవసాయ, అక్వా రంగంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి మందగించనుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# అధిక సుంకాలతో జీడీపీ తగ్గొచ్చు




అమెరికా విధిస్తున్న అధిక సుంకాలు భారత జీడీపీని దెబ్బతీయనున్నాయని విత్త సంస్థ బార్క్‌లెస్ విశ్లేషించింది. భారత వస్తువులపై 25 శాతం సుంకాలు సహా రష్యన్ దిగుమతులపై అదనపు జరిమానా విధిస్తున్నట్టు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పరిణామం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీని 30 బేసిస్ పాయింట్లు (0.3 శాతం) తగ్గించనుందని అంచనా వేసింది. అమెరికాతో వాణిజ్య చర్చలు కొనసాగుతున్నందున.. తుది సుంకాలు 25 శాతం కంటే తక్కువగా ఉండవచ్చని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి 6.5 శాతంగా ఉండొచ్చని ఆర్‌బిఐ, ఐఎంఎఫ్ 6.4 శాతంగా, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ 6.5 శాతంగా అంచనా వేశాయి. అమెరికా అధిక సుంకాలతో భారత్‌కు చెందిన ఫార్మాస్యూటికల్స్, రత్నాలు, వస్త్రాలు వంటి రంగాలు సుంకాల ప్రభావాన్ని ఎదుర్కొనే అవకాశం ఉంది. వ్యవసాయం , డెయిరీ రంగాలలో మార్కెట్ యాక్సెస్ విషయంలో భారతదేశం గతంలో జాగ్రత్తగా వ్యవహరించిందని మూడీస్ అనలిటిక్స్ అసోసియేట్ ఎకనమిస్ట్ అదితి రామన్ పేర్కొన్నారు.

# బాహుబలి కారు

## ధర తెలిస్తే బిత్తరపోతారు?



కారు కొనుగోలు చేయాలనుకుంటున్నారా.? అయితే మీకోసం ఇది.. ఈ కారు రూ. 3 లక్షలు తక్కువగా దొరుకుతోంది. జూలై నెలలో పలు ప్రముఖ కార్ల తయారీ సంస్థలు ప్రీమియం, SUV కార్లపై డిస్కౌంట్లను అందిస్తోన్న సంగతి తెలిసిందే.

అందులో ఒకటి వోక్స్‌వ్యాగన్ టిగువాన్ R లైన్.. ఈ SUV కారు ప్రస్తుతం రూ. 3 లక్షల భారీ తగ్గింపునకు దొరుకుతోంది. సరిగ్గా 90 రోజుల క్రితం మార్కెట్‌లోకి వచ్చిన ఈ కారు.. ఆ సమయంలో రూ. 49 లక్షలు(ఎక్స్-షోరూమ్) పలికింది. ఈ ప్రీమియం ఆల్-వీల్ డ్రైవ్ SUV ఇప్పుడు ప్రత్యేకమైన డిస్కౌంట్లతో రూ. 46 లక్షలకే కస్టమర్లకు అందుబాటులోకి వచ్చింది. ఈ ప్రయోజనాలను నగదు, ఎక్స్ఛేంజ్ బోనస్, కార్పొరేట్ డిస్కౌంట్ రూపంలో పొందవచ్చు. వోక్స్‌వ్యాగన్ టిగువాన్ ఆర్ లైన్ 2.0-లీటర్ టర్బోచార్జ్డ్ పెట్రోల్ ఇంజిన్‌తో పనిచేస్తుంది. ఈ ఇంజిన్ 204 బిహెచ్‌పి, 320 ఎన్ఎమ్ టార్క్ ఉత్పత్తి చేస్తుంది. 7-స్పీడ్ డ్యూయల్-క్లచ్ ఆటోమేటిక్ గేర్‌బాక్స్ ద్వారా 4 చక్రాలకు శక్తిని అందిస్తుంది. ఈ ఆల్-వీల్ డ్రైవ్ SUV 7.1 సెకన్లలో 0 నుంచి 100 కిమీ వేగాన్ని అందుకుంటుంది. అలాగే గరిష్టంగా 229 కిమీ వేగాన్ని కలిగి ఉంటుంది. టిగువాన్ ఆర్ లైన్ పెట్రోల్ వేరియంట్ కారు కాగా.. ఇది లీటర్‌కు 12.58 కిమీ మైలేజ్ అందిస్తుంది. అలాగే దీని పెట్రోల్ ట్యాంక్ క్యాపసిటీ 60 లీటర్లుగా ఉంది.

# జాతీయం - అంతర్జాతీయం

## ప్రజ్ఞా సింగ్ ఠాకూర్ నిర్దోషి



ముంబై: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2008 నాటి మాలెగావ్ పే లుళ్ల కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న బిజెపి మాజీ ఎంపి ప్రజ్ఞాసింగ్ ఠాకూర్, లెఫ్టినెంట్ కల్నల్ ప్రసాద్ పు రోహిత్ సహా మొత్త ఏడుగురు నిందితులనునిర్దోషులుగా ప్రకటిస్తూ ముం బయి ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు గురువా రం తీర్పు ఇచ్చింది. ందితులకు వ్యతిరేకంగా ఎలాంటి నమ్మదగ్గ, బలమైన సాక్ష్యాధారాలు లేవంటూ కోర్టు వారి ని నిర్దోషులుగా ప్రకటించింది. ఉ గ్ర వాదానికి మతం లేదని, ఏ మతం కూ డా హింసను ప్రోత్సహించదని కోర్టు అంటూ, కేవలం ఊహాగానాలు, నైతి క ఆధారాల ఆధారంగా శిక్షించలేమ ని కోర్టు పేర్కొంది. ఈ కేసు దర్యాప్తు, ప్రాసిక్యూషన్ వాదనలో చాలా లోటుపాట్లు ఉన్నాయని కోర్టు పేర్కొంది. 'ఈ కేసుకు ఉపా(చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక)చట్టం వర్తించదు. ఈ పేలుడుకు ఉపయోగించిన మో టార్ బైక్ ప్ర జ్ఞా ఠాకూర్ పేరుమీద రి జిస్టర్ అయిందని ప్రాసిక్యూషన్ చేసి న వాదనకు తగిన సాక్షాధారాలు లే వు. బైక్‌కు అమర్చిన బాంబు వల్లే పే లుడు జరిగిందని చెప్పేందుకు కూ డా ఆధారాలు లేవు. కేవలం ఊహాగానాలు, నైతిక ఆధారాలతో ఎవరినీ కోర్టులు శిక్షించవు. బెనిఫిట్ ఆఫ్ డౌట్ మినహా ఈ కేసులో ఎలాంటి బలమైన ఆధారాలు లేవు' తీర్పు ప్రకటించిన సందర్భంగా కోర్టు వ్యాఖ్యానించింది. ఈ కేసులో ఆరుగురు మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని న్యాయస్థానం ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే క్షతగాత్రులకు రూ.50 వేల ఆర్థిక సాయం అందించాలని కూడా పేర్కొంది. కాగా తీర్పుపై మాజీ ఎంపి ప్రజ్ఞా ఠాకూర్ హర్షం వ్యక్తం చేశారు. అయితే ఈ కేసు కారణంగాగత 17 ఏళ్ల పాటు తన జీవితం నాశనం అయిందని, తనను బాధపెట్టిన వారిని భగవంతుడే శిక్షిస్తారని అన్నారు. మరోవైపు తీర్పు పట్ల మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ హర్షం వ్యక్తం చేస్తూ,' ఉగ్రవాదం ఎప్పటికీ కాషాయం కాదని, భవిష్యత్తులో కూడా కాబోదని వ్యాఖ్యానించారు. మరోవైపు ఈ తీర్పును తాము హైకోర్టులో సవాలు చేయనున్నట్లు బాధిత కుటుంబాలు తెలిపాయి.

## గాజాలో కరువు రక్కసి బారిన చిన్నారులు !

గాజాలో గత 24గంటల్లో ఇజ్రాయిల్ దాడుల్లో 111మంది పాలస్తీనియన్లు మరణించారు. 820మందికిపైగా గాయపడ్డారు. వీరిలో 91మంది ఆహార పంపిణీ కేంద్రాల వద్ద జరిగిన దాడుల్లో మరణించిన వారేనని ఆరోగ్య మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. గురువారం ఆకలి దప్పులతో ఇద్దరు పిల్లలు మరణించారని వైద్య వర్గాలు తెలిపాయి. దీంతో ఇప్పటివరకు కరువు కాటకాలతో మరణించిన వారి సంఖ్య 159కి చేరింది. వీరిలో 90మంది పిల్లలే వున్నారు. గాజాలో కొత్తగా జన్మిస్తున్న పిల్లలందరూ తక్కువ బరువుతో వుంటున్నారని, పోషకాహార లోపం వల్ల వారు సరిగా ఎదగడం లేదని ఆస్పత్రి వర్గాలు చెప్పాయి. ఇటువంటి ఆందోళనకర పరిస్థితుల్లో గాజాలోకి ప్రతిరోజూ వందలాదిగా ఆహార ట్రక్కులు రావాలని ఐక్యరాజ్యసమితి పాలస్తీనా శరణార్థుల సంస్థ (యూఎన్ఆర్‌డబ్ల్యూఏ) ప్రతినిధి అద్నన్ అబూ హస్నా పేర్కొన్నారు. కాల్పుల విరమణ జరిగితేనే గాజాలో మానవతా సంక్షోభం పరిష్కారమవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. గాజా ప్రజలకు ఆహారం అందాలంటే ఆహార ట్రక్కులు కూడా సురక్షితంగా చేరాలని, అందుకు ఇజ్రాయిల్ సహకరించాలని అన్నారు. గాజాకు అందే ఆహార సాయం ముందుగా ఐక్యరాజ్య సమితి గిడ్డంగులకు చేరితే, అక్కడ నుండి పంపిణీ కేంద్రాల వద్దకు చేరుతుందని అన్నారు. గాజాలో మంచినీటి శుద్ధి కేంద్రాలను నాశనం చేశారు. దీంతో తాగు నీరు కలుషితమై వ్యాధులు వ్యాపిస్తున్నాయి.



## భారతీయ చమురు కంపెనీలపై అమెరికా ఆంక్షలు

తన శత్రు దేశాలతో వ్యాపారం చేస్తున్న వారిని అమెరికా ముప్పుతిప్పలు పెడుతోంది. రష్యా నుంచి ఆయుధాలు, చమురును కొనుగోలు చేస్తోందన్న ఆరోపణతో భారత్‌పై అమెరికా పాతిక శాతం సుంకం విధించిన విషయం తెలిసిందే. అది చాలదన్నట్లు ఇరాన్ నుంచి పెట్రోలియం, పెట్రోకెమికల్ ఉత్పత్తులను దిగుమతి చేసుకొని మార్కెటింగ్ చేస్తున్నారన్న ఆరోపణపై ఆరు భారతీయ కంపెనీలపై తాజాగా ఆంక్షలు విధించింది. ఇరాన్ చమురుతో వ్యాపారం చేస్తున్న వివిధ దేశాలకు చెందిన 20 సంస్థలను అమెరికా విదేశాంగ శాఖ లక్ష్యంగా చేసుకుంది. వీటిలో ఆరు సంస్థలు మన దేశానికి చెందినవే. ఈ కంపెనీలు అనేక మిలియన్ డాలర్ల విలువ కలిగిన ఇరాన్ పెట్రోకెమికల్స్‌ను దిగుమతి చేసుకుంటున్నాయని అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది. 'చమురు విక్రయం ద్వారా ఇరాన్ పెద్ద మొత్తంలో నిధులు సమకూర్చుకుంటోంది. వాటితో మధ్యప్రాచ్యంలో ఘర్షణలు, అస్థిరతకు ఆజ్యం పోస్తోంది. తన ప్రజలతో పాటు ప్రపంచ దేశాలను అణచివేసేందుకు ఉగ్ర మూకలకు ఆర్థిక సాయం చేస్తోంది. ఈ నేపథ్యంలో టెహ్రాన్‌పై ఒత్తిడి తేవడానికి కఠిన చర్యలు చేపట్టాం. ఇరాన్ పెట్రోలియం, పెట్రోకెమికల్స్ ఉత్పత్తులతో వ్యాపారం చేస్తున్న వివిధ దేశాలకు చెందిన 20 కంపెనీలపై ఆంక్షలు విధిస్తున్నాం' అని విదేశాంగ శాఖ తెలియజేసింది.

## భారత్‌ది డెడ్ ఎకానమీ దానిని మరింత పతనానికి తీసుకెళ్తున్నారు

భారత్, రష్యాలవి డెడ్ ఎకానమీల ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యనించారు. ఇప్పటికే క్షీణించిన ఈ ఆర్థిక వ్యవస్థలను మరింత పతనానికి దిగజార్చుతున్నారని ఆరోపించారు. భారత దిగుమతులపై 25 సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించిన వి షయం తెలిసిందే. రష్యానుంచి భారీగా చమురును దిగుమతి చేసుకొంటూ ఉండడమే దీనికి కారణము కూడా ట్రంప్ ప్రకటించారు. తాజా గా ఆయన భారత్, రష్యాలనుద్దేశిస్తూ మరిన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో దీనికి సంబంధించి ఒక పోస్టు పెట్టారు. రష్యాతో భారత్ ఎ లాంటి వాణిజ్య సంబంధాలు పెట్టుకున్నా తనకు సంబంధం లేదన్నారు. అయితే ఆ దేశా లు వారి మృత ఆర్థిక వ్యవస్థలను మరింత పతనానికి తీసుకు వెళ్తున్నాయని వ్యాఖ్యానించా రు. అంతేకాదు తాము భారత్‌తో చాలా తక్కు వ వ్యాపారం చేస్తున్నామన్నారు. ఎందుకంటే భారత్ అత్యధికంగా సుంకాలు విధిస్తోందని ఆరోపించారు. అమెరికా, రష్యాలు ఎలాంటి వ్యాపారం చేయడం లేదని కూడా ఈ సందర్భంగా ట్రంప్ స్పష్టం చేశారు. రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రీ మెద్వెదేవ్‌పై కూడా ట్రంప్ మండిపడ్డారు. తమతో అమెరికా గేమ్ ఆడుతోందని, అది యుద్ధానికి దారి తీయవచ్చని మెద్వెదేవ్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ఆయన ఇప్పటికీ అధ్యక్షుడినేనని అనుకొంటున్నారని మండిపడ్డారు. కాగాపాకిస్థాన్‌తో వాణిజ్య ఒప్పందం కుదిరినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. పాకిస్థాన్‌లో భారీ ఎత్తున చమురు నిక్షేపాలు ఉన్నాయని, వాటిని అభివృద్ధి చేయడానికి రెండుదేశాలు కలిసి పని చేస్తాయని అన్నారు.

ఈ సందర్భంగా ట్రంప్ భారత్‌కు పాకిస్థాన్ చమురును విక్రయించవచ్చని వ్యాఖ్యానించవచ్చంటూ ఆసకితకరమైన వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అయితే పాకిస్థాన్‌లో ఉన్న భారీ చమురు నిక్షేపాలు ఏమిటో మాత్రం ట్రంప్ చెప్పకపోవడం గమనార్హం. ట్రేడ్‌డీల్ గురించి ట్రంప్ ట్రూత్ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. అమెరికా, పాకిస్థాన్‌ల మధ్య ఒక వాణిజ్య ఒప్పందం కుదిరిందని వెల్లడించారు. 'ఈ ఒప్పందంలో భాగంగా ఇరు దేశాలు చమురు నిల్వలను పెంచుకోవడంలో కలిసి పనిచేస్తాయి. అందుకోసం ఓ మంచి చమురు కంపెనీని ఎంచుకునే ప్రక్రియలో ఉన్నాం.

## అంగోలాలో ఉద్రిక్తత..22 మంది మృతి

అంగోలాలో ఇంధన ధరల పెరుగుదలను వ్యతిరేకంగా ప్రజలు చేపట్టిన నిరసనలు హింసాత్మకంగా మారాయి. ఈ నిరసనల్లో కనీసం 22 మంది మృతి చెందారని, 197 మందికి గాయాలయ్యాయని అంగోలా ప్రభుత్వం ధృవీకరించింది. ఆ దేశ రాజధాని లువాండాతోపాటు మరో ఆరు ప్రావిన్స్‌లలో ప్రజలు పెద్దఎత్తున ఆయిల్ ధరలకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టారు. మరణించిన వారిలో ఓ పోలీసు అధికారి కూడా ఉన్నారని ప్రభుత్వం తెలిపింది. అంగోలా ప్రభుత్వం ఇంధన సబ్సిడీలను దశలవారీగా తొలగించే ప్రయత్నానికి పూనుకుంది. దీంతో ఆయిల్ ధరలు విపరీతంగా పెరగనున్నాయి. మూడింట ఒకవంతు లీటర్‌కు 300 - 400 క్వాన్జాన్‌లకు పెంచాలని ప్రభుత్వం



నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం ఇంధన సబ్సిడీలు ఎత్తివేయడంతో.. ఛార్జీలు 50 శాతం మేర పెరగనున్నాయి.

ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా టాక్సీ, మినీబస్ అసోసియేషన్స్ మూడురోజుల సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈ పిలుపు మేరకు ప్రజలు పెద్ద ఎత్తున నిరనల్లో పాల్గొన్నారు. నిరసనల్లో పాల్గొన్నవారిలో 22 మంది మృతి చెందారని అంతర్గత మంత్రి మాన్యుయెల్ హోమెమ్ ప్రకటించారు. అల్లర్లు, దోపిడీలు, భద్రతా దళాలపై దాడులకు పాల్పడినందుకు 1,214 మందిని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. కాగా, బుధవారం జరిగిన నిరసనల్లో దుకాణాలు, బ్యాంకులు, బస్సులు, ప్రయివేటు వాహనాలు ధ్వంసమయ్యాయి. అంగోలా అశాంతి నెలకొంది.

మరోవైపు అంగోలాను తీవ్ర ఆర్థిక సంక్షోభం వెంటాడుతుంది. ఆఫ్రికాలో రెండవ అతిపెద్ద చమురు ఉత్పత్తిదారుగా అంగోలా ఉంది. అయినప్పటికీ ఆ దేశానికి ఆర్థిక కష్టాలున్నాయి. దాదాపు సగం జనాభా రోజుకు 3.61 డాలర్లకంటే తక్కువ ఆదాయంతో జీవిస్తున్నారు. అదీగాక ఐఎంఎఫ్ అంగోలాకిచ్చే సబ్సిడీలను తొలగించింది. దీంతో 2023 నుంచి ఆ దేశంలో అశాంతి నెలకొంది. ఆర్థిక సంక్షోభాన్ని, యువత నిరుద్యోగాన్ని, పర్యావరణ సమస్యల్ని పరిష్కరించడంలో ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని సామాజిక కార్యకర్తలు అంగోలా ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు.

## ధర్మస్థళలో సామూహిక ఖననాలు

కర్ణాటకలోని పుణ్యక్షేత్రమైన ధర్మస్థళ లో జరుగుతున్న సామూహిక ఖనన దర్యాప్తులో కీలక పురోగతి సాధ్యమైంది. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ ఆధ్వర్యంలో జరుగుతున్న దర్యాప్తులో భాగంగా సైట్ నెంబర్ 6 వద్ద జరిపిన తవ్వకాలలో అస్థిపంజరం అవశేషాలను కొనుగొన్నారు. ఆ అస్థి పంజర అవశేషాలు చాలా వరకూ పురుషుడివి అయి ఉండవచ్చునని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఈ కేసులో ఆధారాలు లభించిన మొదటి ప్రదేశం ఇదే. జూలై 3న ధర్మస్థళ పోలీసు స్టేషన్ లో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో దేశం ఉలిక్కిపడింది. 1998 - 2014 మధ్య ధర్మస్థళ పట్టణంలో మహిళలు, మైనర్ల మృతదేహాలను బలవంతంగా ఖననం చేశారని, వారిలో చాలా మంది లైంగిక వేధింపులకు గురైనట్లు ఆరోపణలు ఉన్నాయని మాజీ పారిశుధ్య కార్మికుడైన ఆ వ్యక్తి పోలీసులకు తెలుపడంతో ప్రభుత్వ యంత్రాంగం సిట్‌ను ఏర్పాటు చేసి, దర్యాప్తు చేపట్టింది. బృందం ఆధ్వర్యంలో ఖననం చేశారని భావిస్తున్న ప్రదేశాలలో తవ్వకాలు చేపట్టారు. మొత్తం మీద ఆరో నెంబర్ సైట్ వద్ద తవ్వకాలలో అస్థిపంజరం అవశేషాలు బయటపడ్డాయి. సంఘటనా స్థలంలో ఉన్న ఫోరెన్సిక్ బృందం తదుపరి పరీక్ష కేసం అవశేషాలను భద్రపరచింది. మరిన్ని వివరాలను సేకరించేందుకు డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. చాలా కాలం అయినందువల్ల పర్యావరణ పరిస్థితుల కారణంగా ఎముకలు చెల్లాచెదురయ్యే అవకాశం ఉండడంతో తవ్వకం కార్యకలాపాలలో మరికొంత జాప్యం జరగవచ్చు. ఆ ప్రదేశంలో రెండు మృతదేహాలను ఖననం చేశానని ఆ పారిశుధ్య కార్మికుడు పేర్కొన్నాడు. ఆస్థి పంజర అవశేషాలు బాగా కుళ్లిపోయిన స్థితిలో ఉన్నాయని, ఆధారాల సేకరణ ప్రయత్నాలు చేస్తున్నారని పోలీసు వర్గాలు తెలిపాయి. ఈ కేసులో గుర్తించిన ఐదు ప్రదేశాలలో మానవ అవశేషాలకు సంబంధించిన ఆధారాలు ఏవీ లభించలేదు. నేత్రావతి నది వెంబడి ఉన్న ప్రదేశాలలో మొదటి దానిని పారిశుధ్యకార్మికుడి సమక్షంలో తవ్వకాలు జరిగాయి. నీటి ఉప్పెన ఎదురుకావడంతో అధికారులు, ఫోరెన్సిక్ నిపుణులు, రెవిన్యూ సిబ్బంది జేసీబీ యంత్రాంగాన్ని ఉపయోగించి లోతుగా తవ్వినా, ఆ ప్రదేశంలో ఎటువంటి అవశేషాలు లభించలేదు.

# దద్దరిల్లిన పార్లమెంట్

## అమెరికా సుంకాలు, బీహార్‌లో ఎస్ఐఆర్‌పైనే చర్చ

న్యూఢిల్లీ: అమెరికా సుంకాలు, బీహార్‌లో ఎస్ఐఆర్‌పై పార్లమెంట్ దద్దరిల్లింది. సభ లోపల, వెలుపల ప్రతిపక్షాలు ఆందోళనతో హోరెత్తించాయి. ఇండియాపై 25 శాతం సుంకాల విధిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటనపై ప్రధాని మోడీ సమాధానం చెప్పాలని, బీహార్ ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ (ఎస్ఐఆర్)పై చర్చించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టాయి. దీంతో పార్లమెంట్ ఉభయ సభల్లో వాయిదాల పర్వం కొనసాగింది. ప్రతిపక్షాల ఆందోళన మధ్యే కేంద్ర వాణిజ్య శాఖమంత్రి పియూష్ గోయల్ పార్లమెంట్‌లో ట్రంప్ సుంకాలపై ప్రకటన చేశారు. దీనిపై అధ్యయనం చేస్తున్నామని వెల్లడించారు. గురువారం లోక్‌సభను స్పీకర్ ఓం బిర్లా ప్రారంభిస్తూ ప్రశ్నోత్తరాలు నిర్వహించేందుకు ప్రయత్నించారు. ప్రతిపక్ష సభ్యులు ప్లకార్డులు చేబూని వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టారు. బీహార్‌లో ఎస్ఐఆర్‌ను వెనక్కి



తీసుకోవాలని నినాదాలతో హోరెత్తించారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఆరు నిమిషాల్లోనే మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో అదే పరిస్థితి కొనసాగడంతో సభ ఆరు నిమిషాల్లోనే సాయంత్రం 4 గంటలకు వాయిదా పడింది. మళ్లీ ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన మధ్యనే అమెరికా విధించిన సుంకాలపై కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ ప్రకటన చేశారు. అనంతరం తొమ్మిది నిమిషాల్లోనే సభ శుక్రవారానికి వాయిదా పడింది. ఇటు రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. రాజ్యసభను డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ ప్రారంభించారు.

జీరో అవర్‌ను కొనసాగించేందుకు ప్రయత్నించగా ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టారు. ప్రతిపక్షాల నినాదాలతో సభ హోరెత్తింది. దీంతో సభ మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో ఇదే పరిస్థితి కొనసాగడంతో కొన్ని నిమిషాల్లోనే సభ మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడింది. అనంతరం ప్రారంభమైన సభలో ప్యానల్ డిప్యూటీ చైర్మన్‌గా సస్మిత్ పాత్ర వ్యవహరించారు. ప్రతిపక్షాల ఆందోళనతో సభ ఆరు నిమిషాల్లోనే సాయంత్రం 4.30 గంటలకు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభను డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ నిర్వహించారు. అమెరికా విధించిన సుంకాలపై కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ ప్రకటన చేశారు. అనంతరం సభ శుక్రవారానికి వాయిదా పడింది.

## బిహార్ లో 60 లక్షల మంది ఓటర్లను తొలగించారు





న్యూఢిల్లీ: పార్లమెంట్ ఆవరణలో ఇండియా కూటమి ఎంపిలు నిరసన తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కు వ్యతిరేకంగా విపక్షాల ఆందోళన చేపట్టాయి. బీహార్‌లో ఓటర్ల సవరణ జాబితాలో అవకతవకలు జరుగుతున్నాయని విపక్షాలు ఆరోపణ చేశాయి. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై పార్లమెంట్ ఉభయసభల్లో చర్చ చేపట్టాలని ఇండియా కూటమి పార్టీల ఎంపిలు వాయిదా తీర్మానానికి నోటీసులు ఇచ్చాయి. బిహార్ అసెంబ్లీ ఎన్నికల ముందు ఓటర్ల సవరణతో 60 లక్షల మంది ఓటర్లను తొలగించారని సమాజవాదీ పార్టీ ఎంపి డింపుల్ యాదవ్ ఆరోపణలు చేశారు.

బిహార్ ప్రభుత్వం స్వేచ్ఛాయుతమైన, నిష్పాక్షితమైన ఎన్నికలను కోరుకోవడం లేదని మండిపడ్డారు. ఓటర్ల సవరణ ఎవరి గురించో అర్థం కావడం లేదని రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ ను ఆమె ప్రశ్నించారు. మాలేగావ్ పేలుడు కేసు తీర్పుపై డింపుల్ యాదవ్ స్పందించారు. ఆధారాలు లేకపోవడంతోనే నిందితులను నిర్దోషులుగా విడుదల చేస్తున్నట్లు కోర్టు పేర్కొందని, ఈ కేసు విషయంలో అనుమానం అలాగే ఉందన్నారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా పడిన రాజ్య సభ సమావేశాలు తిరిగి ప్రారంభమయ్యాయి. బీహార్ ఓటర్ల సవరణ జాబితాలో అవకతవకలపై చర్చ జరపాలని విపక్షాలు డిమాండ్ చేయడంతో లోక్ సభను స్పీకర్ 2 గంటలకు వాయిదా వేశారు.

## నిర్జీవస్థితిలో దేశ ఆర్థిక వ్యవస్థ

### లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ : భారతదేశ ఆర్థిక వ్యవస్థ నిర్జీవ స్థితిలో ఉందని ప్రధాని మోడీ, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మినహా అందరికీ తెలుసునని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. దేశ ఆర్థిక వ్యవస్థను బీజేపీ నాశనం చేసిందని ధ్వజమెత్తారు. భారత ఆర్థిక వ్యవస్థపై ట్రంప్ విమర్శ గురించి గురువారం పార్లమెంట్ ఎదుట మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా స్పందించారు. అవును, ట్రంప్ చెప్పింది వాస్తవమేనని, ప్రధాని, ఆర్థిక మంత్రికి తప్ప అందరికీ ఈవిషయం తెలుసునని అన్నారు. ట్రంప్ వాస్తవాన్ని వెల్లడించినందుకు సంతోషిస్తున్నానని తెలిపారు. ఇందులో ఆశ్చర్యం లేదని, అదానీకి సహాయం అందించడం కోసం బీజేపీ ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిందని అన్నారు. అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటుందని, ఆ విషయాన్ని ట్రంప్ స్పష్టం చేస్తారని, ట్రంప్ చెప్పినట్టు ప్రధాని మోడీ చేస్తారని అన్నారు. భారతదేశ దిగుమతులపై 25శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించిన తర్వాత, భారత్, రష్యాల ఆర్థిక వ్యవస్థలు నిర్జీవమైనవని అమెరికా అధ్యక్షులు ప్రకటించిన సంగతి తెలిసిందే.

# చక్కని ఆరోగ్యం

## తిన్న వెంటనే స్నానం ఎందుకు చేయకూడదు?



భోజనం చేసిన వెంటనే స్నానం చేయడం అనేది చాలా మందిలో కనిపించే సాధారణ అలవాటు. అయితే ఇది జీర్ణక్రియను నెమ్మదింపజేసి అనారోగ్యానికి దారితీయవచ్చు. శాస్త్రీయంగా దీనికి ఉన్న కారణాలు, నిపుణుల సూచనలు, పాటించాల్సిన జాగ్రత్తల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. ఆరోగ్యంగా ఉండాలంటే ఈ అలవాటు మార్చాల్సిందే. మనకు చాలా మామూలుగా ఉండే అలవాట్లలో తిన్న వెంటనే స్నానం చేయడం ఒకటి. ఉదయాన్నే లేచి అలసటగా ఉంటే.. చాలా మంది ముందుగా టిఫిన్ చేసేసి తర్వాత స్నానానికి వెళ్తారు. కానీ ఈ అలవాటు వల్ల మన శరీరానికి కొన్ని సమస్యలు వచ్చే అవకాశం ఉంది. నిపుణులు చెబుతున్నదాని ప్రకారం.. తిన్న తర్వాత జీర్ణక్రియ జరిగే సమయంలో శరీరాన్ని ప్రశాంతంగా ఉంచడం చాలా ముఖ్యం. ఈ సమయంలో స్నానం చేస్తే జీర్ణక్రియకు అడ్డు వస్తుందని చెబుతున్నారు. తినగానే స్నానం చేయడం వల్ల జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. మనం తిన్న వెంటనే.. ఆహారం జీర్ణం కావడానికి మన శరీరం పొట్ట వైపు ఎక్కువ రక్తాన్ని పంపిస్తుంది. అదే సమయంలో స్నానం చేస్తే.. శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది. దాంతో ఆ రక్తం జీర్ణక్రియకు కాకుండా చర్మానికి ప్రసరిస్తుంది. ఈ మార్పు వల్ల జీర్ణశక్తి తగ్గిపోయి అజీర్ణం, గ్యాస్, మలబద్ధకం లాంటి సమస్యలు వస్తాయి. నిపుణుల సలహా ప్రకారం.. భోజనం చేసిన వెంటనే కాకుండా కనీసం 90 నుంచి 120 నిమిషాల వరకు ఆగి తర్వాతే స్నానం చేయడం మంచిది. లేదంటే భోజనానికి ముందే స్నానం చేయడం ఆరోగ్యానికి ఉత్తమం. ముఖ్యంగా జీర్ణక్రియ బలహీనంగా ఉన్నవారు. మలబద్ధకం లేదా అజీర్ణం సమస్యలు ఉన్నవారు ఈ నియమాన్ని తప్పకుండా పాటించాలి. సబ్బుల వాడకం.. కొంతమంది ఎక్కువ నురుగు వచ్చే సబ్బులను వాడుతుంటారు. అలాంటి సబ్బులలో ఉండే రసాయనాలు, సువాసనలు చర్మాన్ని పొడిగా మార్చవచ్చు. దీని వల్ల చర్మం తేమ కోల్పోయి, చర్మ సమస్యలు వస్తాయి. సహజ సబ్బులు.. సున్నితమైన చర్మం ఉన్నవారు (ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు) సహజ పదార్థాలతో తయారైన సబ్బులను వాడటం మంచిది. ఇది చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. రోజువారీ అలవాట్లలో మనం చేసే ఈ చిన్న పొరపాట్లే చాలా ఆరోగ్య సమస్యలకు కారణం అవుతాయి. మనం ఈ శాస్త్రీయ కారణాలను తెలుసుకుని మన జీవనశైలిని మార్చుకుంటే.. ఆరోగ్యంగా ఉండవచ్చు. ఈ నియమాన్ని పాటిస్తే మీ జీర్ణక్రియ కూడా మెరుగుపడుతుంది.

## జామ వర్సెస్ అవాకాడో? ఆరోగ్యానికి ఏది మంచిది..?



ఆరోగ్యానికి పండ్లు అత్యంత అవసరం. జామ, అవాకాడో రెండింటికీ ప్రత్యేకమైన పోషక విలువలు ఉన్నాయి. అయితే మీకు ఏ పండు మరింత అనుకూలమో తెలుసుకోవడం ముఖ్యమే. మన రోజువారీ ఆహారంలో పండ్లకు ప్రత్యేక స్థానం ఉంది. ఆపిల్ నుంచి అవాకాడో వరకు ప్రతి పండు శరీరానికి విలువైన పోషకాలను అందిస్తుంది. వీటిని మామూలుగా తినడమే కాకుండా.. షేక్స్, జ్యూస్ లు, సలాడ్‌లు, స్మూతీల రూపంలో కూడా తీసుకోవచ్చు. జామ, అవాకాడో ఈ రెండింటిలో ఏది మీ ఆరోగ్యానికి ఎక్కువ మంచిది..? ఈబలమైన రోగనిరోధక శక్తి.. దీనిలో విటమిన్ %జ% చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది మీ ఇమ్యూనిటీని బాగా పెంచుతుంది.యాంటీఆక్సిడెంట్లు.. శరీరంలో ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే డ్యామేజ్‌ను నివారించే యాంటీఆక్సిడెంట్లు జామలో పుష్కలంగా ఉంటాయి.బరువు తగ్గడానికి సహాయం.. తక్కువ కేలరీలు, ఎక్కువ ఫైబర్ ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఒక మంచి పండు.రక్తపోటు అదుపు.. పొటాషియం ఎక్కువగా ఉండటం వల్ల రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది.మధుమేహానికి బెస్ట్.. దీనికి తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంది కాబట్టి షుగర్ ఉన్నవారు కూడా నిరభ్యంతరంగా తినవచ్చు. జామను ముక్కలుగా కట్ చేసి కొంచెం ఉప్పు, కారం చల్లి తినవచ్చు. జామ పేస్ట్, జ్యూస్, లేదా చట్నీగా కూడా తయారు చేసుకోవచ్చు. గుండెకు మేలు.. ఇందులో ఉండే మోనో అన్‌సాచురేటెడ్ కొవ్వులు గుండె ఆరోగ్యానికి చాలా మంచివి.చర్మం, కళ్లకు రక్షణ.. విటమిన్ జు, ఫోలేట్, యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని మెరిపిస్తాయి. అలాగే లూటీన్, జియాక్సంతిన్ కంటి చూపును కాపాడతాయి.మెరుగైన జీర్ణక్రియ.. ఎక్కువ ఫైబర్ ఉండటం వల్ల జీర్ణక్రియ సజావుగా సాగుతుంది, మలబద్ధకాన్ని తగ్గిస్తుంది.మెదడుకు పోషణ.. ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్ జు మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. అవాకాడోను మెత్తగా చేసి టోస్ట్‌పై స్ప్రెడ్‌గా తినడం ఒక ట్రెండీ మార్గం. దీన్ని సలాడ్ లలో, స్మూతీ లలో కలిపి లేదా గ్వాకామోల్‌గా తయారు చేసి శాండ్‌విచ్‌లలో ఉపయోగించవచ్చు. ఈ రెండు పండ్లూ వేర్వేరు రకాల ఆరోగ్య లాభాలను అందిస్తాయి. ఏది మంచిదనేది మీ వ్యక్తిగత ఆరోగ్య అవసరాలపై ఆధారపడి ఉంటుంది.జామ.. ఇమ్యూనిటీ పెంచుకోవాలనుకునేవారు, బరువు తగ్గాలనుకునేవారు, షుగర్ ఉన్నవారు జామను ఎంచుకోవచ్చు. దీనిలో తక్కువ కేలరీలు, ఎక్కువ విటమిన్ జ ఉంటాయి. అవాకాడో.. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచాలనుకునేవారు, చర్మం, మెదడుకు పోషణ కావాలనుకునేవారు అవాకాడోను తీసుకోవచ్చు. దీనిలో ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్ ఎక్కువగా ఉంటాయి. పోషక నిపుణుల అభిప్రాయం ప్రకారం.. రెండింటినీ సమతుల్యంగా మీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా పూర్తి ఆరోగ్య లాభాలను పొందవచ్చు. ఒక పండును వదిలేసి మరొకటి మాత్రమే తీసుకోవడం కన్నా.. రెండింటినీ బ్యాలెన్స్ చేసుకుని తినడం ఉత్తమం.

## ఆకలి వేసినప్పుడు బిస్కెట్లు తినకండి..!



చిన్న గా ఆకలి వేయగానే ఎక్కువగా బిస్కెట్లు తినే అలవాటు చాలా మందిలో ఉంటుంది. కానీ అవి ఆరోగ్యానికి మేలు చేయవు. బదులుగా మన ఇంట్లో సులభంగా తయారు చేసుకునే తక్కువ కేలరీలతో ఉండే.. శక్తినిచ్చే ఆరోగ్యకరమైన స్నాక్స్ ఎన్నో ఉన్నాయి. కొద్దిగా ఆకలి వేయగానే వెంటనే బిస్కెట్ల కోసం మన చేతులు వెళ్తుంటాయి. అయితే బిస్కెట్లు ఆరోగ్యకరమైనవిగా కనిపించినా.. అవి ఎక్కువగా శుద్ధి చేసిన పిండి, ఎక్కువ చక్కెర, పామాయిల్‌తో తయారు చేస్తారు. ఇవి శరీరానికి మంచివి కాకపోవచ్చు. పైగా కొవ్వు పెరిగే ప్రమాదం ఉంటుంది. కాబట్టి అలాంటి సమయంలో బిస్కెట్లకు బదులుగా మన ఇంట్లోనే తక్కువ కేలరీలతో ఆరోగ్యానికి మేలు చేసే చిరుతిండ్లను ప్రయత్నించండి. కొన్ని శెనగలు తీసుకొని ఉప్పు వేసి బాగా ఉడకబెట్టండి. తర్వాత వాటిని ఒక గిన్నెలో వేసి దానికి తరిగిన ఉల్లిపాయ, కొత్తిమీర, కొద్దిగా నిమ్మరసం కలపండి. మీకు ఇష్టమైతే చాట్ మసాలా చల్లవచ్చు. ఇది తక్కువ కేలరీలతో ఉండే చిరుతిండి మాత్రమే కాదు.. ఫైబర్, ప్రోటీన్ ఎక్కువగా అందిస్తుంది. ఇది సుమారు 80 నుంచి 90 కేలరీలలోపే ఉంటుంది. ఒక అర కప్పు పెరుగును తీసుకొని చల్లటి నీటితో కలపండి. ఆ మిశ్రమంలో జీలకర్ర పొడి, నల్ల ఉప్పు, తరిగిన పుదీనా, చిటికెడు ఇంగువ కలిపి బాగా కలపండి. ఈ మజ్జిగ ఆరోగ్యానికి మంచిది. దాహాన్ని తగ్గించడమే కాదు.. జీర్ణవ్యవస్థకు కూడా సహాయపడుతుంది. ఇది తక్కువగా అంటే 50 కేలరీలలోపే ఉంటుంది. మీ దగ్గర ఉన్న జామ, యాపిల్ లేదా బొప్పాయిని చిన్న ముక్కలుగా తరిగి గిన్నెలో వేసుకోండి. ఆపై చాట్ మసాలా చల్లి కొద్దిగా నిమ్మరసం పిండితే చాలు. ఇది మీకు సహజ తీపితో పాటు విటమిన్ సి, ఫైబర్ అందించే ఆరోగ్యకరమైన స్నాక్ అవుతుంది. ఇది సుమారు 60 నుంచి 70 కేలరీలలోపే ఉంటుంది. ముందు రోజు మిగిలిన ఇడ్లీలను చిన్న ముక్కలుగా కట్ చేసి అర టీస్పూన్ నూనె వేసిన పాన్ లో వేయించండి. ఆ తర్వాత ఆవాలు, కరివేపాకు వేసి చిటికెడు సాంబార్ పొడి కలిపితే అంచులు కొంచెం కరకరలాడతాయి. ఇది త్వరగా తయారయ్యే, రుచికరమైన, తక్కువ నూనెతో ఉండే అల్పాహారం. ఇది సుమారు 90 కేలరీలలోపే ఉంటుంది. బిస్కెట్లకు బదులుగా.. మఖానా, ఉడికించిన శెనగలు, మసాలా మజ్జిగ, చాట్ మసాలా పండ్లు, ఇడ్లీ ఫ్రై లాంటి స్నాక్స్ తీసుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఇవి కేవలం తక్కువ కేలరీలతో ఉండటమే కాదు.. శక్తినిస్తాయి, బరువు తగ్గడంలో సహాయపడతాయి.

## ఈ మార్పులు కనిపిస్తే అస్సలు నిర్లక్ష్యం చేయొద్దు..!



ప్రతి రోజూ జరిగే మల విసర్జన అలవాట్లను చాలా మంది పట్టించుకోరు. కానీ వాటిలో వచ్చే కొన్ని మార్పులు తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు సంకేతాలు కావచ్చు. ముఖ్యంగా క్యాన్సర్ వంటి సమస్యలు ప్రారంభదశలో ఇదే రూపంలో కనిపించవచ్చు. అలాంటి లక్షణాలను ఎలా గుర్తించాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం. మన శరీరంలో వచ్చే కొన్ని చిన్న గుర్తులను మనం తరచూ పట్టించుకోము. ముఖ్యంగా మల విసర్జన అలవాట్లలో చిన్న మార్పులను మామూలుగా తీసుకోవడం సహజమే. అయితే అలాంటి మార్పులు కొన్నిసార్లు తీవ్రమైన జబ్బులకు గుర్తు కావచ్చు. కొన్నిసార్లు ఇవి క్యాన్సర్ లాంటి ప్రమాదకర ఆరోగ్య సమస్యలు మొదలయ్యాయని చూపించవచ్చు. ఈ రకమైన ఆరోగ్య గుర్తులను ముందుగానే గుర్తించడం వల్ల సరైన సమయంలో పరీక్షలు, చికిత్సలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఇప్పుడు మల విసర్జన అలవాట్లలో కనిపించే కొన్ని ముఖ్యమైన లక్షణాల గురించి తెలుసుకుందాం. మీరు మూత్ర విసర్జన చేసేటప్పుడు లేదా మల విసర్జన చేసేటప్పుడు రక్తాన్ని చూస్తే.. వెంటనే జాగ్రత్తగా ఉండాలి. ఇది మూత్రాశయం, కిడ్నీలు లేదా పెద్దప్రేగుల సమస్యలకు గుర్తు కావచ్చు. ముఖ్యంగా ఇది పెద్దప్రేగు క్యాన్సర్ లేదా కిడ్నీ జబ్బుల సూచన కావచ్చు. మీరు రాత్రి సమయంలో చాలా సార్లు మల విసర్జన చేయాల్సి వస్తుందా..? ఇది వృద్ధులలో మామూలుగా కనిపించేదే అయినా.. ప్రోస్టేట్ లేదా మూత్రాశయ సంబంధిత క్యాన్సర్లకు కూడా ఇది గుర్తు కావచ్చు. ముఖ్యంగా పురుషులు ఈ లక్షణాన్ని గమనిస్తే.. వెంటనే డాక్టర్లను కలవడం అవసరం. మీ మలం ఆకారం పెన్సిల్ లాంటి సన్నని రూపంలో మారితే.. అది పేగులలో అడ్డుకుందని అనుకోవచ్చు. ఇది పెద్దప్రేగు క్యాన్సర్ లాంటి సమస్యలను సూచించే మొదట్లోని లక్షణం కావచ్చు. ఈ మార్పులు రోజూ ఉంటే తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. ఆహారంలో మార్పులు వచ్చినప్పుడు అప్పుడప్పుడు జీర్ణ సమస్యలు రావడం సహజమే. అయితే ఎక్కువ కాలంగా మలబద్ధకం లేదా విరేచనాలు ఉంటే వాటిని సీరియస్ గా తీసుకోవాలి. ఇది పెద్దప్రేగు లేదా ప్యాంక్రియాస్ క్యాన్సర్ కు సంబంధించి ఉండవచ్చు. ఈ లక్షణాలను పట్టించుకోకపోవడం ఆరోగ్యానికి ప్రమాదం కావచ్చు. మీరు మల విసర్జన సమయంలో నొప్పిని అనుభవిస్తున్నారా..? అది చిన్న ఇన్ఫెక్షన్ కాకపోవచ్చు. ఇది కిడ్నీలు, మూత్రనాళ సంబంధిత ఇన్ఫెక్షన్ లేదా క్యాన్సర్లకు గుర్తు కావచ్చు. అలాగే మల విసర్జన సమయంలో మళ్లీ మళ్లీ బాధగా అనిపించడం కూడా మలద్వారం దగ్గర క్యాన్సర్ సూచన కావచ్చు. మల విసర్జన అలవాట్లలో మార్పులతో పాటు బరువు వేగంగా తగ్గుతుంటే.. దీని వెనుక కొన్ని తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా పెద్దప్రేగు, ప్యాంక్రియాస్ లేదా పొట్ట క్యాన్సర్ లాంటి సమస్యలకు ఇది గుర్తు కావచ్చు.

## ఖర్జూరంలో ఆరోగ్య రహస్యాలు..!



ఖర్జూరాలను రాత్రి నానబెట్టి ఉదయం ఖాళీ కడుపుతో తినడం ద్వారా అనేక ఆరోగ్య లాభాలు పొందవచ్చు. ఎముకలు, గుండె ఆరోగ్యం నుంచి జీర్ణక్రియ, చర్మ కాంతి వరకు వాటి ప్రయోజనాలు అమోఘం. ఖర్జూరంలో విటమిన్లు, ఖనిజాలు (ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, జింక్), ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఖర్జూరాలను రాత్రిపూట నీటిలో నానబెట్టి ఉదయం ఖాళీ కడుపుతో తింటే అద్భుతమైన ఆరోగ్య లాభాలు కలుగుతాయి. బలంగా ఎముకలు.. నానబెట్టిన ఖర్జూరాల్లో మెగ్నీషియం, కాల్షియం, భాస్వరం వంటి పోషకాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి ఎముకలు బలంగా తయారవడానికి సహాయపడతాయి. ముఖ్యంగా వయసు పెరిగే కొద్దీ ఎముకలు బలహీనపడకుండా కాపాడతాయి. జీర్ణక్రియకు.. ఖర్జూరంలో ఉన్న ఫైబర్ పేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇది జీర్ణవ్యవస్థ సరిగా పనిచేసేలా చేసి మలబద్ధకం సమస్యను తగ్గిస్తుంది. శరీరానికి తక్షణ శక్తి.. ఖర్జూరాల్లో సహజంగా ఉండే గ్లూకోజ్, ఫ్రక్టోజ్ శరీరానికి వెంటనే శక్తిని ఇస్తాయి. ఉదయం ఖాళీ కడుపుతో వీటిని తింటే రోజు మొత్తం ఉత్సాహంగా ఉంటారు. రక్తహీనత.. ఖర్జూరంలో ఐరన్ ఎక్కువగా ఉంటుంది. ఇది శరీరంలో హీమోగ్లోబిన్ స్థాయిలను పెంచుతుంది. ముఖ్యంగా మహిళలు, పిల్లలలో ఎక్కువగా కనిపించే రక్తహీనతకు ఇది ఒక మంచి పరిష్కారం. గుండె ఆరోగ్యం.. పొటాషియం, మెగ్నీషియం లాంటి ఖనిజాలు రక్తపోటును అదుపులో ఉంచుతాయి. రోజూ నానబెట్టిన ఖర్జూరాలను తింటే గుండె జబ్బులు వచ్చే అవకాశాలు తగ్గుతాయి. మంచి నిద్ర.. ఖర్జూరాల్లో ఉండే విటమిన్ దీ6, మెగ్నీషియం మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. రాత్రిపూట పాలలో నానబెట్టిన ఖర్జూరాలను తింటే మంచి నిద్ర పడుతుంది. అధిక బరువు.. ఖర్జూరాల్లో ఉన్న ఫైబర్ ఆకలిని తగ్గిస్తుంది. తద్వారా ఎక్కువగా తినాలనే కోరిక తగ్గుతుంది. ఇది బరువును అదుపులో ఉంచుకోవడానికి సహాయపడుతుంది.

## ఆహారంలో లేకుంటే రోగాలు తప్పవంతే..



క్షీణిస్తున్న జీవనశైలితోపాటు తప్పుడు ఆహారపు అలవాట్ల మధ్య మీరు ఆరోగ్యంగా ఉండాలనుకుంటే కొన్ని సూపర్ ఫుడ్స్ మీ ఆహారంలో చేర్చుకోవాల్సిందే. ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండటానికి అతి ముఖ్యమైన విషయం సరైన ఆహారం. ప్రపంచంలోని అత్యంత ఆరోగ్యకరమైన ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. వీటిని మీరు మీ ఆహారంలో భాగం చేసుకోవచ్చు. ఇవి మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. అనేక వ్యాధుల నుంచి దూరంగా ఉంచుతాయి. ఆకు కూరలు.. మెంతులు, పాలకూర, ఆవాలు, ఉసిరికాయ వంటి క్రూసిఫెరస్, ఆకుకూరల్లో ఇనుము, కాల్షియం, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లతో సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరంలోని రక్త లోపాన్ని తీర్చగలవు. శరీరాన్ని నిర్విషీకరణ చేయడంలో సహాయపడతాయి. దీంతో పాటు, క్రూసిఫెరస్ కూరగాయల గురించి మాట్లాడితే, కాలీఫ్లవర్, బ్రోకలీ, క్యాబేజీ ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. వాటిలో విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. గింజలు, విత్తనాలు.. వాల్‌నట్స్, బాదం వంటి విత్తనాలతో పాటు చియా గింజలు, అవిసె గింజలు, పొద్దుతిరుగుడు విత్తనాలలో ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. జ్ఞాపకశక్తిని పదును పెట్టడంలో కూడా సహాయపడతాయి. పప్పులు, బీన్స్ గురించి మాట్లాడుకుంటే, ఇవి శాఖాహారులకు ప్రోటీన్‌కు మంచి మూలం. పప్పులు, మూంగ్, లోబియా, గ్రామ్, కిడ్నీ బీన్స్ వంటి పప్పులు, పప్పుధాన్యాలు ప్రోటీన్, ఫోలేట్, ఐరన్, ఫైబర్‌తో సమృద్ధిగా ఉంటాయి. వెల్లుల్లి, పెరుగు..వెల్లుల్లిలో అల్లిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది బీపీ, కొలెస్ట్రాల్, రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది సహజ యాంటీబయాటిక్. దీంతో పాటు, పెరుగు గురించి మాట్లాడుకుంటే, ఇందులో ప్రోటీన్, కాల్షియం పుష్కలంగా ఉంటాయి. పెరుగు జీర్ణక్రియకు సహాయపడే ప్రోబయోటిక్.



# సినిమా





## ఆ విషయంలో మేము పాస్ అయ్యాం : నాగవంశీ

'ఈమధ్య కాలంలో సినిమాలకు ఓపెనింగ్స్ రాబట్టడం పెద్ద ఛాలెంజ్ అయిపోయింది. ఆ పరంగా చూస్తే మేము(కింగ్‌డమ్) పాస్ అయ్యాం. బుకింగ్స్ బాగున్నాయి. మంచి వసూళ్లతో సినిమా ఘన విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాను'అన్నారు నిర్మాత సూర్యదేవర నాగవంశీ. విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ బోర్సే హీరోహీరోయిన్లుగా నటించిన తాజా చిత్రం 'కింగ్‌డమ్'. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సత్యదేవ్ కీలక పాత్ర పోషించాడు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం తాజాగా మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా నాగ వంశీ మాట్లాడుతూ.. 'ఇది పూర్తిస్థాయి యాక్షన్ చిత్రం కాదు. గౌతమ్ తిన్ననూరి శైలి ఎమోషన్స్ ఉంటాయి. అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చే అంశాలతో తెరకెక్కిన గ్యాంగ్ స్టర్ డ్రామా ఇది. ఈ సినిమా కోసం సెట్స్ వేయలేదు. ఎక్కువ భాగం రియల్ లొకేషన్స్ లో షూట్ చేశాం. మా టీమ్ పడిన కష్టం మీకు తెర మీద కనిపిస్తుంది." అన్నారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. 'జెర్సీ' సినిమా తీసిన గౌతమ్ తిన్ననూరి 'కింగ్‌డమ్' ఇది. ఈ చిత్రంలో భావోద్వేగాలు కట్టిపడేస్తాయి. చరిత్రలో ఏ యుద్ధం చూసుకున్నా.. కుటుంబం కోసమో, పుట్టిన నేల కోసమో, ప్రేమ కోసమో ఉంటుంది. ఈ యుద్ధం కూడా అలాంటిదే. కుటుంబ భావోద్వేగాల నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది. సినిమా మొదలైన రెండు నిమిషాలకే ప్రేక్షకులు 'కింగ్‌డమ్' ప్రపంచంలోకి వెళ్తారు. థియేటర్ కి వచ్చిన ప్రతి ఒక్కరికీ ఈ చిత్రం మంచి అనుభూతిని ఇస్తుంది." అన్నారు. 'విజయ్ లాంటి నటుడితో కలిసి నటించడం సంతోషంగా ఉంది. ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చుతుందని ఆశిస్తున్నాను' అని భాగ్యశ్రీ బోర్సే అన్నారు.

## సరికొత్త అందాలతో మెరిసిన ఖుషి కపూర్..



## హీరో, దర్శకుడు నన్ను ట్రై చేశారు..
### నిత్యా మీనన్ షాకింగ్ కామెంట్స్

మల్టీటాలెంటడ్ యాక్టర్స్‌లో నిత్యా మీనన్ ఒకరు. అలామొదలైంది సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన ఈ అమ్మడు ఆ తర్వాత చాలా సినిమాల్లో నటించి మెప్పించింది. ఈ మధ్య కాలంలో సినిమాల స్పీడ్ తగ్గించింది. స్లో అండ్ స్టడీగా సినిమాలు చేసుకుంటూ వెళుతుంది. 'అలా మొదలైంది' నుంచి 'భీమ్లా నాయక్' వరకూ విభిన్న పాత్రలతో ఆకట్టుకున్న ఈ ముద్దుగుమ్మ రీసెంట్‌గా తమిళ స్టార్ విజయ్ సేతుపతితో కలిసి సార్ మేడమ్ అనే చిత్రం చేసింది. ఈ మూవీ ప్రమోషన్స్‌లో పాల్గొంటూ ఆసక్తికర విషయాలు తెలియజేస్తుంది. నిత్యా మీనన్, విజయ్ సేతుపతి జంటగా నటించిన సార్ మేడమ్ చిత్రం తమిళంతో పాటు తెలుగులో కూడా విడుదల కాబోతోంది. పాండిరాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని టీజీ త్యాగరాజన్ సమర్పణలో, సత్య జ్యోతి ఫిల్మ్స్ బ్యానర్‌పై సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మించారు. ఆగస్టు 1న గ్రాండ్ రిలీజ్‌కి సిద్ధమవుతోంది. ఇప్పటికే ప్రమోషన్స్ జోరుగా జరుగుతున్నాయి. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో నిత్యా మీనన్ పాల్గొంది. ఈ సందర్భంగా పెళ్లిపై ఆమెకు ప్రశ్న ఎదురైంది. దానికి సమాధానంగా నన్ను విజయ్ సేతుపతి గారు, దర్శకుడు పాండిరాజ్ గారు చాలా ట్రై చేశారు" అని నవ్వుతూ చెప్పింది. అయితే ఇది కొంచెం డబుల్ మీనింగ్‌గా అనిపించడంతో వెంటనే విజయ్ సేతుపతి జోక్యం చేసుకొని.."సరిగ్గా చెప్పు.. వేరే అర్థాలు వస్తాయి!" అని అన్నారు. దీనిపై వెంటనే నిత్యా క్లారిటీ ఇచ్చింది. "అయ్యో, నేను అలా అనలేదు! పెళ్లి విషయంలో వాళ్లు నన్ను మోటివేట్ చేస్తూ ఉండేవాళ్లు అని చెప్పాలనుకున్నాను" అని వివరణ ఇచ్చింది. ఈ సంఘటనతో అక్కడున్నవారంతా తెగ నవ్వేశారు. ఇక ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది నిత్యా మీనన్ ఇప్పటివరకు తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో పలు హిట్ చిత్రాల్లో నటించి మంచి పేరు తెచ్చుకుంది. ఆమె 6 భాషల్లో మాట్లాడగలదనే టాక్ కూడా ఉంది. విజయ్ సేతుపతి, నిత్యా మీనన్ ఇద్దరికీ తెలుగు ప్రేక్షకుల్లో భారీ ఫాలోయింగ్ ఉంది. అందుకే 'సార్ మేడమ్' సినిమా తెలుగులో కూడా మంచి రెస్పాన్స్ పొందే అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది.



## విజయ్ దేవరకొండతో మరోసారి రష్మిక?

టాలీవుడ్ స్టార్ నటులు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా మరోసారి కలిసి నటించబోతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే వీరిద్దరి కాంబోలో వచ్చిన గీతా గోవిందం, డియర్ కామ్రేడ్ వచ్చి మంచి విజయాలు అందుకున్నాయి. దీంతో ఈ హిట్ జోడి మళ్లీ తెరపై రోమాన్స్ చేయబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. టాక్సీవాలా, శ్యామ్ సింగరాయ్ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు రాహుల్ సాంకృత్యాయన్ విజయ్ దేవరకొండతో సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. టాక్సీవాలా తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ సినిమా వస్తుండటంతో మంచి అంచనాలు ఉన్నాయి. వీడీ 14గా రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌ను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ నిర్మిస్తుండగా.. హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్‌లో రాయలసీమ నేపథ్యంలో ఈ చిత్రం రాబోతుంది. ఇప్పటికే పూజ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలోనే షూటింగ్ ప్రారంభించనుంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమాలో కథానాయికకు సంబంధించి ఒక వార్త వైరల్‌గా మారింది. ఈ మూవీలో కథానాయికగా మేకర్స్ రష్మిక మందన్నాని అనుకుంటున్నట్లు సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే ఫ్యాన్స్‌కి పండగనే చెప్పుకోవాలి. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. సినిమాల విషయానికి వస్తే.. కింగ్‌డమ్ సినిమాతో విజయ్ గురువారం ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈ చిత్రానికి గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్నాడు. రష్మిక విషయానికి వస్తే.. ప్రస్తుతం మైసా అనే చిత్రంలో నటిస్తుంది.



# ధోన్ - కాచిగూడ సెక్షన్‌ను తనిఖీ

## తనిఖీ చేసిన దక్షిణ మధ్య రైల్వే జనరల్ శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ





హైదరాబాద్,ఆగస్టు 01(ఉదయం పతినిధి): దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఈరోజు అనగా ఆగష్టు 01, 2025 హైదరాబాద్ డివిజన్‌లోని డోన్ - కర్నూలు - జోగులాంబ - గద్వాల్ - మహబూబ్‌నగర్ సెక్షన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీ సమయంలో ఆయనతో పాటు హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ శ్రీ లోకేష్ విష్ణోయ్ మరియు ప్రధాన కార్యాలయం & డివిజన్ నుండి ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు.శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ధోన్ - మహబూబ్ నగర్ సెక్షన్ లో రియర్ విండో తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో ట్రాక్‌లు, వంతెనలు మరియు సిగ్నలింగ్ వ్యవస్థల నిర్వహణకు సంబంధించిన భద్రతా అంశాలను ఆయన పరిశీలించారు. జనరల్ మేనేజర్ కర్నూలు సిటీ రైల్వే స్టేషన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని ప్రయాణీకుల సౌకర్యాలు, వసతులు మరియు సర్క్యులేటింగ్ ప్రాంతాన్ని ఆయన తనిఖీ చేశారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం (ఎ.బి.ఎస్.ఎస్.)లో భాగంగా కర్నూలు స్టేషన్‌లో చేపట్టిన పునరాభివృద్ధి పనుల పురోగతిని కూడా ఆయన పరిశీలించారు. జనరల్ మేనేజర్ కర్నూలులోని సి.ఎం.ఎల్.ఆర్. (కోచ్ మిడ్ లైఫ్ రిహాబిలిటేషన్) వర్క్‌షాప్ తనిఖీలో భాగంగా అక్కడ నిర్మాణానికి సంబందించి పాటిస్తున్న సురక్షితమైన పని పద్ధతులను సమీక్షించారు.తరువాత , జనరల్ మేనేజర్ జోగులాంబ రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేశారు. అక్కడ వెయిటింగ్ హాల్‌ను పరిశీలించారు మరియు స్టేషన్‌లోఉన్న సౌకర్యాలను సమీక్షించారు. జోగుళాంబ రైల్వే స్టేషన్ మరియు గద్వాల్ రైల్వే స్టేషన్‌లలో ఎ.బి.ఎస్.ఎస్లో భాగంగా చేపట్టిన పునరాభివృద్ధి పనులను కూడా ఆయన సమీక్షించారు. గద్వాల్ స్టేషన్ తనిఖీలో భాగంగా నిర్మాణ స్థలంలో సురక్షితమైన పని పద్ధతులను పరిశీలించారు.తరువాత, శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మహబూబ్ నగర్ రైల్వే స్టేషన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రయాణీకుల సౌకర్యాలు, వసతులను సమీక్షించారు మరియు సిబ్బందితో సంభాషించారు. ఎ.బి.ఎస్.ఎస్ లో భాగంగా మహబూబ్ నగర్ స్టేషన్‌లో చేపట్టిన పునరాభివృద్ధి పనుల పురోగతిని జనరల్ మేనేజర్ పరిశీలించారు. పని ప్రదేశంలో భద్రతా మార్గదర్శకాలను పాటించాలని మరియు ప్రాజెక్టును నిర్ధారించిన గడువు నాటికి పూర్తి చేయడానికి పనులవేగాన్ని మరింత వేగవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.తనిఖీ సమయంలో, ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు జనరల్ మేనేజర్‌ను కలిసి రైల్వే అభివృద్ధి ప్రణాళికలకు సంబంధించిన విజ్ఞాపనలను సమర్పించారు.

జనరల్ మేనేజర్ మీడియా సిబ్బందితో కూడా సంభాషించి వివిధ ప్రాజెక్టుల పురోగతిని వారికి వివరించారు.

# బయటపడుతున్న ధర్మస్థలి పాపాలు



**బెంగళూరు :** ఒక్కడు. ఎస్ ఒకే ఒక్కడు. పాపభీతితో నోరువిప్పాడు. ప్రాణభయంతోనే ఆ పనిచేశానంటున్నాడు. లెక్కలేనన్ని శవాలను అతనే పూడ్చేశాడు. అనాథశవాలు కాదు. రాబందుల్లాంటి మనుషులు రాక్షసంగా పీక్కుతిన్న శవాలు. స్కూలుకెళ్లే పిల్లలు, ఒంటరి మహిళలు, నోరెత్తలేని పేదలు.. ఇలా వందలమంది శవాలు. ఒంటిమీద నూలుపోగులేని మృతదేహాలు. ధర్మస్థల మట్టిలో వాటి అవశేషాలకోసం అన్వేషణ మొదలైంది. నా చేతులతోనే వందలశవాలను ధర్మస్థలలో చాలాచోట్ల పూడ్చేశానంటూ వాంగ్మూలమిచ్చాడో వ్యక్తి. 1995 నుంచి 2014 డిసెంబరు వరకూ ధర్మస్థలలోని దేవాలయంలో పనిచేసిన ఒకప్పటి పారిశుధ్య కార్మికుడి వాంగ్మూలం ఇప్పుడు కర్నాటకని షేక్‌చేస్తోంది. సంచలనం కోసం చెప్పలేదతను. ఆధారాలు చూపిస్తానంటున్నాడు. ఎవరు చేశారో చెబుతానంటున్నాడు. ఎవరూ నమ్మరేమోనని తాను పూడ్చిన ఓ శవం ఎముకలను ఫొటోలు తీసి చూపించాడు. తనను ఎవరైనా చంపేసినా నిజం బయటికి రావాలని తనకు తెలిసిందంతా సీల్డ్ కవర్‌లో పెట్టి సుప్రీంకోర్టు న్యాయవాదికి ఇచ్చాడు. లైడిటెక్టర్ పరీక్షకైనా రెడీ అంటున్నాడు. తాను పూడ్చేసిన మృతదేహాల్లో 12నుంచి 15ఏళ్ల అమ్మాయిలతో పాటు మహిళలు, మగవారు కూడా ఉన్నారని ఆనవాళ్లు చెబుతున్నాడు. తీవ్ర గాయాలు, యాసిడ్ తో కాల్చేసిన మృతదేహాలను అతను పూడ్చేవాడు. లేదంటే చంపేస్తామని పని పురమాయించినవారు బెదిరించే వారు. తమ మాట వినకుంటే కుటుంబాన్ని చంపేస్తామని బెదిరించారంటున్నాడు ఆ సాక్షి.మృతదేహాలు పూడ్చేసి సాక్ష్యాలు లేకుండా చేయడంలో నిందితులకు సహకరించిన ఆ పారిశుధ్య కార్మికుడే ఇప్పుడీ కేసులో కీలక సాక్షి. 2014లో అతని కుటుంబానికి చెందిన ఒక అమ్మాయిని కూడా కొందరు వేధించటంతో కుటుంబంతో సహా రాత్రికిరాత్రి వేరేచోటికి పారిపోయాడు. పాపభీతి వెంటాడిందో ఏమో.. ఆ మృతదేహాలు గుర్తుకొచ్చి నిద్రలేని రాత్రులెన్నో గడిపాడేమో. మౌనంగా ఉండటానికి మనసు ఒప్పుకోవడం లేదంటూ బయటికొచ్చాడు. దిక్కులేని శవాల్లో పూడ్చేసిన ఆ మృతదేహాలకు అంత్యక్రియలు జరిగితే తన అపరాధ భావం కాస్తయినా తగ్గి వారి ఆత్మకు శాంతి కలుగుతుందని భావిస్తున్నాడు. నిందితులెంతో పలుకుబడి ఉన్నవారని, వ్యతిరేకించేవారిని చంపేస్తారని సంచలన స్టేట్మెంట్ ఇస్తున్నాడు. ఈ సంచలనాన్ని బయటపెట్టిన వ్యక్తి వివరాలను రహస్యంగా ఉంచారు. ఇప్పుడంతా అతన్ని భీమా అని పిలుచుకుంటున్నారు. రహస్య ప్రదేశంలో ఉంచి, పేరు, రూపం ఇతర వివరాలు బయటికి రాకుండా చూసుకుం టున్నారు. విచారణ కోసం నలుగురు ఐపీఎస్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది కర్ణాటక ప్రభుత్వం. సిట్ ఐదుగంటలపాటు భీమాను విచారించింది. అతను చెప్పిన 13 ప్రదేశాలలో అధికారయంత్రాంగం తవ్వకాలు మొదలుపెట్టింది. కూలీలు, చిన్న యంత్రాలు, జాగిలాల సాయంతో ధర్మస్థల పరిసరాల్లో మృతదేహాల కోసం తవ్వకాలు ప్రారంభమయ్యాయి. భారీ భద్రత మధ్య నాలుగురోజులుగా తవ్వకాలు కొనసాగుతున్నాయి. మొదట తవ్విన ఐదుచోట్ల ఎలాంటి అవశేషాలు లభించలేదు. కానీ ఆరో ప్రదేశంలో 15 మానవ ఎముకలు, కొన్ని లోదుస్తులు లభ్యమయ్యాయి. అవి ఇద్దరు మహిళలవని ప్రాథమికంగా అంచనావేస్తున్నారు. ఫోరెన్సిక్ పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించారు

# ఎఫ్ 35 విమానాల కొనుగోళ్లకు బ్రేక్



**న్యూఢిల్లీ :** భారత్‌పై అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల పిడుగు వేశారు. పాతిక శాతం సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించారు. దీనికి అనేక కారణాలు చెబుతున్నా.. అక్కసుతోనే ఈ టారిఫ్‌లు వేశారన్నది సుస్పష్టం. బ్రిక్స్‌లో భాగమైనందుకు, రష్యా ఆయిల్ కొంటున్నందుకు, తమ వస్తువులపై ఎక్కువ పన్నులు వేస్తున్నందుకు ఇలా అనేక విషయాలను మనసులో పెట్టుకుని ట్రంప్ భారత్‌పై పిడుగులాంటి టారిఫ్‌ను సంధించారు. ఇది ప్యూర్ మైండ్‌గేమ్‌తో తీసుకున్న డెసిషన్. దీంతో భారత్‌లో పొలిటికల్ దుమారం కూడా చెలరేగింది.ఈ క్రమంలోనే వాణిజ్య ఒప్పందం గురించి భారత్-అమెరికా మధ్య చర్చలు జరుగుతున్నాయి. అయితే, ఈలోగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశంపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఆగస్టు 7 నుండి ఈ సుంకాలు అమలులోకి రానున్నాయి. ఈ నేపథ్యంలోనే భారతదేశం కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. నివేదిక ప్రకారం, అమెరికాకు ఈ-35 యుద్ధ విమానాలను కొనుగోలు చేయడానికి భారత్ నిరాకరించింది. అమెరికన్ ఉత్పత్తుల కొనుగోలును వేగవంతం చేయాలని భారత ప్రభుత్వం ఆలోచిస్తున్నప్పటికీ, అమెరికా నుండి అదనపు రక్షణ ఉత్పత్తులను కొనుగోలు చేసే అవకాశం లేదని అధికారులను ఉటంకిస్తూ బ్లూమ్‌బెర్గ్ తన కథనంలో పేర్కొంది. బ్లూమ్‌బెర్గ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం, ఈ-35 స్టీల్త్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ కొనుగోలుపై ఆసక్తి లేదని భారత్ అమెరికాకు తెలియజేసిందని పేర్కొంది.భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫిబ్రవరి 2025లో అమెరికాను సందర్శించారు. వైట్ హౌస్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కలిశారు. ఈ సందర్భంగా, ట్రంప్ భారతదేశానికి ఈ-35 యుద్ధ విమానాలను విక్రయించడానికి ముందుకొచ్చారు. అయితే దేశీయంగా రక్షణ పరికరాల ఉమ్మడి రూపకల్పన, తయారీపై దృష్టి సారించిన భాగస్వామ్యాలపై భారత ప్రభుత్వం ఎక్కువ ఆసక్తి చూపుతుందని అధికారులు తెలిపారు. దీనిపై భారత రక్షణ మంత్రిత్వ శాఖ ఇంకా స్పందించలేదు.ఆగస్టు 1 నుండి భారతదేశం నుండి దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 25 శాతం సుంకాన్ని ప్రకటించారు. రష్యా నుండి దిగుమతులకు శిక్షాత్మక చర్యగా భారతదేశంపై జరిమానాను కూడా విధించారు. ఇది 25 శాతం సుంకం నుండి వేరుగా ఉంటుంది. భారతదేశం సుంకాలు చాలా ఎక్కువగా ఉన్నందున అమెరికా భారతదేశంతో సాపేక్షంగా తక్కువ వాణిజ్యం చేసిందని ట్రంప్ భావిస్తున్నారు. భారతదేశంపై డొనాల్డ్ ట్రంప్ సుంకాలు విధించిన తర్వాత, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్ పార్లమెంటులో ఒక ప్రకటన చేశారు. సుంకాల ప్రభావాలను అంచనా వేస్తున్నామని, జాతీయ ప్రయోజనాలను పరిరక్షించడానికి, ముందుకు తీసుకెళ్లడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని పియూష్ గోయల్ అన్నారు. రైతులు, కార్మికులు, వ్యవస్థాపకులు, ఎగుమతిదారులు, ఓఎంఇలు, పరిశ్రమలోని అన్ని వాటాదారుల రక్షణ, ప్రోత్సాహానికి మోదీ ప్రభుత్వం అత్యంత ప్రాముఖ్యతనిస్తుందని పియూష్ గోయల్ పార్లమెంటులో స్పష్టం చేశారు.

## రాహుల్ గాంధీ వ్యాఖ్యలను తప్పుపట్టిన కాంగ్రెస్ ఎంపీలు

**న్యూఢిల్లీ :** భారత్, రష్యా సంబంధాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమర్థించడాన్ని సొంత పార్టీకి చెందిన ఎంపీ శశిథరూర్ తప్పుబట్టారు. రాహుల్ వ్యాఖ్యలతో తాను విభేదిస్తున్నానని ఆయన స్పష్టం చేశారు.వాణిజ్య ఒప్పందాల గురించి మాట్లాడుతూ, భారత్-రష్యా ఆర్థిక వ్యవస్థలు ఇప్పటికే పతనమయ్యాయని, వాటిని మరింత దిగజార్చుకోవద్దని ట్రంప్ వ్యాఖ్యానించారు. భారత ఆర్థిక వ్యవస్థ పతనమైందంటూ ట్రంప్ వాస్తవం చెప్పారంటూ రాహుల్ గాంధీ సమర్థించారు. రాహుల్ గాంధీ తీరుపై అధికార పక్షం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పుడు సొంత పార్టీ నేతల నుంచి ఆయన విమర్శలు ఎదుర్కొంటున్నారు.ట్రంప్‌ను రాహుల్ గాంధీ సమర్థించడంపై పార్లమెంటు వెలుపల మీడియా ప్రశ్నించగా, థరూర్ కొట్టిపారేశారు. భారత ఆర్థిక వ్యవస్థ ఎలా ఉందో అందరికీ తెలుసని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మరో ఎంపీ కార్తి చిదంబరం కూడా రాహుల్ గాంధీ వ్యాఖ్యలతో విభేదించారు. ట్రంప్ సంప్రదాయేతర రాజకీయ నాయకుడంటూ చురకలు అంటించారు.


## అనిల్ అంబానీకి కొత్త కష్టాలు

**ముంబై :** రూ.17,000 కోట్ల బ్యాంకు రుణ మోసం కేసులో రిలయన్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్, చైర్మన్ అనిల్ అంబానీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సమన్లు జారీ చేసింది. ఎకనామిక్ టైమ్స్ నివేదిక ప్రకారం, ఆగస్టు 5న ఢిల్లీలోని తన ప్రధాన కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని ఇడి ఆయనను ఆదేశించింది. గత వారం, మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఢిల్లీ నుంచి ముంబై వరకు రిలయన్స్ గ్రూప్‌కు సంబంధించిన దాదాపు 35 ప్రదేశాలపై ఇడి దాడులు చేసింది. ఈ దాడుల సమయంలో, అనేక పత్రాలు, ఆర్థిక లావాదేవీలు, డిజిటల్ రికార్డులు, ఇతర ఆధారాలు స్వాధీనం చేసుకున్నాయి.రూ.10,000 కోట్ల నిధుల మళ్లింపునకు సంబంధించి సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా తన దర్యాప్తు నివేదికను ఇడి, ఇతర రెండు కేంద్ర దర్యాప్తు సంస్థలకు సమర్పించింది. రుణ మొత్తాన్ని ఇతర కంపెనీలకు మళ్లించి, మనీలాండరింగ్ పరిధిలోకి వచ్చే నిర్దేశించిన ప్రయోజనం కాకుండా ఇతర ప్రయోజనాల కోసం ఉపయోగించారని అందులో స్పష్టంగా వివరించింది. రిలయన్స్ గ్రూప్‌కు చెందిన అనేక కంపెనీలు యెస్ బ్యాంక్ నుంచి తగిన హామీ లేకుండా పెద్ద మొత్తంలో రుణాలు తీసుకున్నాయని, షెల్ కంపెనీల ద్వారా ఇతర పనులకు డబ్బు ఖర్చు చేశారని కేంద్ర దర్యాప్తు సంస్థ ఆరోపించింది. ఈ కేసులో సీబీఐ గతంలో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసింది, ఆ తర్వాత ఇడి దర్యాప్తు ప్రారంభించింది.66 ఏళ్ల అంబానీని ఏజెన్సీ ఢిల్లీ ప్రధాన కార్యాలయంలో హాజరు కావాలని కోరినట్లు అధికారిక వర్గాలను ఉటంకిస్తూ ఖుఎ నివేదించింది. గత వారం ఇడి అంబానీ వ్యాపార సామ్రాజ్యానికి సంబంధించిన కార్యాలయాల్లో నిర్వహించిన వరుస హై-ప్రొఫైల్ సోదాల తర్వాత ఈ చర్య తీసుకున్నారు. ఆర్థిక అవకతవకలు, వివిధ రిలయన్స్ గ్రూప్ సంస్థలకు పంపిణీ చేసిన రుణాలను పెద్ద ఎత్తున మళ్లించడం వంటి ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తు సంస్థ జులై 24న విస్తృతమైన దాడులు చేసింది. ఇది ముంబైలోని 35 కంటే ఎక్కువ ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుని వరుసగా మూడు రోజులుపాటు కొనసాగింది. రిపోర్ట్స్ ప్రకారం, ఈ సోదాలు 50కి పైగా కంపెనీలు, 25 మంది వ్యక్తులకు సంబంధించిన ప్రాంగణాలలో సాగినట్టు తెలుస్తోంది. వీటిలో అనిల్ అంబానీ కార్పొరేట్ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న అనేక మంది కార్యనిర్వాహకులు ఉన్నారు.2017 -2019 మధ్య యెస్ బ్యాంక్ అంబానీ కంపెనీలకు అక్రమంగా రుణాలను మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా యెస్ బ్యాంక్ అంబానీ కంపెనీలకు పంపిణీ చేసిన సుమారు రూ. 3,000 కోట్లతో ముడిపడి ఉంది. లంచాలు, అక్రమ రుణ ఆమోదాలు జరిగినట్టుదర్యాప్తు సంస్థ అధికారులు గుర్తించారు. ఇక్కడ యెస్ బ్యాంక్ ప్రమోటర్లు రుణాలు మంజూరు చేయడానికి ముందు వారి వేర్వేరు సంస్థల ద్వారా నిధులు పొందారని ఆరోపణలు ఉన్నాయి. ఈ లావాదేవీలలో నకిలీ లేదా ఓల్డ్ డాక్యుమెంట్స్ ఉన్నాయా, వాటిలో సందేహాస్పద క్రెడిట్ ఆమోదం మెమోలు ఉన్నాయా అని ఇడి ఇప్పుడు పరిశీలిస్తోంది. కొన్ని పెట్టుబడులు బేసిక్ రెస్పాన్సిబులిటీ లేకుండా లేదా బ్యాంకు అంతర్గత క్రెడిట్ విధానాలకు కట్టుబడి ఉండకుండా జరిగినట్టు అధికారులు ఆరోపిస్తున్నారు, ఇది వ్యవస్థాగత ఉల్లంఘనలకు పాల్పడటమేనని భావిస్తున్నారు. గ్రూప్‌లోని రెండు లిస్టెడ్ సంస్థలు, రిలయన్స్ పవర్ ,రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇడి చర్యలను అంగీకరిస్తూ ప్రకటనలు జారీ చేశాయి. కొనసాగుతున్న దర్యాప్తు వారి కార్యకలాపాలు, ఆర్థిక వ్యవహారాలపు, వాటాదారులపై “ఎటువంటి ప్రభావం చూపలేదని” నొక్కి చెప్పాయి. రిలయన్స్ కమ్యూనికేషన్స్ రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ దశాబ్ద కాలం నాటి గత లావాదేవీలపై మీడియా రిపోర్ట్‌లపై మాత్రం కంపెనీలు స్పందించలేదు.కేసు లోతుల్లోకి వెళ్తున్న కొద్దీ, దారి మళ్లించిన నిధులు, మళ్లించడానికి ఉపయోగించిన షెల్ కంపెనీల పాత్ర దేశంలో కార్పొరేట్ పాలన, బ్యాంకింగ్ పారదర్శకతపై అనేక అనుమానాలు కలుగుతున్నాయి.

## రష్యాతో భారత్ చమురు బంధమే..

**న్యూ డిల్లీ :** రష్యాతో భారత్ చమురు బంధమే.. న్యూఢిల్లీతో చర్చల్లో తమకు చికాకు తెప్పించే అంశమని అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియో అన్నారు. .. ‘రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లే ఉక్రెయిన్‌లో మాస్కో యుద్ధ ప్రయత్నాలను నిలబెట్టడానికి సాయపడుతోంది. భారత్ కొంటున్న చమురుతోనే పుతిన్.. ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని కొనసాగిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఇదే మతను ఇబ్బందిపెట్టే అంశమని స్పష్టం చేశారు.ఫాక్స్ రేడియోకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మార్కో రూబియో మాట్లాడుతూభారత్‌కు భారీగా ఇంధన అవసరాలున్నాయి. అన్ని దేశాల్లాగే ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకునేందుకు చమురు, బొగ్గు, గ్యాస్ కొనగలిగే శక్తి భారత్‌కు ఉంది. అయితే, రష్యాపై పలు దేశాల ఆంక్షల వల్ల అక్కడ భారత్‌కు చమురు చౌకగా లభిస్తోంది. దీంతో న్యూఢిల్లీ తమ అవసరాల దృష్ట్యా రష్యా నుంచి చమురును తక్కువ ధరకు కొనుగోలు చేస్తోంది. దురదృష్టవశాత్తూ భారత్ చమురు కొనుగోలు వల్లే రష్యాకు నిధులు సమకూరుతున్నాయి. వాటిని మాస్కో.. ఉక్రెయిన్‌లో యుద్ధం కోసం వాడుకుంటోంది. ఇదే భారత్‌తో చర్చల్లో అమెరికాకు చికాకు తెప్పించే అంశం. ప్రపంచ వాణిజ్యంలో భారత్ వాటాదారు. వ్యూహాత్మక భాగస్వామి. అన్ని అంశాల్లో మాదిరిగా విదేశాంగ విధానంలోని ప్రతి విషయంలోనూ 100 శాతం సమయాన్ని కేటాయించడం సాధ్యంకాదు. అని అన్నారు.

## మా దగ్గర ఆటంబాంబు లాంటి ఆధారాలున్నాయి



భారత ఎన్నికల సంఘంపై లోక్‌సభ లో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి విరుచుకుపడ్డారు. బీజేపీ కోసం ఎన్నికల సంఘం ఓట్ల చోరీకి పాల్పడుతోందని ఆరోపించారు. ఆ విషయాన్ని రుజువు చేసేందుకు తమవద్ద అణుబాంబు లాంటి ఆధారాలున్నాయని చెప్పారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్రంలో ఈసీ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చేపట్టింది. దానికి సంబంధించి ఇవాళ ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసింది. అయితే ఈ సవరణను ముందు నుంచీ వ్యతిరేకిస్తున్న రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రస్థాయి నుంచి ఓట్ల చౌర్యం జరుగుతోందని తాము ఎప్పటినుంచో అనుమానిస్తున్నామన్నారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్రతోపాటు లోక్‌సభ ఎన్నికల్లోనూ అక్రమాలు జరిగాయని రాహుల్‌గాంధీ విమర్శించారు. ఓటరు సవరణ చేపట్టి కోట్లాది మంది కొత్త ఓటర్లను అదనంగా చేరుస్తున్నారని, దీనిపై మరింత లోతుగా అధ్యయనం చేస్తే ఈసీ వ్యవహారం బయటపడిందని చెప్పారు. ఆరు నెలలపాటు తాము సొంతంగా దర్యాప్తు జరిపి ఆటమ్ బాంబు లాంటి ఆధారాలను సాధించామన్నారు. ఆ బాంబు పేలిన రోజు ఎన్నికల సంఘం దాక్కోవడానికి కూడా అవకాశమే ఉండదని రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. బీజేపీ కోసమే ఈసీ ఓట్ల చోరీకి పాల్పడుతోందని, ఇది దేశద్రోహం కంటే తక్కువేం కాదని మండిపడ్డారు. దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న ఏ ఒక్కరినీ తాము వదిలిపెట్టబోమని హెచ్చరించారు. అధికారులు రిటైర్ అయినా, ఎక్కడ దాక్కున్నా కనిపెడతామని వార్నింగ్ ఇచ్చారు.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020, Telangana. **Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail :** voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.